

శివాజీ మహారాజు.

మహారాష్ట్ర చరిత్ర.

ప్రథమభాగము.

చిల్లరిగె శ్రీనివాసరావుగారిచే రచింపఁబడి

మచిలీపట్టణమునందలి

ఆంధ్రభాషాభివర్ధనీసంఘము (లిమిటెడ్) చే

ప్రచురింపఁబడియె.

PRINTED AT THE ANANDA PRESS, MADRAS.

1909.

[వెల రు. 5-0-0.

మహారాష్ట్రచరిత్ర.

అనుక్రమణిక.

ఉపోద్ఘాతము.

ఉ॥ అమ్మ! శివాజియమ్మ! మహారాష్ట్రులఁ బ్రోచిన యమ్మ! శీతశై
లమ్మునఁ బుట్టినమ్మ! మము నందఱఁ గన్న యనుంగుటమ్మ! బం
ధమ్ముల ద్రెంచునమ్మ! వివిధమ్మగు ధర్మములందు నిల్చి వే
షమ్ములఁ దాల్చునమ్మ! కనుదమ్ముల ప్రేమ విశేషముబ్బ రా
వమ్మ! భవాని! దివ్యనుతవాణి మహేశ్వరు రాణి! నిన్ను ని
త్యమ్ము భజింతుమమ్మ విపదంబుధినుండిరి పుత్రులుర్ ప్రశల్ ॥

అని యిష్టదేవతాప్రార్థనంబు చేసికొని ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము వారిచే నియోగింపఁబడినవాఁడనై మహారాష్ట్రచరిత్రను ప్రారంభించి యేతద్గ్రంథంబును [3]ప్రథమ సంపుటంబున [1]మహారాష్ట్రవిజృంభణంబును సవిస్తరంబుగ తెలియపరచుకొంటిని.

మనహిందూదేశమునందు చరిత్రజ్ఞానము అత్యల్పమైయున్నది. పురాణములలోనున్న ప్రాచీనకథలు నిరక్షరకుక్షులైన సామాన్యజనులకు సహితము కరతలామలకంబైయుండెను. అట్టిపురాణజ్ఞానమున లాభమేగాని యాపురాణములలో విశ్వసింప నుద్దేశింపఁబడని పిట్టకథలు సహితము రానురాను మూర్ఖప్రజలకు ప్రమాణంబులుగ గాన్పించుటవలన మఱింతయజ్ఞానంబునకు కారణంబయ్యె. జనులును అట్టిపురాణములందు అనుశ్రుతముగ వచ్చినభక్తివలన నింక తెలిసికొనందగిన విశేషంబులు ప్రాపంచికప్రజాచరిత్రలందుండఁబోవని యొక్క యపోహమువలన సంఘజీవితచరిత్రలను గూర్చి నిర్లక్ష్యంబు సేయఁజొచ్చిరి. అర్జునుండెట్లు యుద్ధంబుచేసెనో, అభిమన్యుడెట్లు వ్యూహంబుసొచ్చెనో, సైంధవుం డెట్లు చచ్చెనో, ధర్మరాజాదు లేమిబాధలంబొందిరో, రాముండు రావణునెట్లుగూల్చెనో మొదలైన మానుషామానుష చర్యలచే మిశ్రితంబులైనకథలు పూర్వ

యుగంబుల నెట్లుజరిగెనో యత్యంతాహ్లాదంబుతో పామరులు సహితము వర్ణింతురుగాని పరదేశీయులువచ్చి మనదేశంబు నాక్రమించినతరువాత మనవారు పడిన పాటులెల్ల ఇంగ్లీషుభాషాపరిచయమున గ్రహించినవారికితప్ప తక్కిన దేశీయ సోదరుల కెల్లరికిని నగమ్యగోచరంబులై యున్నవని వేఱుగ చెప్పనక్కఱలేదు. ఆంధ్రదేశమునం దీ కొఱంతతీర్చుట కెంతయు ప్రయత్నము లిప్పుడు జరుగుచున్నవి. ఆంధ్రభాషాభివర్ధనీ సంఘమువారును తమశక్తికొలంది పాటుపడుచున్నారు.

మహారాష్ట్రులన హిందువులో మహమ్మదీయులో, శివాజీయన కొండదొంగయో లేక ఛత్రపతియో, పీష్వాలు బ్రాహ్మణులో క్షత్రియులో యాంధ్రదేశములో ననేకులు తెలియనేరక హాస్యాస్పదు లగుచున్నవారు. మనదేశము యొక్క చరిత్రయైనను స్పష్టముగ మనవారలకు తెలియకున్నంతకాలమును మన మున్నతికివచ్చు నవకాశంబులేదు. నాగరిక దేశములం దంతటను దేశదేశంబుల చరిత్రలు వారివారిదేశభాషలందు ప్రచురంబులైయుండి తద్దేశీయులకు సర్వప్రపంచజ్ఞానంబును సులభగ్రాహ్యంబు చేయుచుండ మనదేశీయులకు ఆత్మీయదేశజ్ఞానమే కఱవగుట యత్యంత విషాదకరంబు.

మహమ్మదీయులు దక్కనునందు ప్రవేశించి రాజ్యముగ స్థాపించుకొనక పూర్వము మహారాష్ట్రదేశమునకును ఆంధ్రదేశమునకును ఎక్కువ సంబంధము కలిగి యుండవచ్చును. మహమ్మదీయులువచ్చి దక్కనునందు మధ్యస్థానంబున ప్రవేశించి మహారాష్ట్ర యాంధ్రదేశంబులకు గల సంబంధమును విడఁగొట్టిరి. పూర్వకాలమున చాళుక్యవంశరాజులే రెండుదేశములందును రాజ్యము చేసి యుండుటను బట్టియు, మహారాష్ట్రమునందు క్షాత్రంబు నవలంబించిన రాత్తాలనువారే ఇచ్చట రెడ్లుఅయి యుండవచ్చునని, యూహావలన, కనుపడుచుండుట వలనను, అచ్చటకున్బీలని శూద్రుల కుపయోగింపఁబడుపదమే ఆంధ్రదేశమున కమ్మవారని పొగడ్త నొందుటవలనను, ఇంక ననేక యాచార వ్యవహారాదులయందు మహారాష్ట్రులకును ఆంధ్రదేశీయులకును సాజాత్యముకలిగి యుండుట వలనను, మహారాష్ట్రులకు నాంధ్రదేశీయులకును పూర్వమెక్కువ సంబంధ

ముండి యుండవచ్చునని తెలియవచ్చుచున్నది. అంతేకాక పరీక్షించి చూచిన యెడల శరీరలక్షణంబులందు ఆంధ్రదేశమునందలి కొన్ని తెగలవారు మహారాష్ట్రములోని కొన్ని తెగలవారిని పోలియుందురు. మహారాష్ట్ర దేశీయులకును, కన్నడదేశీయులకును, ఆంధ్రదేశీయులకును కల శరీర లక్షణసంబంధము అరవ దేశీయులయందు కానరాదు.

హిందూదేశమునకు రెండుబాహువులవలె పూర్వపశ్చిమ పర్వతంబు లమరియున్నవి. ఈరెండుస్థానములందును మహమ్మదీయుల దాస్యమునుండి మోక్షముకొఱకు ప్రయత్నములుసలుపఁబడినవి. తూర్పున వినుకొండ కొండవీడు దుర్గములందు రెడ్లు మహమ్మదీయులకు లోబడకుండుటకు యత్నములుచేయుచువచ్చిరి. కాని యాప్రయత్నము జాతీయోద్యమంబు గాకపోవుటవలన వెంటవెంటనే యణచివేయఁబడినది. అంతేకాక గోలకొండనవాబులు ప్రజలను విస్తారముబాధించి వారివిరోధమును కల్పించుకొనలేదు. అటుపైన తూర్పుకనుమలలో పశ్చిమకనుమలతోపాటి దృఢమైనస్థానమగు విశాఖపట్నము జిల్లాలోని భాగము కొంతఓఢ్రులస్థానమై గడుమన్యమైయుండెను. వారికిని తెలుగువారికిని విశేషసంబంధము లేకపోయెను. అంతేకాక తూర్పుకనుమలు పశ్చిమమున నుండి ప్రవహించుచున్న కృష్ణా గోదావరీనదులవలనను మరియితరప్రకృతి కారణములచేతను ముక్కలుముక్కలుగా తెగఁగొట్టఁబడి పశ్చిమాద్రి పంక్తివలె నొక దట్టమై ఛిద్రశూన్యమైన పర్వతపంక్తి కాకయుండెను. కావున నిచ్చోట నభేద్యంబగు తిరుగఁబాటు జరుగలేదు. జాతీయోద్యమంబగు మొదటి తిరుగబాటు పశ్చిమపర్వతములం దుదయించుట కనుకూలమైన కారణములన్నియు గ్రంథమున వేఱుగవర్ణింపఁబడియున్నవి. దేశమంతయు పరదేశీయుల అధీనమయి యున్నపుడంతమాత్రము మహారాష్ట్రులు చేతనైన సంగ్రామంబుచేసి, మరలదానిని కొంతవఱకు సంపాదించియుండకున్న, హిందువుల కింకనుఅవమానంబు వాటిల్లియుండెడిది. వారాకార్యమును చేయుటయం దనేకలోపములను గావించి సఫలీకృతమనోరథులు కాకపోయినను, కొంతవరకు హిందువుల యొక్కకీర్తిని కాపాడిరి. ఆసంగ్రామమొక్క మహారాష్ట్రులదే యైనను, ఆపేరు

చెప్పుకొని తద్బాంధవ్యజనిత గర్వంబుచే, నేడు అత్యంత శోకాంధకారం, బున, కించిజ్జ్యోత్స్నా కలితామోదంబున మనమందఱము నుంటిమి:

ఉ. భారతమాతభాగ్యమటు పశ్చిమదిక్కును పట్టిపోవ నా
సారనగేంద్రపంక్తిపర చారుమహోన్నత దుర్గముల్ గలిన్
ధీరతతో డనడ్డుపడి దివ్యమహాంబువు లంతగొన్నిటిన్
చేరిచె భూతలమ్మున సచేతను లైతిమి కొంత దానిచే.

ఇట్లు హిందుదేశంబున ననివారణ సాంఘికాచార ప్రచండతీక్ష్ణంబుచే ఆర్యజనశౌర్యంబు మేఘంబుగట్టి పశ్చిమదిక్తటంబు పట్టిపోవుచుండ,

'అకటకట! కూటకోటివిటంక శృంగాట కాఘాకమాన జరదిందు బింబ గళ దుర్వినాద్రికృత సల్లకీపల్లవ ప్రభంజనపరాంజన హస్తిహస్తంబగు నస్తం బునంగల మణిప్రస్తరంబుల విశ్రాంతిఁ దలంచిన మేనపులక లిప్పుడునుం బొడమెడి'

అని అల్లసాని పెద్దనచే వర్ణింపఁబడిన యా పశ్చిమాద్రియొక్క చల్లదనం బున నామేఘంబు కరిగి బలసత్వదాయకంబులగు జలంబులు భరతవర్షంబుపై జాలపడి యిప్పటికిని మనయుల్లంబుల కొంత పల్లవింపఁజేయుచున్నవి.

ఈ మహారాష్ట్రశక్తియొక్క ప్రవాహము భరతవర్షమునందు నలుదిక్కు లకును ప్రవహించుచున్నది. ఆశక్తివలన పూర్వము తక్కిన దేశభాగముల వారికి గలిగిన నష్టమిప్పు డాలోచింపఁబడుట లేదు. అందువలనకలిగిన ఫలమే యిప్పు డు గుర్తింపఁబడుచున్నది. గంగా గోదావరి కృష్ణ మొదలైన నదులు వెల్లువలై పొంగివచ్చి యనేక జనపదంబుల నెల్ల నూడ్చిపెట్టి నప్పు డతిక్లేశసముద్రంబున ప్రజల ముంచినను, తరువాత నెల్లస్థలంబుల నొండు గూర్చి మరుసటి సంవత్సరం బున సర్వసస్యఫలదాయినిగా దేశమును శోభిల్లంజేసినపుడు పూర్వక్లేశం బెల్ల మర పునం బెట్టుజొచ్చునో, యటులనే యీమహారాష్ట్రశక్తియు నిర్మూలంబుగ నేడు పరీక్షింపఁబడిన ననేక గుణపాఠంబులనొసంగుచు, ధైర్యోత్సాహసమన్వితులం జేయుచు, ఐకమత్యసంధాయిని యగుచు నెగడుచున్నది. అట్టి మహారాష్ట్ర విజృంభణము నేఁ డాంధ్రులకు దృగ్గోచరంబుకాగ నేమని వర్ణింపవచ్చును!

సీ. సహ్యాద్రిజన్మించి సమదేశములఁ జొచ్చి వెల్లువలై పాఱి వీరవరుల
దాహంబుఁ దీర్చుచు ధైర్యంబునిచ్చుచు జవసత్వసంపదల్ నరగఁ గూర్చి
లోకులఁ దనియించి లోభిత్వమునుమాన్పి సాహససస్యముల్ చాలఁ బెంచి
యభిమతార్థములిచ్చి యఖిలహిందూజనసంసేవ్య యగుచుప్రశస్తినొంది,

గీ. పుష్కలాంబుసమృద్ధితోఁ బొరలుకృష్ణ
లీలఁగలుషంబులన్నియుఁ దూలఁజేయు
చాంద్రమునకభ్యుదయ సిద్ధినందఁజేయ
వచ్చెమహారాష్ట్రశక్తియవ్వారిగాఁగ. ॥

ఈ మహారాష్ట్రుల విజృంభణము మొదట శివాజీచే ప్రారంభింపఁబడినపుడు మహమ్మదీయ విద్వేషంబున కాలవాలమైయుండెను. తరువాత నప్పుడప్పుడు ఆ విరోధంబు ద్యోతకంబగుచునే వచ్చెను. అట్టి యెడ మహారాష్ట్రచరిత్ర పఠనమును, తద్గ్రంథమునందలి అఫ్జుల్‌ఖాను హత్యామొదలైన కృత్యములస్మరణమును, హిందూమహమ్మదీయ విద్వేష కారణము లగును కాన ప్రస్తుతము హిందూమహమ్మదీయ సమస్యతేటబడవలసిన కాలమున అవలోకనమునకంత ప్రశస్తమైన గ్రంథముగ మహారాష్ట్రచరిత్రయుండఁబోదని కొందఱు తలఁచవచ్చును. కాని ఈ విషయమునందువనము మహారాష్ట్రులను గూర్చి విచారించవలసిన ఫక్కి వేఱుగనుండవలె. హిందూదేశమునందు తక్కిన హిందువు లందఱును జాతివర్ణభేదములయెడల నెంత మూర్ఖభక్తితో నుండిరో మహారాష్ట్రులు నంతే భావనమునందున్నారు. కాని తక్కిన దేశభాగములవారికంటె వీరు శక్తిమంతులగుటవలన తమ విరోధభావమును కార్యరూపంబున ద్యోతకంబు నేసిరి. హిందూమతము ఒక్కసారి స్తంభితమైన తరువాత పరదేశీయులను పరజాతీయులను తమ జాతిలో కలియుటకుగాని, తమ జాతిలోనియొక వర్ణములోని వారిని మఱియొక్క వర్ణములోనికిని ఒకవృత్తివారిని మరియొక వృత్తిలోనికిని పోనిచ్చుటకుగాని, హిందువులంగీకరింపరైరి. మహమ్మదీయులు తమకరవాల సహాయంబున హిందువుల ననేకులను తమ జాతిలో కలుపుకొనుచుండిరి. మఱి కొందఱు హిందువులు లౌకికలాభములకొఱకు మహమ్మదీయ మతంబును స్వీక

శించుచుండిరి. హిందువులు తమబోధవలన నితరులను హిందుమతమునందు కలుపుకొని తమ సంఖ్యనువృద్ధిచేసికొని, తమ ధర్మమును వృద్ధిచేసికొనకపోవుటయేగాక, పొరపాటునగాని గ్రహపాటున కాని బలవంతమునగాని మోహమునగాని పరమతంబు చేరి పశ్చాత్తప్తులైన వారిని మరల తీసికొననైన నొల్లకొండిరి. ఇట్లు మహమ్మదీయుల సంఖ్య దేశమునందు వృద్ధియగుచు వచ్చెను. తదనుగుణంబుగ హిందువుల సంఖ్యపలుచనగు చుండెను. కావున వారును ఆత్మరక్షణము కొఱకును, స్వధర్మ రక్షణ కొఱకును కేవలము శత్రుభావము పూని మహమ్మదీయులను సాధింప వలసిన వారైరి. పూర్వము తమ హిందువులేయై, ప్రస్తుతము మహమ్మదీయులై క్రొత్తసమస్యను తెచ్చిపెట్టిన నూతన మతావలంబకులును దేశీయులునగు మహమ్మదీయులను, మిత్రత్వమున మరల తమ జాతిలోనికి తీసికొనివచ్చు మార్గము వారెరుగరైరి. కబీరు నానకు మొదలైన వారు కొంతవరకు పనిచేసిరిగాని పూర్ణముగా వారు సఫలీకృత మనోరథులుగా లేదు. ఈ వైరమే హిందూ మహమ్మదీయులకు కలహములను తెచ్చి పెట్టినది. మహమ్మదీయులును అదే ప్రకారముగ దేశముయొక్క మేలును పాటింపక ఈ మత్సరమోహము నంటె పడుచు వచ్చిరి. హిందూ మహమ్మదీయ ద్వేషమే పానిపట్టున రక్తనదులఁ గల్పించినది. ఈహిందూమహమ్మదీయ ద్వేషము దక్షిణమున తల్లికోట యుద్ధమున రక్తనదులఁ జూచినది. కావున మహారాష్ట్రులు కనుపరచిన లోపము హిందువుల యొక్క సాంఘిక నిర్మాణము నందే యున్నదికాని కేవలము వారిలో మాత్రమే లేదు. ఎప్పుడా లోపము హిందూసంఘము నుండి తొలగునో అప్పుడే హిందూ మహమ్మదీయ సమస్య కరతామలకమై యుండును. మహారాష్ట్రి చరిత్రను చదివిన యెడల ఇట్టి సుబోధకంబులగు పాఠంబు లనేకములు మన యనుభవమునకు వచ్చును.

పై చెప్పిన ప్రకారము హిందుజాతి తనలో వచ్చి కలసిన వివిధపరదేశ జాతులను కరగించుకొను శక్తిని కలిగియుండకపోవుటవలననే హిందూదేశమందు హిందూమహమ్మదీయ సమస్యయు మరి యనేక సమస్యలిదివఱకు పుట్టియున్నవి, ఇక ముందుపుట్టనున్నవి. హిందూక్రిస్టియను సమస్యకూడ నదేవిధ

ముగ ముందు పైన నెదుర్కొనకలదు. పూర్వకాలమందు మహమ్మదీయులు మనదేశమునందు ప్రవేశించినవారు కొలదిమంది. ఇచ్చట మహమ్మదీయులలో కలసిన వారనేకమంది. ఈ యనేకమందియు బలత్కారముచేతనే చాలవరకు మహమ్మదీయులలో కలసియుండిరి. ఇందలి చోద్యంబు చూడుడు! ఎవరు బలాత్కారముగా, తమ కిష్టములేకుండ, మహమ్మదీయులందు కలుపఁబడిరో అట్టివారును, వారి సంతతివారును, పూర్వము తమకు మహమ్మదీయులవలన పరాభవంబు జరిగినను, అందు కలసినతరువాత పూర్వవిచారమును మఱచి మరల పూర్వబంధువులగు హిందువుల నింకను కలుపుటకు బలాత్కారంబు తాము నేయఁ దొడంగుచుండిరి. పూర్వవృత్తాంతమెల్ల మఱచిరి, తమ కనిష్టమైన కార్యమునే తాము మఱల చేయుచుండిరి. వీరందఱును మరల హిందువులచే స్వీకరింపఁబడినయెడల హిందువులకు విరోధమైన యీమహమ్మదీయశక్తి యింత ప్రబలియుండక పోయెడిదేకదా! అనగానేమి? హిందువులే తమకు విరోధమగు శక్తిని, తమయందలి లోపములచేతనే కల్పించుకొని, దాని సాధింప దామేదలపడి, తమలో తామే విరోధులమనుకొని, యజ్ఞానముచేత పరస్పర నాశనమును చేసికొనుచుండిరి. మహమ్మదీయులు తాము పూర్వము హిందువులేయనియు, బలాత్కారముగ మహమ్మదీయులమైతిమనియు, ఉభయ మతముల నిప్పుడు పరిశీలించి యేమతము బాగుండిన నద్దాని స్వేచ్ఛగ నిప్పుడు స్వీకరింతమని ధారాళమైన మనస్సుతో యోచించినను, హిందువులు మహమ్మదీయులందఱు పూర్వము హిందువులేయనియు, బలాత్కారముగ నట్లు చేయఁబడిరనియు, ఇప్పుడు మరల హిందువులు కావలచిన తమ జాతిలోనికి తీసికొనవలయుననియు పరస్పర మతసహనముకలిగి యుండవలయుననియు యోచించినయెడలను, హిందూ మహమ్మదీయ సమస్యనిమిషములో తేలిపోవును. హిందూక్రిస్టియను సమస్యకూడ నిట్లు విచారించిననే ముందు కలుగకుండపోగలదు. అట్లుగాక హిందువులు అన్యజాతులవారిని, తమ దేశమునకువారువచ్చి, స్థిరంబుగనున్నను, వారు తమలో కలియదలచుకొన్నను, కలియనియ్యకుండిన యెడల ఈ దేశమున ననర్థకములగు ననేకసమస్యలు పుట్టుచు మన

యేకజాతీయ నిర్మాణమున కడ్డమగుచునే యుండును. ఇంతకు తారాప్రాణముగ నింగ్లాండుదేశమునకు డేనులు నార్మనులు మొదలైనవారు వచ్చి యాక్రమించుకొనిరి. కాని యచ్చట నేడు డేనులు, నార్మను లేరీ? అందఱును జాతీయ సంఘముజలంబులందు లవణంబు రీతి యంతర్ధానం బోయిరి. ఇప్పుడందఱు నింగ్లీషువారే. ఒక్క దృఢమైన సంఘమచ్చట బుట్టెను. కాని హిందూ సంఘజలంబులు పరజాతీయులను జీర్ణించుకొనఁ జాలవు. అందు వలననే పలు జాతులు పలువర్ణములిందు అనాదిగ వైరంబుతోడ బెనగులాడుచునే యుండెను. ఇప్పు డీహిందూ జాతీయ జలంబు లేదివచ్చిలోపల పడిన నద్దాని హరించి దానికి స్వతంత్ర రూపంబు లేకుండఁ జేయువలెను. ఇయ్యది మిత్రత్వంబున సాధ్యమగును కాని శత్రుత్వమున సాధ్యపడనేరదు. హిందువులు మహమ్మదీయులను రూపుమాపి యేకజాతీయతను నిలువంబెట్ట నూహించి యుండవచ్చును. మహమ్మదీయులు హిందువుల నెల్ల బలవంతంబున మహమ్మదీయులను చేసి యేక జాతిత్వమును స్థాపింపఁ దలంచి యుండవచ్చును. ఈ రెండు ప్రయత్నములును వ్యర్థములును, ఈశ్వరోద్దేశ విరోధములును అని మనము మహారాష్ట్ర చరిత్ర వలన దెలిసికొనఁ గలుగుదుము. కావున నుభయ జాతుల వారును తమతమ యహంకారజనిత వైషమ్యములను మాని చరిత్రలను పరిశీలించి, తమలోని లోపముల వలన పడిన పాటులను తెలిసికొని వానినిసవరించుకొనుటమంచిది. హిందూమహమ్మదీయ వైరములు వారి సంఘనిర్మాణములో నున్న లోపములవల కలిగినవి కాని వాని నిప్పుడు స్మరించుకొని మనము వివాదపడఁ దగినవి కావు. హిందువులు మహమ్మదీయులనే బాధించిరని చెప్పనేల? మహమ్మదీయులే హిందువుల నెక్కువ బాధించి యుండిరని ప్రసిద్ధమై యున్నది. ఈ విషయమున నుభయులు నొండొరుల పూర్వసంబంధజ్ఞానంబును మరచి పోరాడుకొనినచో నిందాపాత్రు లగుదురు. ఒకవేళ కలహములు జరిగినను వానినిఁ బట్టి మనము ముందు బుద్ధి యెరింగి యుండవలెనే కాని జ్ఞాపకముంచుకొని వైరంబు నొందఁగూడదు. మహారాష్ట్రిలలో, వారిలో వారుకొంకణస్థులును దేశస్థులును, బ్రాహ్మణులును క్షత్రియులును, క్షత్రియులును క్షత్రియులును, మంత్రులును మంత్రులును, అధి

క్యతకొఱకు పోరాడియుండలేదా? అయినను ఇప్పటికిని ఆసందర్భములు జ్ఞప్తికి తెచ్చికొని యీ యాపక్షములవారు పోరాడుచుండిరా? మహారాష్ట్రులు గడి దేశములుజొచ్చి యచ్చటి వారిని బాధించియుండ నిప్పటికిని యది జ్ఞాపకముం చుకొని యచ్చటివారలు మహారాష్ట్రులయెడ నీర్ష్యనుగలిగి యుండిరా? ఇంగ్లీషువారికిని స్కాచివారికిని ఘోరయుద్ధంబులు జరిగెను. ఇప్పుడు వారొక్కటిగనుండలేదా? మొదట ఇంగ్లాండునుండియే వెడలిన అమెరికన్లు తరువాత ఇంగ్లీషువారిపై తిరుగఁబాటు చేయలేదా? విరోధములైనను, స్నేహములైనను, విశ్వాసములైనను ద్రోహములైనను సమకాలీనులకేగాని మరి తరతరములవరకు నిలుచునా? ఏయేకాలముల కేదియేది ధర్మమో అయ్యది యొనర్చుచు ప్రవర్తింపవలెనుగాని వెనుకటి వైషమ్యములను జ్ఞాపకముచేసికొని ప్రస్తుతాదర్శమును పరిత్యజించినచుచుట బుద్ధిమంతులకు లక్షణంబుగాదు.

ఈ సందర్భమున వేమన చెప్పిన నీతివాక్యమొకటియు స్మరణీయంబు.

క. మరువవలెఁ బాపసంగతి
మరువంగావలెను దురముమరి విశ్వములో
మరువవలె నీర్ష్యలన్నియు
మరువంగా వలదు మేలు మహిలో వేమా ॥

ఈప్రకారము మహారాష్ట్ర విజృంభణము వలన దేశీయులకు కొంతవఱకు కలిగిన కష్టముల నెల్లమరచి యందువలన మనకు లభించిన శౌర్యపౌరుషంబులను, కీర్తివిశేషంబులను జ్ఞాపకముచేసికొనుచు, అనుభవజ్ఞానమును పొందవలెను. పరదేశీయులు ఈ విజృంభణముయొక్క సారస్యమును తిన్నగ గ్రహింపఁజాలరు. వారు వ్రాసిన పెక్కుగ్రంధములలో నీ విజృంభణము సంకుచితంబుగ వర్ణింపఁబడెను. అట్టి గ్రంథములనుండి జ్ఞానంబును సంపాదించిన దేశీయులు దానిని గూర్చి చులకనగా సంభాషింతురు. మన దేశీయులందఱకును మహారాష్ట్ర విజృంభణమును గూర్చి సరియైన యుపదేశములుచేసినవారు మహానుభావుడగు మహాదేవగోవిందరానడేగారు. తదుపదేశముల నవలంబనంబుగఁ గొని మహారాష్ట్రచరిత్రచదివి చూచినయెడల నాచరిత్ర యొక్క సార్థక్యము మనకు చక్కగ.

బోధపడగలదు. ఏతద్గ్రంథములోని సారాంశములన్నియు నీ తెనుగు గ్రంథమునందు విస్తరించి వ్రాయబడియున్నవి.

ఇంతేకాక పూర్వకాలపు ద్వేషము లింకను మనస్సునందు వర్తించుచుండునని చెప్పసంగతి కింకొక ప్రత్యుత్తరముకూడ చెప్పవలసియున్నది. శివాజీ మొట్టమొదట మహమ్మదీయ ద్వేషముతో తనయుద్యమమును బయలుదేరదీసినప్పటికిని అది కేవలము మహమ్మదీయరాజుల యొక్క యన్యమతదుస్సహన జనిత దౌర్జన్యంబుల యెడలనే ప్రేరేపింపఁబడినట్లు స్పష్టముగ గానవచ్చుచున్నది. అంతేకాక శివాజీమహమ్మదీయ కాల్బలమును తన సేవయందుంచుకొనెను. తరువాత పీష్వాలకాలములో ఇబ్రహీముఖానుగార్దీ మొదలైన మహమ్మదీయ సేనాపతులు విశ్వాసముతో మహారాష్ట్రిల పక్షమునమండి తమ సోదర మహమ్మదీయులతో పోరాడియుండిరి. మహారాష్ట్ర సేనాపతులును, బ్రాహ్మణమంత్రులును, రాజపుత్రయోధులును మహమ్మదీయుల పక్షముననుండి హిందువులతో పోరాడలేదా? మహమ్మదీయ రాజులు హిందువుల సహాయముచే యితర మహమ్మదీయ రాజులనోడించి యుండలేదా? హిందువులు తమలోపోరాడుకొని మహమ్మదీయ రాజులను సహాయము కోరి యుండలేదా? వేయేల! హిందూదేశములో నన్నిజాతులవారును జీతములకొఱకు పరదేశీయులను పరజాతీయులను కొలువుచేసి తమ సోదర దేశీయులతోపోరాడి యుండలేదా? కావున కేవలము హిందూమహమ్మదీయ ద్వేషమునుగూర్చి యే ప్రాముఖ్యతతోనీ విజృంభణమును గూర్చి విచారింప నక్కరలేదు. హిందూదేశమునందు ఏకజాతీయభావంబు లేకపోవుటయే ఏనన్నిటికిని ముఖ్యకారణము. మహమ్మదీయులలో నెప్పుడో యొక్కొక పర్యాయము కార్యసాధనముకొరకు కొందఱు నాయకులు తన్మతావలంబకుల యందు మతోద్రేకమును కల్పించుటకు ప్రయత్నించుచు వచ్చిరి. అంతియేకాని తీవ్రమైన హిందూద్వేషము మహమ్మదీయుల కా కాలముననేలేదు. తీవ్రమైన మహమ్మదీయ ద్వేషము హిందువులకు ఆకాలములోనేలేదు. అట్టియెడ నేటి కాలమునందది కలుషహృదయంబులో బుద్ధిపూర్వకముగ మనచే కల్పింపంబడినగాని, కలుగనేరదు.

మనహిందూదేశ చరిత్రయొక్క వివిధ కక్ష్యాంతరంబులను విచారించుచు నందు మహారాష్ట్రచరిత్రంబుయొక్క నిమ్నోన్నతస్థానంబులను విమర్శించుచు మన ప్రస్తుతావస్థ తదనుగుణంబుగ నున్నదో లేదో చూచిన మన సంఘనిర్మాణంబుయొక్క లోపాలోపములు తేటపడఁగలవు. హిందూదేశము మిక్కిలి పెద్దదేశమై యనేకనదులచేతను, అరణ్యములచేతను, పర్వతములచేతను చిన్నచిన్నభాగములుగ తెగకొట్టఁబడియుండుటవలన ననేక భిన్న ఆచారములకును, భిన్న అంతరజాతులకును, భిన్న రాజ్యములకును ఆలవాలమైయుండెను. ఉత్తరమున హిమాలయములచేతను మూఁడుదిక్కులను సముద్రములచేతను చుట్టఁబడియుండి యొక్కజాతివారికి మాతృభూమికాదగిన లక్షణములను కలిగియున్నను పైచెప్పినకారణములచేత పలుజాతులలోనికి చీలిపోయినది. ఈభిన్నభిన్న జాతు లన్నియు సాంఘికాచరబంధనంబుల ద్రెంచుకొని యొక్క జాతిలోనికి మారుటకుగాను పలుబాముల బడినదో యన్నట్లు మన సాంఘికజీవితసంగ్రామంబు పొడగట్టుచున్నది. అందుకుగాను మొట్టమొదట దేశములోనివివిధభాగములయొక్కరాజులును తమలో తాము పోరాడి ఏకచ్ఛత్రాధిపత్యము ఉదయాస్తాచల సేతుశీతనగమధ్యమున కంతకును, నిలువఁబెట్టవలెనని ప్రయత్నించిరి. ఈ యుద్ధములవలన ననేక ఈర్ష్యలుపుట్టినవి, అనేక కలహములుజరిగినవి. పరదేశీయులగు మహమ్మదీయులు వచ్చిరి. ఏకవ్యక్తి పరిపాలనక్రింద నింత గొప్పదేశముండుటకు వీలులేదుకావున దక్కనునందింకొక్క రాజ్య మేర్పడెను. ఏకవ్యక్తి పరిపాలన స్థిరమైన ఇంకొక యధికారముచే సవరింపఁబడుచుండినఁగాని నిలువఁజాలదు. అట్టి పరిపాలనచేయువాడు సమర్థుడైనను వానియనంతరమున వానికుమారులలో కలహము పుట్టినఁగాని, లేక యొక్కకుమారుడేయైన యసమర్థుడైనకాని, లేక నిస్సంతుడైనవానియొక్కవారసు నేర్పాటుచేయఁబడుటయందు వివాదములు పుట్టిగాని యారాజ్యము బలహీనమగును. అట్లు ప్రధానస్థానము బలహీనమైనతోడనే సామంతరాజులెల్ల సమాన స్వతంత్రమును పొందగోరుదురు. ఈకారణముచే మహమ్మదీయుల రాజ్య మేకవ్యక్తిపరిపాలనయగుటచే బలహీనమై శివాజీయొక్కచేతిలోఁ

బడెను. శివాజీ పరిపాలనమును ఏకవ్యక్తి పరిపాలనయే యగుటవలన నదియు నద్దానికి సహజమగు వ్యాధికి లోఁబడెను. కాని బాలాజీ విశ్వనాథుడు సామంత మహారాష్ట్రవీరులనెల్ల సమాన గౌరవంబున నిల్పి రాష్ట్రకూటంబుఁ జేర్పరచెను. కాని ఈరాష్ట్ర కూటంబుయొక్క వివిధరాష్ట్రములందును మరల ఏకవ్యక్తి పరిపాలనంబులే యైయుండెను. వాని నన్నిటిని సవరింపఁదగిన ప్రధానస్థానంబగు పీష్వాస్థానముకూడ నేకవ్యక్తి పరిపాలనయే యైయుండెను. కావున నెప్పుడైతే రఘునాథరావు నారాయణరావును చంపి యరాజకంబును సృష్టించెనో యానాఁడే యేకవ్యక్తి పరిపాలనయొక్క యతి నికృష్టఫలంబు కానవయ్యెను. తరువాత నానాపడ్నవీసుమొదలైనవారు ప్రాణముపోకుండ బలవంతముమీద రాజ్యమును పట్టియుంచినప్పటికి నాదుర్గతికి మార్గము పట్టుచునే యుండెను. రాష్ట్రకూటములోని వివిధమహారాష్ట్రవీరులును కూడ కార్యంబు చేయుచున్నంత కాలమును ఇంగ్లీషువారు వారిని జెనకఁజాలకుండిరి. కావున రాష్ట్రకూటముయొక్క బంధము పట్టుతప్పిపోవునంతవరకును ఇంగ్లీషువారు మహారాష్ట్రదేశములో జోక్యము కలుగజేసికొని యుండలేదు.

మహారాష్ట్రచరిత్రను చదువు ప్రతిసామాన్యపాఠకునికి నొక్కయంశము తోఁచకమానదు. డిల్లీచక్రవర్తి, దేశమునందుండియు, పూనాపీష్వా, దేశమునందుండియు, సామంతరాజులనెల్ల నదపులో నుంచుకొనుట కెన్నియో కష్టములుపడి యశక్తుడైయుండ, అనేకవేల మైళ్లదూరములో శ్వేతద్వీపములో నున్న కోర్టుఆఫ్ డైరెక్టరులు ఇండియాలోని తమ యుద్యోగస్థుల నందఱి నెట్లదపులో నుంచగలిగిరోయని యాశ్చర్యము పుట్టకమానదు. ఈస్టిండియా కంపెనీయొక్క యుద్యోగస్థులు కొందఱు లంచములు తీసికొనియు, కొందఱు రహస్యముగ స్వంతవ్యాపారము చేసికొనియు, యనేక యక్రమ కార్యములు తమ యజమానులయెడలనే చేసియున్నట్లు మనకు అప్పటి రికార్డువలన తెలియవచ్చుచున్నది. హిందువులు పరదేశమునుండి సాహసకార్యములు చేయవచ్చినవారందఱికిని తమసంఘమునందు తావప్పు డిచ్చియుండిన యెడల నా యుద్యో

గస్థు లనేకులా కాలములో మనదేశమునకే అతుకుకొని పోయెడివారు, ఈభూమికే వారును దత్తపుత్రులయ్యెడివారు. ఆకాలమునందు ఇండియాకు వచ్చినవారికి సామాన్యముగ మరల తమదేశంబునకు పోవు నాశ యుండెడిదికాదు. కావున క్లైవు వారన్ హేస్టింగ్సు మొదలైనవారు, విదేశీయు లనియు, జాతిబాహ్యులనియు దేశీయులచే నసహ్యముగఁ జూడబడక పోయినయెడల, ఇక్కడనే దేశీయుల సహాయముచే, మొగలు అఫ్గనువీరులవలెనే రాజ్యములను స్థాపించుకొని యుండెడివారేమోయని తోచుచున్నది. దేశీయులు పరదేశీయవ్యక్తులయెడల నట్లు ద్వేషముతో చూచుచుండుటవలననే, వారికిని, వారిదేశముయెడలను, వారిదేశీయులయెడలను, దూరముగనున్నను ప్రేమగౌరవము లెక్కువగుచువచ్చెను. కావున దేశీయులయొక్క వారియెడల ద్వేషమే వారి మాతృదేశబంధమును మరింత దృఢంబు చేసెను, అందువలననే ముఖ్యముగ నింగ్లాండులో నున్నప్పటి యధికారులగు కోర్టుఆఫ్ డైరెక్టరులు ఇచ్చటి వారియుద్యోగస్థులను సరియైన యదుపులో నుంచగలిగిరి. కావున మనద్వేషమే వారి కనుకూలమయ్యెను. మనద్వేషమువలననే మన మింక ననేక బాధలఁజెందిగాని మన గమ్యస్థానము చేరలేకయుంటిమి.

హిందువులయొక్క రాజ్యము ఇంగ్లీషువారిచేతులలోనికి పోవుటకు కారణము మనయందుకంటె వారియందు అంగనిర్మాణ మెక్కువ దృఢంబుగ నుండుటవలననే యనుట నిశ్చయమే కాని యీ యంగనిర్మాణ మాకాలములో మనము వారియెడలఁజూపిన ద్వేషమువలననే నిలిపి యుంచబడినది

ఈ యన్నిదోషములకును మూలకారణము మనలోనున్న వర్ణభేదమని వేరుగ చెప్పనక్కరలేదు. ప్రతి జాతివారియందును ఒకవిధమైన వర్ణభేద ముండును గాని మన యందున్నంత కఠినముగ నది యెచ్చటను ఉండదు. ఒక్కజాతియే బ్రహ్మయొక్క యాకారముగఁ దీసికొనినయెడల నందు బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రులు క్రమంబుగ ముఖబాహూరుపాదంబులకు సంబంధించినవారని చెప్పుటొప్పు. కాని శరీరమునందలి అంగములన్నిటికి నొకేవిధమైన రక్తంబు ప్రవహించుచు పుష్టినిచ్చుచుండు విధంబుననే, సంఘమునందలి వ్యక్తు

వారివారిసహజగుణముల కనుగుణంబుగ నాయావృత్తివర్ణముల కిప్పటికప్పుడు జేరుచుండవలయును గాని యొక్కచోటనే స్థిరంబుగ నుండఁజనదు. ఇట్లు వర్ణభేదంబు నతికఠినంబు జేసికొని మృతదేహంబు పగిది సంఘంబును జీర్ణంబు నొందఁ మనము చేసికొనినవారమైతిమి. ఈకారణముననే బ్రహ్మలాధిక్యత లోనికి వచ్చుచున్నారని క్షత్రియులును, క్షత్రియులాధిక్యతకు వత్తురేమో యని బ్రాహ్మణులును, మనస్పర్థలచే కలహములకు గడంగిన సందర్భములు మనము మహారాష్ట్రచరిత్రయందు చూచుచున్నాము. హిందువు లెంత సంఖ్యకలవారైననేమి, ఎంతశౌర్యము కలవారైననేమి, ఈజాడ్యంబుచే నీరసులగుటవలన చిట్టచివరకు లోబడవలసినవారైరి. కావున మహారాష్ట్రులు వారినివారే జయించుకొనిరి. వారిఅంతశ్శత్రులే వారినోడించెను. వారుపరులవలన పరాభవంబు నొందలేదు. హిందువులందఱకును ఈమహారాష్ట్రచరిత్ర మంచినీతిని బోధించును, మంచి భవిష్యన్మార్గమును చూపును.

సీ. నిజచరిత్రజ్ఞాన నిబిడాంధకారంబు పాఱఁదోలెడునట్టి పద్మహితుఁడు
మహారాష్ట్రజనముల మనబంధువులుగాగ మనమునఁ జేర్చెడు మహిమకాడు
మనలోపములనెల్ల మతికెక్క బోధించి దక్షిణాపిరక్షించు గురువరుండు
ధైర్యసాహసముల ధనసంపదలనిచ్చి దాతయై పెంపెక్క ధార్మికుండు

భువినినుతికెక్కయమర విభూతినొంది
భారతాకాశపర శీతభానుడనగ
ఆంధ్రజనులకు మానసానందమిచ్చి
కీర్తిమహారాష్ట్రచరితోరు మూర్తిబడయు.

ఈమహారాష్ట్రచరిత్ర గ్రంథము చదువరులకు పెద్దదిగాఁ దోచవచ్చును, ని యింతమాత్ర గ్రంథము ఆంధ్రభాషయందు లేనియెడల ఆంధ్రజనులకు మహారాష్ట్రులనుగూర్చి సరియైన యభిప్రాయము కలుగనేరదని నా పూర్ణమైన విశ్వాసము. ఇందు అనేక కథావిశేషములును, రాజనీతి విచారణలును, సవిస్తరముగ పొందుపరుపఁబడియున్నవి. సామాన్యచదువరులకు రంజకముగ నుండు

నటులను, విమర్శనాపాఠకునకు కావలసినంతచరిత్ర సామగ్రియుండునటులను గూడ చాల ప్రయత్నము చేయంబడెను.

ఈగ్రంథమునకు కావలసిన చరిత్రాంశములు చాలవఱకు మి. గ్రాండుడఫ్ యొక్క మహారాష్ట్రచరిత్ర గ్రంథమునుండి తీసికొనంబడినవి. ఆగ్రంథమిప్పుడముద్రితంబైనందున ఇంగ్లీషు చదివినవారికిగూడ అందలి కథావిశేషంబులు సౌలభ్యంబుగావు. మహారాష్ట్రచరిత్రయొక్క సార్థక్యమును లెస్సగా దెలియపరచిన మహాదేవ గోవిందరణదేవుగారి గ్రంథమునుండి యనేకవిషయంబులిందు పొందుపరుపఁబడినవి. ఈరెండు గ్రంథములుగాక మాడరన్‌రివ్యూలో జాదూనాథుసర్కారు అనుపండితునిచే పరిషియనునుండి భాషాంతరీకరణముచేసి ప్రచురింపఁబడిన చరిత్రనుండి శివాజీయొక్క కథాంశములు కొన్ని సేకరింపఁబడినవి. వీరు మహారాష్ట్రజనుల చరిత్రను ఇంగ్లీషుభాషలో ప్రచురించి మనదేశమునకు కలుగఁజేసిన మేలునకు మన మెంతయు కృతజ్ఞులమై యుండవలెను.

నేనువ్రాసిన ఈగ్రంథమునందు కనకపల్లి భాస్కరరావునాయుడు బి ఏ గారు లేఖకప్రమాదవ్యాకరణ దోషములను సవరించినందుకు మనఃపూర్వకములైన వందనము లర్పించుచున్నాను.

ఇట్లు
సుజన విధేయుడు
చి. శ్రీనివాసరావు.

మహారాష్ట్ర చరిత్ర

ప్రకరణము 1

గుణాధిక్యత.

మన హిందూదేశమందు పురాతనమైనట్టియు, విశేషకథాంశములు గలట్టియు దేశీయ వంశీయంబులగు రాజ్యంబులు పెక్కులుండగ, వానికంటె మహారాష్ట్రచరిత్రయొక్క గుణాధిక్యత యేమో, యందువలన మనము నేర్చుకొనఁ దగిన నీతిసారం బేమో, సంగ్రహముగ నారంభమున వర్ణించిన నెంతయుఁ బ్రయోజనకరంబుగ నుండును. దారులఁ గొట్టుటయందలి నేర్పరితనముచేతను తత్సాహసముచేతను విజృంభించి, ఔరంగజేబుయొక్క మరణానంతరము మొగలురాజ్యంబును జీర్ణంబు సేయుటకు మాయావితనంబును, మోటుసాహసంబును, సుప్రసిద్ధముగఁ గలిగి యుండుటచేతనే, జయంబునొందిన బందిపోటు ప్రభుత్వంబునందు నీతిసారం బేమియుండబోవునని యనేకుల యభిప్రాయమై యున్నది. ఆంగ్లేయ చరిత్రకారుల గ్రంథములవలన మాత్రము మహారాష్ట్రులం గూర్చిన తమ జ్ఞానంబును సంపాదించుకొనిన పాఠకులయం దీ భావము సామాన్యముగఁ జూపట్టుచున్నది. ఈ యభిప్రాయమునకు నాంగ్లేయమహారాష్ట్ర చరిత్రకారుఁడగు గ్రాంటుడఫ్ తన యామోదమును దెలియపఱుచుచు నిట్లు ప్రశంసించెను. "మహారాష్ట్రహిందువుల దారిద్రోపిడి గండ్రతనము కొంత కాల మణఁగఁ గొట్టఁబడినను, తమపై జయశీలురైన మహమ్మదీయుల పరస్పర కలహ సంఘట్టనంబున, నందంతర్గర్భిత మైనయగ్ని మరల ప్రజ్వలింపఁబడి, సహ్యాద్రిపర్వతంబులపై నుండు శుష్కతృణంబుల వోలె నంటుకొని మహా

జ్వాలలయి విజృంభింప దూరంబున నున్నజనులెల్ల నాశ్చర్యనిమగ్నులైరి.” చరిత్రకారునియొక్క యీ యభిప్రాయమే సత్యమయ్యెనేని, యిక నేకాలంబునకుఁ గూడ నిందు నీతిబోధకంబైన దేమియుఁ జూడరాదని స్పష్టముగఁ జెప్పవచ్చును. ఈ చెప్పఁబడబోవు కథవలన నట్టియభిప్రాయము నిరాధారమనియు, అట్టిపొరబాటువలన నీ కథయొక్క సత్యస్వభావము గ్రహింపఁబడరాదనియు, తగిన హేతువులతో సిద్ధాంతీకరింపఁబడును. మహారాష్ట్రీయులయొక్క నిర్మాణకర్తలగు ప్రముఖులయొక్కయు, మైసూరులోని హైదరు, టిప్పు, హైదరాబాదునందు నిజాముల్ ముల్కు, అయోధ్య (ఔడ్డు)యందు సుజావుద్దౌలా, బెంగాలునందు ఆలివర్దీఖాన్, పంజాబునందు రణజిత్ సింగు, భరతపురమునందు సూరజ్ మల్లు మొదలైనవారియొక్కయు వర్తనములందు తారతమ్య మరయలేనివారెవ్వరును నీచరిత్రను పరిశోధించుటకు తగినదర్శనస్థాన మాక్రమింపనెన్నటికిని సమర్థులు కారు. ఇండియాలోని బ్రిటిషు రాజ్యస్థాపనయంతయు కేవలము క్లైవుయొక్క వ్యవహార సాహసంబువలనను, హేస్టింగ్సుయొక్క రాజతంత్ర చాతుర్యంబువలనను, గలిగినదని చెప్పుదుము, ఈ వ్యవహారమును, ఈ రాజతంత్రంబును, బ్రిటిషు సంఘముయొక్క మనోనిశ్చయ ధనబలయుపాధులు పొందలైనవాని సాహాయ్యమువలన నెఱవేరిన వనుసంగతి యెల్ల మఱచిపోయిన మన దేశపాతకుని తలం పెంతపొరపాటువలనఁ గలిగినదో పైయూహము నంతపొరపాటువలనఁ గల్గినదే యగు. కేవలము దారిద్రోపిడిగాండ్రును, దుస్సాహసము గలవారును, తరతరములవఱకు నిల్చియుండు నొక మహాదేశముయొక్క రాజకీయపటమును మార్చఁగల రాజ్యమును స్థాపించుట కెన్నఁడును సమర్థులు గా నేరరు. ఔరంగజేబు మరణానంతరము స్వాతంత్ర్యమునుబొందిన సామంతరాజ్యములయొక్క సుబేదారులవలెఁ గాక, మహారాష్ట్రాధికారంబునకు మూలపురుషుండును, అతని సంతతివారును, రెండు తరములవఱకు మొగలు ప్రభుత్వముయొక్క మహోచ్చదశయందు, దాని ఢాకకు నిలిచియుండిరి. పైని చెప్పఁబడిన వీరపురుషులెవ్వరును జాతీయశక్తిచేఁ బ్రేరేపింపఁ బడలేదు. కావున వారిచేఁ బ్రతిష్ఠింపఁబడిన రాజ్యములు వారిమూలపురుషులతోడనే

యంతరించెను. మహారాష్ట్రరాజ్యంబుయొక్క రీతి వేఱయ్యెను. పదితర ములవఱకు పరంపరగా ప్రముఖులు యుద్ధమునందు మృతినొందినను వారిస్థానం బేల నాక్రమించుటకుఁ దగినయోధులు తోడ్తోడన బయలువెడలుచునే యుం డిరి. రాష్ట్రము, పైపై వచ్చినయిక్కట్టుల లెక్కగొనక వానినెల్ల నుత్త రించి మించుటయేఁగాక, మరల మరల వచ్చిన యట్టికష్టములవలననే ధైర్య స్థైర్యములను సంపాదించుకొని, తాత్కాలికంబుగఁ గనుపడిన జీర్ణావస్థనుండి పునర్జీవంబుతో నూతనసోయగంబుతో, కీటకపతంగంబుంబోలె యధిక ప్రకా శంబుతో దృగ్గోచరంబగుచుండెను. ఈ జీవనదార్ఢ్యంబు, 'మోటు సాహసము, దారి ద్రోపిడితనము' అను సామాన్యసిద్ధాంతమువలన గాని, లేక 'ఆకస్మిక మహాజ్వాల' యను నుపమానము వలనగాని సాధింప వీలులేదు. అంత కంటె దృఢమైన ఆయుబలంబుగల ధర్మములపై నది ఆధారపడియున్నదని స్పష్టముగ తెలియవచ్చుచున్నది. చరిత్రపాఠకుల కీ కథయొక్క స్థిరమైన యుత్సాహమును, నీతిసారంబునొసఁగు విశేషలక్షణంబు లీప్రకరణమందు విచారింపఁబడును.

(1) సాధారణముగఁ దలంపఁబడినటుల, ప్రకృత బ్రిటిషుపరిపాలకులకు సన్నిహితముగ ముందీదేశంబును పాలించుచుండినవారు మహమ్మదీయులు కా రనియు హిందువులేయనియు నెట్టెదుట జ్ఞాపకముంచుకొనవలయును. మహ మ్మదీయ ప్రభుత్వమును జయప్రదముగఁ ద్రోసివేసిన దేశీయ ప్రభువులే యిప్పటి ప్రభుత్వమునకు పూర్వమువారు. మి. గ్రాంటుడఫ్ కూడ మహారాష్ట్రచరిత్ర యొక్క యీలక్షణమును సమ్మతించి మహారాష్ట్రుల నిట్లువర్ణించెను: "ఇండియా యందు విజయంబునొందిన మన వెనుకటివారు మహారాష్ట్రులు. వారి కీర్తి వంతుండగు నాయకుండు శివాజి భాంస్లే యుదయించు దనుక నంతకుపూర్వము వారి యధికారము క్రమక్రమంబుగ ప్రబలమగుచుండెను." బెంగాలు నందును, పూర్వసముద్ర తీరమందును తప్ప తక్కిన భరతవర్షమందు ఇంగ్లీషు విజ యముచే తొలగింపఁబడినవారు, మహమ్మదీయ సుబేదారులు గాక స్వాతం

త్ర్యమును సంస్థాపించుకొనిన హిందూప్రభువులే. ఈ దేశీయ ప్రభుత్వములలో నగ్రస్థానము మహారాష్ట్రసంఘమున కొసంగవలసి యుండును. మహారాష్ట్రయధికారము పశ్చిమ మహారాష్ట్రమునందు జననంబొంది, దక్షిణమున, మధ్యదక్కను, కర్ణాటకము, దక్షిణయిండియాలో మైసూరు తంజావూరు వఱకును వ్యాపించెను. ఉత్తరమున, గుజరాత్, బేరారు, మధ్యపరగణాలనుండి కటకము వఱకును, మాళవ, బొందిలఖండ్, రాజపుత్రస్థానము, ఢిల్లీ, ఆగ్రా, రోహిల్ ఖండువఱకును విస్తరించెను. బెంగాలు, అయోధ్య, కూడ గ్రండెత్తఁబడెను గాని బ్రిటిషు సైన్యముల మూలమున సవి రక్షింపఁబడెను. ఏఁబది సంవత్సరముల కాలము డిల్లీచక్రవర్తులు, ఈ యధికారముయొక్క ప్రతినిధులవలన సింహాసనాసీన విహీనులుగాఁ జేయఁబడిరి. ఈ సరిహద్దుల మధ్యనున్న రాజ్యమునందంతటను ముఖ్యరాష్ట్ర నిర్వాహకుల చేతియందో, లేక వారిసామంతుల చేతియందో, దేశీయ ప్రభువులయందే యధికారముండెడిది. హైదరాబాదునందును, మైసూరునందు నుండు మహమ్మదీయరాజ్యములు గూడ వారి పలుకుబడి క్రిందనే యుండెడివి. ఇంత విస్తారదేశము పైన యధికారము జరపి, యొక శతాబ్దమువఱకు దానిబంధించియుంచిన ఈరాష్ట్రకూటముయొక్క రహస్యము, ఇండియాయొక్క బ్రిటిషుపరిపాలకులకు మనోహరంబగు కౌతూహలకారణం బగుటయం దాశ్చర్యములేదు. ఈ రాష్ట్రకూటముయొక్క నాయకుఁడు పీష్వా ఈయన తనదేశములో ముఖ్యసైన్యాధిపతియేగాక, మొగలుభవనంబునందు బందీలైన డిల్లీచక్రవర్తులయొక్క ప్రతినిధికూడ నైయుండెను. కావున ప్రస్తుతకార్య విచారణ కొఱకు, బెంగాలు, మద్రాసుతీరము తప్ప తక్కిన దేశమందంతటను రాజ్యాధికారము, రాష్ట్రకూటంబునకు లోఁబడిన హిందూ ప్రభువుల చేతులలో నుండెడిదని నిరాక్షేపముగఁ జెప్పవచ్చును. మహమ్మదీయుల యధికారము నిశ్శేషంబయ్యెను. హిందువులు తమ యధికారమును స్థాపించుకొని స్వతంత్రులైరి. వీరితోడనే, తమ యాధిక్యతకొఱకు బ్రిటిషు ప్రభుత్వమువారు పెనుగులాడ వలసి వచ్చెను.

(2) ఈ రాష్ట్రకూటము, యొక్క వ్యక్తిచే నిర్వహింపఁబడినదనిగాని, కొందఱు పరంపరగా వచ్చిన మహాపురుషులచే నిర్వహింపఁబడినదని గాని తలఁచినయెడల, దానిరహస్యము దేటపడనేరదు. సమస్త జనసంఘము యొక్క హృదయసీమలయందీ నిర్మాణము పునాది గలిగియుండె. బెంగాలు, కర్ణాటము, అయోధ్య, హైదరాబాదు సుబేదారుత్వంబులవలెఁ గాక, మహారాష్ట్రవిజృంభణము, జాతీయనిర్మాణారంభమువలనఁ గలిగెను. ఇది యొక సాహసాంకుఁడగు వ్యక్తియొక్క జయప్రద రాజతంత్రంబువలని ఫలంబుగాదు. సామాన్యభాష, సామాన్యమత జాతి వాఙ్మయంబులవలన దృఢంబుగ బంధింపఁబడిన హిందూవజ్జనసంఘమును, నొక స్వతంత్రమైన యేకరాజకీయ జీవనంబు వలన మఱింత దార్ఢ్యంబు నార్జింపఁదలంచి యవలంబించిన విజృంభణము. విదేశమహమ్మదీయ దండయాత్రల యొక్క దురవస్థాకాలము గడచిన పిమ్మట నిండియాలోఁ జేయఁబడిన యిట్టిప్రయత్నముల కిదియే ప్రథమము; కావున, నిట్టి వానిలో యురోపియన్ జాతులవారు తమ తమ దేశములలోఁ జూపించిన అంగనిర్మాణ దార్ఢ్యమంతగా గోచరముగాదు. కాని దీనియొక్క లక్షణముమాత్ర మద్దియే యైయుండుట కించుకంతయు సందేహము లేదు. ఇది, వివిధ తరగతులవారును, సమానముగ నుత్సాహముఁ గల్పించుకొనిన జాతీయోద్యమము. ఈయుద్యమమున కాధారము ఉత్తమతరగతుల వారి యొక్క తాత్కాలికాభివృద్ధి గాదు. సామాన్యజనుల విశాలహృదయసీమయందీ యుద్యమ మాకర్షణ సంపాదించెను. గొల్లలు, శూద్రులు, బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, మహమ్మదీయులుసహిత మీయావేశమందుఁ జిక్కి, యీ యుద్యమము నామోదించిరి. జాతీయభావము (ఒక జాతికిఁ జేరినవారమను నైకమత్యభావము) హిందువులయందు లేదని యాక్షేపించు యురోపియను గ్రంథకర్తలు సహితము, మహారాష్ట్రులు, రాజపుత్రులు, సిక్కులు మొదలైన వారియందీ యుత్తమగుణము గలదంచు నొప్పుకొనిరి. రాజపుత్రులలో కొన్ని యుత్తమవంశములకే యాధిక్యతగలదు. సిక్కులలో, పంజాబు ప్రజలలో స్వల్పభాగమే యైన ఖాల్సా సైన్యమునందే యాధిక్యత నిలిచియున్నది.

మహారాష్ట్రుల విషయములో నట్లుగాదు. వీరిలోపలను, జాతివర్ణ తరగతి భేదములున్నను, యవియెల్లను నొక్క సామాన్య రాజకీయజ్ఞానంబుచే చిక్కపట్టఁబడినవి. వీరందఱును సంవత్సరంబున నాఱు మాసంబులు సైన్యంబులందుండి తక్కిన కాలంబునందు గృహంబులఁ జేరి కుటుంబభూములను వ్యవసాయములు చేసికొని తమతమ *వతనుల ననుభవించుచుండెడివారు. తమ స్వదేశంబులో వతనులయందలి యభిమానము మహారాష్ట్ర గుణంబునందు ముఖ్యలక్షణము. గొప్పగొప్ప సేనానాయకులుకూడ, దూరదేశము నందలి పెద్దజాగీరుల యందు కంటె మహారాష్ట్రమునందలి స్వగ్రామములందు పటేలులుగను, దేశముఖులుగను నుండుట నెక్కువ గౌరవముగ నెంచుకొను చుండెడివారు. ఈ దేశాభిమానభావము జాతీయనిర్మాణము యొక్క లక్షణఫలితముగ నిదర్శనమైయున్నది. మహారాష్ట్రచరిత్రను పరిశోధించుట కిదికూడ నొక ప్రబలహేతు వగును. మహమ్మదీయ కల్లోలాంబుధినుండి పైకి తలయెత్తిన నిజమైన హిందూజాతీయనిర్మాణము యొక్కచరిత్ర యియ్యది యై యుండెను. ప్రముఖులయొక్క ప్రయత్నంబుల కన్నిటికిని వెనుక నీశక్తియే నిలచి ప్రోదిచేసి, ఒక 'మధ్యహిందూ పాద్షాహి' ని ఢిల్లీలోనుంచి, తక్కిన దేశీయప్రభుత్వముల నెల్ల వశంబునం దుంచుకొని నడిపించు సూత్రమును వారు స్వప్నమునందు సూచనగఁ జూచుశక్తిని వారి కిచ్చెను. హైదరు టిప్పుసుల్తానుల చరిత్రలుగాని, హైదరాబాదు, కర్ణాటకము, బెంగాలు అయోధ్య మొదలైన రాజ్యముల మహమ్మదీయ ప్రభువులయొక్క చరిత్రలుగాని, దీని కుపమానంబులు గానేరవు. అవి భిన్నభిన్న యేకవ్యక్తి జీవితములు. కాని శివాజీ నామంబుతోఁ బెనంగొనిన రాజ్యంబుయొక్కచరిత్ర మహారాష్ట్రజాతీయచరిత్రయని యర్థంబుగఁ జెప్పవచ్చును.

(3) చరిత్రపాఠకున కన్నిటికంటె నుత్కృష్టమైన, నీతిదాయకంబైన సుగణం బింకొకటియుండిన నది యురోపియన్ గ్రంథకర్తల పరిశీలననుండి

---

* వతను లనగా వంశపరంపరగవచ్చు మాన్యభూములు.

యదృశ్యమై పోయినది. క్రీ. శ. పదునారవ శతాబ్దాంతమునను పదునేడవ శతాబ్దారంభమునను కేవలము రాజకీయ విప్లవమే మహారాష్ట్రంబును గదల్ప లేదు. ఈ రాజకీయ విప్లవమునకు పూర్వము దీనికి కొంతవఱకు కారణభూతమైన మతసాంఘిక పునరుద్ధారణ జనులమనంబుల నాకర్షించెను. మతసంబంధమైన దార్ఢ్యములు మహారాష్ట్రులను కలించె ననియు, అవియే శివాజీ యొక్కయు, యతని స్నేహబృందముయొక్కయు, బలమునకు కారణంబులయ్యెననియు నుండు సామాన్యజనాభిప్రాయము కొంతవఱకు సత్యమే గాని, పూర్ణముగ సత్యముగాదు. దక్కనునందలి పదునైదవ పదునాఱవ శతాబ్దముల మహమ్మదీయప్రభువులు, * మూర్ఖమతావలంబకులు గాదు. ఔరంగజేబు మూర్ఖమతావలంబకుఁడై యుండెననుటకు సందేహములేదు గాని, యతని మూర్ఖమతావలంబన వలననే యతనితో సరిసమానముగఁ బోరాడి తుదకు జయంబు నొందిన మహారాష్ట్రుల విజృంభణము గలిగినదని సమర్థింపఁజాలము. సత్యమేమన, పదునాఱవశతాబ్దమందు యూరపులో † ప్రొటెస్టాంటు సంస్కారము వలెనే, ఇండియాలో సహితము, ముఖ్యముగా దక్కనులో పదునేనవ పదునాఱవ శతాబ్దములలో, మతసాంఘిక వాఙ్మయ పునరుద్ధారణ గలిగెను. ఈ మత పునరుద్ధారణ శిష్టాచారంబున బ్రాహ్మణసంబంధముగాదు. ఇది శిష్టాచారంబునకు విరోధంబైన స్వభావంబు గలిగి, జన్మచేఁగలిగిన తరగతి భేదంబులను, ఆచార వ్యవహారములను నిరాకరించి, పావనహృదయంబును, దయారసంబును తక్కిన యెల్లకర్మలవలనఁ గలుగు గొప్పతనంబులకంటె నెక్కువగ పాటించునదిగా నుండెను. ఈ మతపునరుద్ధారణయు సామాన్యజనులచేఁ గల్పింపబడినది గాని యుత్తమతరగతులజను లిందు జోక్యము కలుగఁజేసికొనలేదు.

---

* మూర్ఖమతావలంబకు లనగా తమ మతములోని యన్నిసిద్ధాంతములను తప్పక నిజమని మూర్ఖముగ నమ్మువారు.

† ప్రొటెస్టాంటు సంస్కారమనగా క్రైస్తవ మతాచార్యుల యధికారమును ధిక్కరించుచు క్రైస్తవమతమున యూరపులో జరిగిన సంస్కారము.

వీని కథినాయకులగు, సిద్ధులు, మహాపురుషులు, కవులు, గాయకులు, తత్త్వజ్ఞులు, వేదాంతులు సామాన్యముగ సామాన్యకులములందు అనగా, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు, వనపాలకులు, దుకాణాదారులు, మంగళ్లులు మొదలగుజాతులయందు జన్మించినవారు. వీరిలో మాలలుసహితము గలరు. అట్టివారు బ్రాహ్మణవర్ణమునందు కంటె తలుచుగ తక్కువకులములందే యుద్భవించుచుండిరి. తుకారామ్, రామదాసు, వామనభట్టు, ఏకనాథుఁడు మొదలైనవారినామములు విశ్వదభిరామంబులై వెలసెను. రెండువందల సంవత్సరములపిమ్మట కూడ వారియొక్క ప్రసిద్ధి మహారాష్ట్రజనుల హృదయపీఠములనుండి యేమాత్రమును తగ్గిపోలేదు. జనులయొక్క యీ మతగురువులతో ననుకరించియే రాజకీయనాయకులును కార్యంబులను గమనించుచుండెడివారు. శివాజియొక్క ముఖ్యోపదేశికుఁడు రామదాసు మహాస్వామి. ఈతఁడే శివాజీయొక్క జాతీయపతాకమగు 'భగ్వాజెండా'కు కాషాయవర్ణంబు నొసంగి 'హరహర మహాదేవ్' అను క్రొత్తవిధమగు నమస్కారము నేర్పఱచెను. ఇందువలననే యీ యుద్యమముయొక్క మతలక్షణంబును, దానిని ప్రేరేపించు 'యాధ్యాత్మిక' శక్తియొక్క స్వాతంత్ర్యమును తేటపడుచున్నవి. మొదటి బాజీరావు పీష్వా, తనయొక్క యావేశమును ధవాశీస్వామియొద్దనుండి గ్రహించుచుండెడివాఁడు. చించూర్కారు వంశమునకు మూలపురుషుఁడైన విఠలశివదేవుఁడు తన యాచార్యునుండి యావేశమును బొందుచుండెడివాఁడు. శివాజీయొక్క చర్యలుడు ఉద్దేశములును మహారాష్ట్రచరిత్రకారునికంటె మెడోస్ టెయిలర్ తన నవలయగు 'తారా'యందు చెక్కువ నిష్కళంకముగ వర్ణించియున్నవాడు. శివాజీ భవానీదేవినుండి ధారాళముగ తన కావేశము గలిగినట్లు భావించుచుండెడివాఁడు. తన జీవితమునందు గొప్ప యాపత్సమయములందు దాతఁడు తనను తీవ్రముగ దేవి యావహించియున్నప్పుడు తోఁచిన యావేశమును బట్టి సాధారణముగఁ బ్రవర్తించుచుండెడివాఁడు. ఈ హేతువులన్నియు ప్రత్యేకముగఁ బరిశోధింప నర్హమైనవి. ఏలయున, యా చిహ్నంబు లిప్పటికిని జనులయొక్క యభిమత విశ్వాసములపై ముద్రితములై యున్నవి. పశ్చిమ

యైరోపాక ప్రోటెస్టాంటుమతము రాజకీయ స్వాతంత్ర్యమునం దేమిపని యొనర్చెనో, యద్దియే అల్పపరిమాణముగ పశ్చిమహిందూదేశమునం దొనర్పఁబడెను. ఈ యుద్యమముయొక్క యావేశము మతమునందు, శిల్పమునందు, దేశభాషాభివృద్ధియందు, సంఘజీవన స్వాతంత్ర్యమందు, స్వయం సహాయాభివృద్ధియందు, పరస్పరసహనమందు కూడఁ జూపట్టెను. ఈకారణమువలన నీచరిత్ర పరిశోధనయందు దేశీయ పాఠకునకును, విదేశవిచారకునకును గూడ మఱింత హృదయాహ్లాదము గల్గుచుండును.

(4) ఇంకొకలక్షణము గలదు. ఈలక్షణము మహారాష్ట్రరాజ్యముయొక్క బలమును నీరసము నైయున్నది. మహారాష్ట్రులయొక్కచరిత్ర, రాష్ట్రకూటముయొక్కచరిత్ర యైయున్నది. దీని ప్రతిష్ఠాపకుండైన మూలపురుషుని మరణానంతరము ప్రధానస్థాన మెప్పుడును నీరసమే యై యుండెను. శివాజి తాను చేసిన యేర్పాటులలో తన దేశప్రజలయొక్క స్వభావము ననుసరించియే నడచెను. ఎనిమిదిమంది ప్రధానుల నేర్పఱిచి, వారిని ధర్మాధికారులుగను సైన్యాధిపతులుగను కూడ చేసెను. తన జీవితకాలములో సహితము, తాను ఢిల్లీలో ఖైదీ యై, తన దేశమును అందలి కోటలును మహమ్మదీయులవశమునం దున్నపుడు, ఈ యధికార విభాగనిర్ణయమే, యతఁడు తప్పించుకొని వచ్చిన తరువాత వెంటనే తలయెత్తగల సామర్థ్యము నతనికి ప్రసాదించెను. అటుతరువాత, ఆయన కుమారుఁడగు శంభాజీ, ఔరంగజేబుయొక్క సేనానాయకునిచే చెఱఁబట్టుకొనఁబడినపుడు, ఈ రాష్ట్రనాయకులందఱును దక్షిణంబునకు వెనుకకు తగ్గి, మరల తగిన తఱుణ మాసన్నమైనపుడు తిరిగివచ్చి ఔరంగజేబుపై తమ కసి తీర్చుకొనిరి. పీష్వాల ప్రభుత్వములో, ఈ యధికారముయొక్క శాఖలు మహారాష్ట్ర సేనానాయకుల క్రింద, ఇందూరు, గ్వాలియరు, ధార్, దేవాసు, బరోడా, నాగపూరు మొదలైన స్థలములయందు, పై పద్ధతి మఱింత బలపఱుపఁబడెను. మఱియు మధ్యయిండియాలో బొందిలఖండు నాయకులు, దక్షిణమున పట్వర్ధను నాయకులు, సతారా జాగీరుదారులు,

భావేలు, రాస్తేలు, ధులాపులు, ఆంగ్రియాలు, మాన్కారులు, మహాదిక్కులు, ఘోరేపురేలు, యింక నేకవంశములవారు రాష్ట్రముయొక్క తూర్పుదక్షిణపు సరిహద్దులలో భిన్నభిన్న శాఖలుగా నేర్పడియుండిరి. ఇవి యన్నియు చిన్న చిన్న మహారాష్ట్ర అధికారస్థానములే యైయున్నవి. ఇవి యన్నియునొక్క సామాన్య యుద్దేశముచే ప్రేరేపింపఁబడి, యొక్క ప్రధానాదర్శముతో పని చేయుచున్నంతవఱకు, వానియొక్క శక్తి అప్రతిహతము. అట్లొక శతాబ్దము వఱకు నట్టి ప్రేరేపణతో నవి పనిచేసెను. సుశిక్షితములైన బ్రిటిషు సైన్యములు గూడ ఈ రాష్ట్రమునందు మిత్రభేదంబు గల్పించినఁగాని జయంబు స్వీకరింప నశక్తము లయ్యెను. ఒక శతాబ్దము వఱకు, ఉత్తరమునకుఁ గాని, దక్షిణమునకుఁ గాని, తూర్పునకు గాని, పడమరకు గాని, రాజపుత్రుల పైకిగాని, ఢిల్లీ చక్రవర్తుల పైకిగాని, రోహిలఖండు లోనికి గాని, అయోధ్యలోనికి గాని, బెంగాలులోనికి గాని, హైదరాలీ పైకిగాని, టిప్పు పైకిగాని, నైజాము పైకిఁగాని, పోర్చుగీసు పైకిఁగాని, ఆంగ్లేయుల పైకిఁగాని, ఈ రాష్ట్రముయొక్క వివిధ ప్రముఖులనుసమూహించి సలుపనిదండయాత్ర యొకటియు లేదు. పీష్వాయొక్క యాధిక్యత, జర్మను సామ్రాజ్యములో ప్రషియను ప్రభుత్వముయొక్క యాధిక్యతను బోలియుండెను. ప్రధానస్థానము కేవలము మనస్సున నొక గౌరవనీయమగు భావమైయుండెను గాని, రాష్ట్రకూటము యొక్క బలము నంతగా గల్గియుండలేదు. కావున, నా పూర్వ సాంప్రదాయ సిద్ధమైన చరిత్రాంశముల స్మరణ మనస్సున నున్నంతవఱకు, రాయఘడ, సతారా, విశాలఘడ, జింజీ, పూనా మొదలైన స్థలములయందలి మంత్రు లందఱును, ఇట్టి రాష్ట్ర కూటమునకు బలమైన యధికారి పైని లేకపోయినను, జాతీయశక్తిని నడుపుచు, పరిపాలనఁ జేయుచుండెడివారు. నానాఫడ్నవీసు క్రింద పీష్వాప్రభుత్వమునకు, హైదరాబాదు శ్రీరంగపట్టణములలో, 'బారాభాయి' ప్రభుత్వ మనగా ద్వాదశప్రముఖుల ప్రభుత్వమని మాఱుపేరుగూడ పెట్టఁబడెను. ఈ భావమునందలి గౌరవ మెప్పుడు తగ్గెనో యప్పుడే ఈ రాష్ట్రకూటము, బలప్రదమగుటకు బదులుగా నీరసహేతు వయ్యెను. ఆంగ్లేయప్రభువు లీ నీరసమును గ్రహించి,

రాష్ట్రకూటముయొక్క ప్రముఖులయొక్క స్వాతిశయంబును విడివిడిగా స్తోత్రంబుచేయుటవలన వారి కూటముయొక్క బలమును తగ్గించిరి. హిందూ మహమ్మదీయ ప్రభువు లెవ్వరిక్రిందను నంత గొప్పయెత్తున రాష్ట్రకూటము నేర్పఱుచుట కట్టిప్రయత్న మింకొకటి యీ దేశమునఁ జేయఁబడి యుండ లేదు. ఈ ప్రయత్నము తుదకు నిష్ఫలమైనదగుట సిద్ధము. ఏలయన సహజంబుగ వారసత్వంబుగ నుండని సుగుణంబుల నుద్దేశించుకొని యేర్పాటు చేయఁబడిన పద్ధతిగాన నది విఫలమయ్యెను. కాని యీ సుగుణంబు లుచ్ఛదశయందున్నంత కాలమును, దేశీయ విదేశీయ చరిత్రజ్ఞుల కిది యమూల్యమైన విమర్శన యగుటకు తగిన లక్షణంబులు గలిగియున్నది.

(5) ఈ చరిత్రయొక్క నీతివిశేషము మఱియొక కారణంబున నింకను ఎన్నికెక్కుచున్నది. ఈ రాష్ట్రకూట పద్ధతులు మహారాష్ట్ర సంఘమును చుట్టుకొనిన కష్టములనుండి తప్పించుకొనినట్లు చేయుటయే గాక, అప్పటప్పటికి తన చరిత్ర మహాపత్కాలములలోఁ బొందిన దురవస్థలవలన మఱింత దార్ఢ్యము నార్జించునట్లు చేసినవి. అట్టి యాపత్కాలము లెవ్వియనిన:—

(1) శివాజి ఢిల్లీలో ఖైదీయైనపుడు.

(2) శంభాజీ చెఱపెట్టఁబడ నతని సోదరుఁడగు రాజారాము దక్షిణమునకు పాఱిపోవలసి వచ్చినపుడు.

(3) మహారాష్ట్ర విజృంభణముయొక్క యాశల నన్నిటిని శ్మశానిపట్టు యుద్ధము త్రుంచివేసినపుడు.

(4) నారాయణరావు పీష్వా చంపబడినపుడు, మంత్రులందరును రగోబాను తప్పించి గృహచ్ఛిద్రములతో బ్రిటిషు రాజశక్తినంతను యెదుట పెట్టుకొని పరిపాలనఁ జేయవలసినప్పుడు.

ఇట్టి నాలుగు దురవస్థలను ఇక్కట్టులను సహించి, వాని జయించిన సంఘము, కేవలము జీవించిన కాలపరిమితినిబట్టిన లెక్కకంటె నెక్కువైన సుగుణధర్మమును చరిత్రపాఠకునికి ప్రమాణ మియ్యఁగలదు.

(6) చివర కిప్పటికిని, ఇండియాయొక్క బ్రిటిషు పరిపాలకులు, పీష్వాల యొక్కయు, మొగలు చక్రవర్తులయొక్కయు స్థానము నధికారులుగ నాక్రమించుకొని యున్నను, పూర్వరాష్ట్రకూటముయొక్క శేషభాగములైన సామంతరాజ్యములగు గ్వాలియరు, ఇందూరు, బరోడా, కొల్హాపురము, ధార్, దేవాసులును, దక్షిణ మహారాష్ట్ర నాయకులును, సుమారు మూఁడుకోట్ల మహారాష్ట్రులు, బొంబాయి ప్రెసిడెన్సీలోను, దేశీయరాజ్యములలోను, మధ్య పరగణాలు, బేరారు, నైజాము రాజ్యములలో నున్నవారును, బ్రిటిషు రక్షణమును పొంది, దానిభక్తులైయుండి, దేశమునం దీడులేని గొప్పశక్తులై యున్నారు. ప్రస్తుత స్థితిగతులనుబట్టి ముందెప్పుడో భవిష్యత్కాలమున జాతుల ననుసరించి యేర్పాటు కాబడు రాష్ట్రకూట మగు నిండియాను జూచువారి కిది ప్రమోదము నొసంగక మానదు.

మహారాష్ట్ర విజృంభణ వినాశముల చరిత్రయొక్క స్థిరమైన నీతి సారము నియ్యగల ముఖ్యలక్షణము లియ్యవి. వీనినే గ్రంథమునందు విస్తరించి ప్రశంసింతము.

ప్రకరణము 2.

దేశవర్ణన.

వింధ్యపర్వతములకు దక్షిణభాగముననున్న దేశము దక్షిణాపథంబని మన పురాణములయందు వాడఁబడుచున్నది. దక్షిణ మను సంస్కృత పదమునకు దక్కిను అని వికృతిగా మన యాంధ్రభాషయందును ప్రయోగింపఁబడుచున్నది. ప్రస్తుతము దక్కను అని తరుచుగ మహారాష్ట్రి హిందూస్థానీ భాషలయందు వాడఁబడుచున్నది. నర్మద మహానదికి దక్షిణముననున్న నీదేశము అయిదు భాగములుగ పూర్వము విభజింపఁబడి యున్నటుల ప్రస్తుతమున నిచ్చట మాటలాడఁబడు దేశభాషలఁబట్టి గనుపడుచున్నది. మనము పంచద్రావిడులను పేరునఁబిలుచు ద్రవిడ, ఆంధ్ర, కర్ణాట; మహారాష్ట్రి, ఘూర్జరులలో మొదటి నలుగురు దేశీయులును పూర్వకాలమున నిందు దేశభాగముల నాక్రమించుకొని యుండిరి. వీరు నలువురును గాక పూర్వ మనాదిగ నీదేశవాసులై యిప్పుడింక ననాగరికులుగ పర్వతారణ్యములనుబట్టి మధ్య పరగణాలయందు విస్తారముగ నివసించు కోదుజాతివారును గలరు. వీర్లు గోందులని గూడ పిలువఁబడుదురు. వీరు నివసించియున్న దేశమును గోంద్వానా యని పిలుతురు.

ద్రావిడదేశమని పేర్కొనఁబడు భాగము, కన్యాకుమారి అగ్రమునుండి ఉత్తరమున మద్రాసువఱకును వ్యాపించియున్నది. ఇచ్చట దేశభాష అఱవము. ప్రాచీన కర్ణాటకము, మళయాళమునకును కోరమండల తీరమునకును మధ్యనున్న పీఠభూమి నాక్రమించి మహారాష్ట్రి ఆంధ్రదేశంబులకు మధ్య నొక్కకోణంబుగ నేర్పడి, ఉత్తరమున మంజీరానదివఱకును వ్యాపించి యుండెను.

ఆంధ్రము, దక్షిణమున పులికటు సరస్సు అనగా ద్రావిడదేశముయొక్క పొలిమేర మొదలుకొని ఒరిస్సాలో శ్రీకాకుళము వఱకును, గోండ్వానాకును కర్ణాటకమునకును మధ్యభాగమంతయు నాక్రమించియుండెను. ఒరిస్సా తప్ప ఆంధ్రదేశమునకును మహానదికిని మధ్యనున్న తక్కినదేశమంతయు గోండ్వానాదై యున్నది. గోండ్వానాకును త్రిలింగదేశమునకును పశ్చిమముననున్న అయినవ భాగము మన ప్రస్తుతచరిత్రకు సంబంధించినదిగాన దాని నెక్కువ విరళముగ వర్ణింతము.

మహారాష్ట్రము, ఇప్పుడు వ్రాయఁబడబోవు జనులయొక్క జన్మస్థానము. దీని కెల్లలు పలువిధములుగ పలుచోటుల చెప్పఁబడియున్నది. కాని చందూరునకును కృష్ణానదిమీఁదనున్న ఎరూరు మంజీరాకును మధ్యనున్న దేశము స్పష్టమైన మహారాష్ట్రము. ఇందలి భాషయందు విశేష వ్యత్యాసములేదు. పైసూత్రమును, ఇఁక కొంచెము విశాలార్థమున గ్రహించితిమేని, మహారాష్ట్రదేశము, ఉత్తరమున, సాత్పురా పర్వతములు హద్దుగా గలిగి, ఆ పర్వతముల ననుసరించి పశ్చిమమున నంబోలునుండి, నాగ్పూరునకు తూర్పుననున్న వాణిగంగావఱకును వ్యాపించియుండెను. ఆ నది వార్ధానదిలోనికిఁ బడు వఱకును దాని పశ్చిమతటి యీ దేశమునకు తూర్పుహద్దుగా నేర్పడుచున్నది. ఈ నదుల యొక్క సంగము యొద్దనుండి వార్ధానదియొక్క తూర్పుయొడ్డు ననుసరించి మానిక్ దుర్గము వఱకును, అటుతరువాత పడమటివైపునకు మాహూరు వఱకును హద్దు చూపవచ్చును. ఈ కడపటి స్థానమునుండి గోవావఱకు నొక వంకర టింకరగీత హద్దుగా గీయవచ్చును. పశ్చిమమున హద్దు సముద్రము.

ఈ విశాలదేశమందంతను మహారాష్ట్రభాష వ్యవహరింపఁబడుచున్నది. ఇంత విస్తీర్ణప్రదేశమందు కొన్ని అంతరభాషలు లేకుండనుండవు. పొలిమేరల యందు అన్యదేశ్యంబులతోఁ గలిసిన మిశ్రభాషలును గలవు. దీనియొక్క విస్తీర్ణము 102,000 చతురపుమైళ్లకంటె నధికముగ గలదు. ప్రస్తుత జనసంఖ్య సుమారు 60 లక్షలు.

మహారాష్ట్రము, ప్రత్యేక మొకభాషను గలిగియుండుటచేతను, ఒక తెగ బ్రాహ్మణుల కా నామ మొసంగఁబడి యుంటచేతను, ఆ దేశీయులు *మహారాష్ట్రులని సామాన్యముగఁ బిలువఁబడుటచేతను, పూర్వ మొక కాలమందు ఒక హిందూరాజు పరిపాలనక్రింద ఆ దేశమంతయునుండి యుండవచ్చునని తోఁచుచున్నది. అట్టి యూహకు సరియైన చరిత్రాధార మేమియు స్పష్టముగఁ గానరాదు. పరశురాముఁడు క్షత్రియకులంబుల నిర్మూలము చేసి యాదేశము నంతయు బ్రాహ్మణులకు కట్టిపెట్టగా వారు కృతఘ్నులై వానిని పాఱఁదోలి రనియు, అతఁడు సహ్యాద్రి (పడమటి కనుమలు) మీఁద కేగి సముద్రుని ప్రార్థింప నతఁడు పరశురాముని విల్లంబు వోయినంతదూరము వెనుకకు తగ్గి భూమినిచ్చె ననియు నొక పురాణోక్తి గలదు. ఇట్లు సముద్రుఁడు విడిచిన స్థలములో కొంత, మళయాళ కర్ణాటకములలోఁ జేరియుండెను. తక్కిన భాగము గోవాదగ్గరనుండి పైభాగము కొంకణమని తెలియఁబడుచున్నది. ఈమహారాష్ట్రదేశమును మూఁడు భాగములుగ విభజింపవచ్చును. యవన సముద్రమునకును సహ్యాద్రిపర్వతములకును మధ్యభాగము తులుకొంకణమనియు సామాన్యముగ కొంకణమనియు పిలువఁబడును. సహ్యాద్రిపర్వతముల మీఁదనున్న దేశము కొంకణ ఘాట్మాతా యనియు సామాన్యముగ ఘాట్మాతా యనియును పిలువఁబడును. పర్వతములకు పూర్వముననున్న భాగమునకు దేశమని పేరు. ఘాట్మాతా మూఁడు భాగములుగ విభజింపఁబడియున్నది. పర్వతములయొక్క ఉపరిభాగముననున్న సమప్రదేశములు మూరాలనియు, ప్రక్కనున్న కోనలు కోరాలనియు, కొంకణ భూమికి దగ్గిరగనున్న పర్వతములయొక్క నీచప్రదేశములు మావలులనియు వ్యవహరింపఁబడుచున్నవి.

కొంకణదేశము, పర్వతములక్రింద హిందూదేశముయొక్క పశ్చిమతీరమున సముద్రములో దీటుగ వ్యాపించియున్నను సమప్రదేశముగఁ దలంపఁ

---

* మహారాష్ట్ర జనులు తమను మరాఠాలని పిలుచుకొందురు.

గూడదు. అనేక ప్రదేశములయందు నిమ్నోన్నతంబులు బాహుళ్యంబుగఁ గలిగి ఘనశైలంబులచేతను, ఘోరారణ్యంబులచేతను గప్పఁబడి అనేక నదంబుల చేతను, ఝరంబులచేతను తెగఁగొట్టఁబడి సమప్రదేశంబు గాకయుండును. ఈ జలప్రవాహంబులు పరుష శిలాతలంబులపై పారుచు స్వచ్ఛంబుగనుండి సముద్రములో గలియఁబోవునెడ పోటుపాటుల వలన లోఁతుగను బురదగను ఉండును. బాటలు సామాన్యముగ రాతికాలి మార్గములైయుండి పర్వతముల సమీపించు తఱిని యెక్కువ దుర్గమంబులై యుండును. అచ్చట ప్రస్తుతము గవర్నమెంటువారు బాగుచేయించిన స్థలంబులందుఁ దక్క బహు యిరుకైన లోయల మార్గమున నెక్కవలసియుండి, నడిపించి తీసికొనిపోఁబడు గుఱ్ఱము సహితము కాలూన కష్టంబుగ నుండును. ఈ పర్వత శిఖరములపైకెక్కి, ముఖ్యముగ పూనాకు దక్షిణముగనున్న వైపునఁజేరిన, కండ్లకు పొడకట్టు ప్రకృతిశోభ యత్యంత రమణీయము. మూఁడు నాలుగువేల యడుగుల యెత్తైన పర్వతంబులు పచ్చనిచెట్లచే నలంకరింపఁబడి యొకదానిపై నొకటి యెగయుచు మధ్యమధ్య నెంతబలమైన భూరుహంబుల మూలంబులకైన నెడమియ్యని నల్లని పరుష శిలాతలంబులను చుట్టుకొని, మహాసైనికానివహంబు వోలె నొప్పి యున్నవని తలంచిన కొంత యూహకుఁ జేరువగును. పూనా పట్టణంబునకు దక్షిణంబున గిరులపైనున్న పచ్చిక సార్వకాలికంబై వెలయుచుండును; కాని వర్షకాలంబున, అందు ముఖ్యముగ నంతిమ కార్తులందు, గిరీఝరులు తమ జలంబుల పర్వత పార్శ్వములనుండి సముద్రంబులోనికిఁ గ్రుమ్మరించు సమయంబున సస్యబాహుళ్యంబున నా రంగంబుయొక్క విలాసం బింకను నతిశయంబగును. ఉదయభానుని కిరణంబులు మేఘశకలంబుల మార్గంబునఁ బ్రవేశించి తాము వ్రాలిన ప్రతి గిరిశిఖరంబునకును సహస్రచిత్రవిచిత్రవర్ణంబు లొసంగుచుండును. వర్షకాలప్రారంభమునను, అంత్యమునను, గాలివానలును, పిడుగుల వానలును తరుచుగఁ గురియుచుండును. ఆదేశంబు నందీప్రకృతివిచిత్రంబులు దశగుణంబుగ భయంకరమును గంభీరమునై విలసిల్లును.

కొంకనుదేశముయొక్క ప్రకృతి లక్షణంబు లెంత విషమంబులైనను పలుస్థలంబులయందు భూమి ఫలవంతమై యొప్పుచున్నది. సముద్రతీరమునుండి సహ్యాద్రిపర్వతశిఖరంబులవఱకు, వెడల్పునందు 25 మైళ్లు మొదలుకొని 50 మైళ్ల వఱకు, హెచ్చుతగ్గుగా నా దేశము వ్యాపించియుండును. పర్వతములపై నున్న పీఠభూమియందు మిక్కిలి యెత్తైనభూమి, కొంకనుకు దగ్గరవైపున నున్నది. అది సామాన్యముగ 1000 లేక 2000 అడుగులు పీఠభూమికంటె యెత్తై యుండును. కొంకను ఘాట్మాతాయొక్క వెడల్పు దాదాపు 20 లేక 25 మైళ్లుండును.

జూనారునుండి కొల్హాపూరువఱకును కొంకను ఘాట్మాతాయంతయును జనసమ్మర్దము గలదిగ నున్నది. గిరికటములన్నియు నిప్పుడు బాగుగ వ్యవసాయము చేయఁబడుచున్నవి. ఇందలిజనులు కల్లకపట మెఱుఁగనివారును శాంతచిత్తులునై యున్నారు. అయినను వారు మోటుతనమునందును సాహసమునందు ననుపమానులై, శివాజీయొక్క పేరుఁ జెందిన మావలీలుగా సాహసకార్యములకు నడుపఁబడుటను మన మీ చరిత్రయందు ముందుఁ జూడఁగలము. జూనారునకు ఉత్తరభాగమునందున్న ఘాట్మాతాయందలి కటకము లింత చక్కగ వ్యవసాయము చేయఁబడుటలేదు. అచ్చటిజనులు విస్తారము భిల్లులును కోలీలునై యున్నారు. వారు దొంగమూకలుగఁ ద్రిమ్మరుచు, దారులుగొట్టుటచేతను మృగయా విహారముచేతను జీవించుచుందురు. ఈ ఘాట్మాతాయం దెల్లయెడల అడవిమృగములు విహరించుచుండును. ఇచ్చటి వ్యాఘ్రములు బహు భయంకరములును క్రూరములునై యుండును.

ఘాటీలయందును, పైఁజెప్పఁబడిన పర్వతపంక్తుల పాదుగునను, సహ్యాద్రిశ్రేణిపైనను, క్రిందనుగూడ విశాలపరుష శిలామయమైన దుర్గములు గలవు. మానవకృతసాహాయ్య మేమియు లేకనే యియ్యవి దుర్గమంబు లగుటయేగాక స్వభావసిద్ధముగ శత్రువులకు దుస్సాధ్యములుగఁ గనుపడుచుండును. వానిలో ననేకవానియందు వర్షకాలమందు జలమునుపట్టుకొని నిలువజేసికొనుట కనువైన జలాశయంబులు గలవు. వర్షాకాలములలో ఘాట్మాతాయందు సైన్యము లెవ్వియు యుద్ధకార్యంబులఁ బనిచేయఁజాలవు. నిలువుగనుండు పడుమనగం

బులకును, కొండలతో సమానముగ, పెద్దపెద్దమ్రానులచే కప్పఁబడిగాని, లేక చిట్టడవిచేఁ గ్రమ్ముకొనఁబడిగానియుండి వంకరటింకరగ నేగుచున్న యగాధమైన లోయలకును తోడుగ, ఎడతెగనివాన గుఱియుచుండును. కొండకాలువలన్నియు పొంగి దాట నశక్యముగ నుండును. అడవులలో చల్లనిచెమ్మయురుకుచు నలవాటులేని జనులకు కడు ననారోగ్యకరముగ నుండును. యుద్ధసంబంధ విషయంబులనుబట్టి చూచిన ప్రపంచమున నింత బలాధికమైన స్థానం బింకొకటి గానరాదు.

ఘాట్మాతకు తూర్పుప్రక్కను దేశముగలదు. తూర్పునకుఁబోయిన కొలఁదిని దేశము సమ మగుచుండును. సహ్యాద్రిపర్వతపంక్తియొక్క చిన్నచిన్న శాఖలుగాక, పడమటినుండి తూర్పునకు బహుదూరమువరకు సాగిపోవుచున్న నాలుగు పర్వతపంక్తులు వరుసగగలవు. ఉత్తరమున మహారాష్ట్రమునకు హద్దుగ నున్న శాత్పూరాపర్వతపంక్తికి దక్షిణమున, రౌరానుండి బేరారు మధ్యభాగము వఱకును వ్యాపించియున్న చందూరు పర్వతపంక్తిగలదు. దానికి దక్షిణమున జూనారునుండి బీరువఱకును వ్యాపించియున్న అహమ్మదునగర పర్వతపంక్తి గలదు. అటుతరువాత దానికి దక్షిణమున సతారా కుత్తరముగ మహాదేవ నగములు గలవు.

మహారాష్ట్రదేశముయొక్క సామాన్యాకారము పర్వతమయమై యుండును. ఉపత్యకములందు జలము పుష్కలముగ గలదు. శీతోష్ణస్థితి హిందూదేశమం దంతటిలో నుత్తమమైనది కృషియందును,ఫలసాయమందును,పంటలయందును, కొన్ని యితరభాగములకంటె నికృష్టమైనది.

ఇచ్చట ప్రవహించు ముఖ్యమైన నదులు, నర్మదా, తపతీ, గోదావరి, భీమ, కృష్ణయైయున్నవి. ఈనదులతీరముల ననుసరించి కొంతదూరమువఱకును భూమి మంచి ఫలవంతమైనది.ఇచ్చటపండిన పంటలకేమియును కొఱంతలేదు. మహారాష్ట్రంబున గంగ యని పిలువఁబడు గోదావరీతీరంబును, భీమ యొక్కయు, దానిశాఖలగు,నీరా,మానుఅను ఉపనదులయొక్క తీరంబులును ప్రశస్తమైన తురంగజాతులకు పుట్టినిండ్లు. అందు ముఖ్యముగ కడపటి రెండుతీరంబులందలి

తురంగజాతులును చిన్నవైనను, బలమైనవియు కష్టము నోర్వఁగలిగినవియునై యున్నవి.

ఈ చెప్పఁబడిన మహారాష్ట్రదేశస్థితినిబట్టి మన భరతవర్షమందు గంగాసింధు' మహానదీప్రాంతములందును, తక్కిన దక్షిణదేశభాగమందును, స్వభావసిద్ధముగ లేని దేశకాలస్థితు లిచ్చటగలవని తెలియవచ్చుచున్నవి. మొట్టమొదట మహమ్మదీయుల యధికారమునుండి స్వాతంత్ర్యమును సంపాదించుకొనుట కుద్యమ మిక్కడ కలిగినందుకు ఇది యొక కారణమైయున్నది. ఇచ్చట నిలువుగను నడ్డముగనున్న సహ్యాద్రి వింధ్యాద్రి పర్వతములపైనున్న దుర్గశ్రేణులెల్ల, తత్ప్రాంతములనున్న సమదేశమునంతయు సహజముగ కాపాడుట కనువుగనుండి మహారాష్ట్ర రాజకీయ చరిత్రయందు ప్రధానపాత్రంబులుగ వెలసెను. దేశముయొక్క ఈసహజలక్షణంబులే బలసత్వదాయకం బగు శీతోష్ణస్థితిఁ గల్పించి, తక్కిన హిందూస్థానదక్కన భూములయందలి యత్యుష్ణశీతలంబులకు భిన్నంబుగ నుండునట్లు చేసినవి. ఆంధ్రదేశమునందు తూర్పుకనుమలును పూర్వదిశయందదేవిధముగ దేశము నలంకరించియుండెనుకాని పర్వతశ్రేణి మధ్యమధ్య విడిపోయియుండుటవలన నంత దృఢమైన దేశమైయుండలేదు. అంతేకాక మహారాష్ట్ర దేశము హిందూస్థానమునకును దక్కనుకును మధ్యబాటయందుండి, రెండుదిక్కులను చక్కగ గమనించుచున్న తత్స్థానము నాక్రమించి, దీనితో సరిపోల్పఁదగిన భూస్థితి గలిగియున్న మైసూరు మాళ్వాలకులేని యనుకూలమును కలిగియున్నది. మరియు దేశము పరుషశిలామయలక్షణంబు కలిగియున్నందువలన భూదేవి ఫలభరితంబుకాక, కాయకష్టపడి భోగపరాయణులుగాని దృఢగాత్రులగు బిడ్డలను కనిపెంచినది. ప్రకృతిమాత యిచ్చట పేదరాలై యుంటవలన తన కుమారులకు భాగ్యం బియ్యలేక బలం బిచ్చి వారి నాశీర్వదించెను.

ఇఁక నిచ్చటనున్న దేశజనుల యాకారలక్షణంబుల విచారించిచూతము. ఉత్తరహిందూస్థానమందు ఆర్యజాతి యెక్కువ వ్యాప్తమై, అనార్యులను సంకుచితులంజేసి, వారిని అరణ్యపర్వతప్రాంతములకు పాఱఁదోలెను. దక్షిణదేశమందు ద్రవిడజాతులు తమ యాధిక్యతను నిలుపుకొని యుండిరి. ఆర్యజాతి

వారు ఇచ్చట తమ యాధిక్యతను సామాన్యజనులపై పూర్తిగ ముద్రింప సమర్థులు కాజాలకపోయిరి. మహారాష్ట్రపీఠభూమి, యుత్తర దక్షిణములకు మధ్యగ నుండుటవలన నార్యులును అనార్యులును ఉచితవిధంబున కలసినవారై రెండు జాతులయందలి సుగుణంబులను కలిగి యుండిరి. ఇట్లు రెండుజాతులును కలిసినదాని కుదాహరణంబుగ నచ్చటి దేశభాషనే చెప్పవచ్చును. మహారాష్ట్ర భాషయొక్క లిపి సంస్కృతలిపి. శబ్దములు చాలవఱకు ప్రాకృతమును సంస్కృతమునై యున్నవి. కావున నాభాషయొక్క మూలము ద్రవిడమును, ఉపరి నిర్మాణమంతయు సంస్కృతమునై యున్నవి. జనులు శరీరవైఖరియందు హిందూస్థానీయులంతటి మృదుసుందరయవయవసౌష్ఠవములు కలవారు కారు; అయినను, దాక్షిణాత్య ద్రవిడజాతులంతనల్లని వికారరూపంబులను కలవారుకారు. ఇంతేకాక మహారాష్ట్రములోని యార్యజాతి, మొదటవచ్చి నివాసముగ నేర్పఱచుకొనిన యార్యులనేగాక అటుతరువాత రాజపుత్రసంబంధమైన సిథియను దండయాత్రికులనుకూడ కలిగియుండెను. అనార్యులలో, అనాదిసిద్ధముగ దేశమునందున్న భిల్లులు, కోలీలు, రామూసీలు, మొదలైన నీచజాతులేగాక యుత్తమవర్ణముల ద్రావిడులుకూడ నుండిరి. ఇట్లు జనులయందు వివిధజాతీయ లక్షణంబు లుచితరీతిని సమ్మేళనంబై యుంటవలన నాదేశముయొక్క మతవిశ్వాసములును ప్రతిష్ఠాపనలును ఆచారములును దేశమునం దితరభాగములందులేని స్థైర్యమును సంపాదించి నిలిచియుండెను. మహారాష్ట్రుల ప్రాబల్యమున కిది కూడ నొకకారణము.

మహారాష్ట్ర దేశవాసు లందఱకును, సామాన్యముగ నితరదేశభాగముల వారితో సంబంధించిచెప్పునపుడు మహారాష్ట్రు లను పదము ప్రయోగింపఁబడును. కాని యా పదము రూఢముగ మహారాష్ట్రక్షత్రియులకే వారిలో వాడఁబడును. మహారాష్ట్రబ్రాహ్మణులయందు ముఖ్యమైన తెగలు రెండుగలవు. పూర్వమొకప్పుడు కొంకను దేశమునందుండి యుండినకారణమున నట్టివారిని కోంకనస్థులనియును, దేశమునందుండి యుండినవారిని దేశస్థులనియును రెండు

శాఖలుగలవు. బ్రాహ్మణులకును మహారాష్ట్రులకును మధ్యనింకొక తెగవారు పరభూలనిగలరు. వీరు రాజపుత్ర వంశీయులమని చెప్పుకొందురు. వీరును బ్రాహ్మణులవలెనే మత్స్యమాంసాదులను పుచ్చుకొనరు. శూద్రులను కున్బీలందురు. మన దేశమున కమ్మశబ్ద మిందుండియే వచ్చియుండును. ఈకున్బీలకును మహారాష్ట్రశబ్దము ప్రయోగింపఁబడినను నిశ్చయముగ క్షత్రియులకుమాత్రమే యా నామము వారిలో చెల్లును.

మహారాష్ట్రదేశమునందు స్త్రీలకు ఘోషాపద్ధతి లేదు. కాని క్షాత్రమవలంబించి, రాజపుత్ర వంశజాతుల మని చెప్పుకొను వర్ణములవారే ఉత్తమ మహమ్మదీయ స్త్రీజనంబులవలె ఘోషాపద్ధతి నవలంబించియుండిరి. వీరిది దక్కను మహమ్మదీయులనుఁ జూచి నేర్చుకొని యుండవచ్చును. కాని వారు మాత్రము ఆపద్ధతి తమ కనాదిగ రాజపుత్రులకాలమునుండియు వచ్చినదని చెప్పుదురు. మహారాష్ట్రస్త్రీలు, రాజపుత్రస్త్రీలవలెనే, భర్తకళేబరంబుతో సహగమనము పూర్వకాలమునందు చేయుచు వచ్చిరి. కాని సంరక్షింపఁబడవలసిన పసిపిల్లలెవరైన యుండినఁగాని, కుటుంబవ్యవహారములు ముఖ్యమైనవేవైన యుండినఁగాని యట్టికృత్యమునుఁ జేయకుండ బంధువులచే నాపివేయఁబడుచుండెడివారు. పై చెప్పఁబడిన రెండవ కారణముచే వారు భర్తమరణానంతరము జీవింపఁ దలఁచుకొనినయెడల వారు తమయొక్క ఘోషానువిడచి రాచకార్యములయందును, యుద్ధకార్యంబులయందునుఁగూడ పురుషులతోఁ గలసి చాలవరకుఁ దిరుగుచుండెడువారు.

మత విశ్వాసములయందును ఆచారములయందును చాలవరకు దక్కనునందలి తక్కినదేశీయులనే పోలియుందురు. వారు గణపతి నెక్కువగఁ బూజింతురు. ఆంధ్రదేశమునందువలెనే పురాణములనుండి హరికథలను వినుటకు వారెక్కువగఁ గుతూహలురైయుందురు. మహారాష్ట్రులు, చదువుట, వ్రాయుట, గణితము స్వల్పముగ నేర్చుకొని తక్కిన పాండిత్యమంతయు తమ బ్రాహ్మణ గురువులకు వదలివేయుచుందురు. తమయొక్క శక్తిసామర్థ్యము లన్నియు

యుద్ధవిషయములందును, పరిపాలనా విషయములందును బాల్యంబునుండి వారు పెంపుచేయుచుందురు.

మహారాష్ట్రముయొక్క ప్రాచీన చరిత్రముగూడ, సామాన్యముగ ప్రతిదేశపు ప్రాచీన చరిత్రమువలెనే, గూఢముగ నున్నది. అయినను మహమ్మదీయ విజయమునకుఁ బూర్వము రెండు మూడు * విప్లవములు జరిగినట్లు చూపట్టుచున్నవి. మహారాష్ట్రములో నాదిమనివాసులు గర్సేలను నొక మోటుగాయకులని జనులయొక్క పుక్కిటి పురాణము గలదు. ఈ కథయే పురాణములయందును, రావణుఁడు తన రాజ్యకాలములో కావేరి గోదావరి మధ్యదేశమగు దండకారణ్యమును, బజంత్రీల కొసంగినట్లు, చెప్పఁబడియున్నది. కాని ఈ దేశములో చరిత్రాధారము కొంచెము గలిగిన కాలములో తాగరా యను రాజధాని విలసిల్లి యుండినట్లు తెలియవచ్చుచున్నది. క్రీస్తు పూర్వము 250 సం॥ల క్రింద ఈజిప్టుదేశవాసు లీ పట్టణమునకు వచ్చుచు పోవుచుండినట్లు తెలియుచున్నది. 'ఎరిత్రియను సముద్రముయొక్క పెరిప్లసు' అను గ్రంథమును వ్రాసిన గ్రంథకర్త రెండవ శతాబ్దమున వ్రాయుచు, నా పట్టణము యెక్కువగ నొక పేటలు గలదానిగను, గొప్ప వ్యాపార స్థానముగను, గ్రీకులకుఁ దెలిసియున్నదానిగను వర్ణించెను. ఈ రాజధాని పట్టణముయొక్క పేరు, మన హిందువు లనేకులకు పరిచయ మైనదేగాని, స్పష్టముగ నెక్కడ యుండెడిదో యిప్పుడు తెలియరాకున్నది. అది బహుశః గోదావరి యొడ్డున ప్రస్తుత నైజాము రాజ్యములో నుండి యుండవచ్చును. అది యొక రాజపుత్రరాజుయొక్క యధికారములో నుండి తక్కిన యనేక సామంత రాజులపై యాధిక్యమునుఁ బొంది యుండవచ్చును. ఆయన, తాగర రాజాధిరాజు అని తామ్రశాసనములపై వ్రాసి యుండెను.

ఈ తాగర రాజులు ఉత్తరమునుండి దాడివెడలి దేశమును జయించి యుండవచ్చును. దీని తరువాత మనకు సూచనగఁ దెలిసిన విప్లవము, శాలివాహనుఁడను శూద్రకులజునిచే నిర్వహింపబడిన తిరుగబాటు వలన గలిగినది. దీని

* విప్లవము=గొప్పమార్పు (Revolution).

జ్ఞాపకార్థమే దక్షిణమునందు క్రీ. శ. 78 నుండి యేర్పడిన శాలివాహన శకము వాడుకలో నున్నది. ఈ శాలివాహనుడు కుమ్మర వంశమందు జన్మించెనని కొందఱును, కుస్త్రీ యనఁగా శూద్రవంశమందు జన్మించెనని కొందఱును, యనేక కథలు చెప్పుచుందురు.

ఈ శాలివాహనుఁడు శతవాహనుఁడని కూడ బిలువఁబడుచున్నాఁడు. ఈ శతవాహన వంశమును, మౌర్యవంశము క్షీణించిన తరువాత యున్నతికి వచ్చిన దని పురాణములయందు చెప్పఁబడు ఆంధ్ర భృత్యవంశమును, నొక్కటే యని కొంత ఋజువు చేయఁబడినది. ఈ శతవాహనుల కాలమున దక్కను రాజధాని తాగరానుండి పృథుస్థానునకు మార్చఁబడినది. ఈ పృథుస్థానము పెరిప్లసు అనుపేరుగల గ్రంథమునందు పైతాణా యని వ్రాయబడియున్నది. ప్రస్తుతము గోదావరియొడ్డునయున్న మంగపట్టణము అదియే. శాలివాహనుని పురాణగాథ యందతఁడు అశ్మకునందు రాజ్యము చేయుచున్న రాజు నోడించి యా రాజ్యము నాక్రమించుకొనినట్లు చెప్పఁబడియున్నది. ఈ రాజు సూర్యవంశజుఁడైన శిశుదేవుడను వాని సంతతివాఁడు. ఈయన పూర్వికుడు కోసలదేశము నుండి వచ్చి నర్మదానదికి దక్షిణమున రాజ్యము స్థాపించుకొనెను. శాలివాహనుఁడు జయించు నప్పటికి 1680 సంవత్సరములనుండి యా వంశీకు లచ్చట రాజ్యము చేయుచున్నవారట. శాలివాహనుడు వాని వంశమునెల్ల నిర్మూలము చేయగా నొక స్త్రీ మాత్రము తన చిన్నికుమారునితో శాత్పురా పర్వతమునకుఁ బాఱిపోయి యచ్చట నే మాహాత్మ్యమువలననో సంరక్షణ పొందెనట. ఆమె కుమారుడు పెద్దవాఁడై తరువాత చిత్తూరు రాణాకు మూల పురుషుఁడయ్యెనట. చిత్తూరు రాణానుండి యుదయపురము రాణావంశ ముద్భవించెను. హిందూస్థానపు రాజపుత్రవంశములలో నిది పురాతన మని యెల్లరిచే నంగీకరింపఁబడును. వీరినుండియే మహారాష్ట్రులు జన్మించిరి మని చెప్పుకొందురు. శాలివాహనుడు మాళ్వాదేశాధీశుఁడైన విక్రమార్కునితోఁ బోరినటుల గాథలు గలవు. వారిద్దరును చిట్టచివఱకు సంధిచేసికొని నర్మదా నది కుత్తరమున విక్రమార్కరాజ్య ముండునటులను, దానికి దక్షిణమున శాలివాహనునిరాజ్య ముండు

నటుల! ఏర్పఱిచికొని తమ తమ శకములు తమ తమ దేశములయందు తమ రాజ్య ప్రారంభ కాలములనుండి యుండునటుల నేర్పఱుచుకొనిరని చెప్పుదురు. అయితే, విక్రమార్క శకము క్రీ.పూ. 56 సం॥ల క్రిందనుండియు, శాలివాహనశకము క్రీ.శ.78 నుండియు నుండుటవలన 133 సంవత్సరముల భేదము గనుపడుచున్నది. అయితే ఇందెవరైన తమ పూర్వీకుల కాలమునుండి శకమునకు లెక్కపెట్టుకొని యుండవచ్చును. దీని తరువాత 500 సం॥ములకు ప్రథమచాళుక్య వంశజుం డగు పులికేశవల్లభునిచే సిథియను దండయాత్ర మరియొకటి ఎదిరింపఁబడెను. ఈతని మనుమఁడగు విష్ణువర్ధనుడే మన రాజరాజ నరేంద్రుని వంశము నాంధ్రదేశమున స్థాపించెను.

మహారాష్ట్రమునం దింక ననేక విప్లవములు జరిగి యుండవచ్చును. పైఠాణానుండి, అల్లా యుద్దీను దక్షిణదేశపు దండయాత్ర జరుగునప్పటికి రాజధానిగా నున్న దేవగిరి పట్టణమునకు (ప్రస్తుతము దౌలతాబాదు) రాజస్థానము మార్పబడిన దెట్లో యెప్పుడో స్పష్టముగ మనకు తెలియదు. కొందఱు శాలివాహను నుండి దేవగిరి రాజైన రామదేవ యాదవుని వఱకు వంశ వృక్షమునుఁ జూపుదురు. ఆ కాలము నాటికిని, యింకను వెనుకకు చరిత్రాధారము దొరకినంతవఱకు మహారాష్ట్రము చిన్న చిన్న సంస్థానములుగ కొంచె మెచ్చు తక్కువగ స్వతంత్రము గలవిగ నున్నట్లు గనుపడుచున్నది.

అల్లా యుద్దీను యొక్క సైన్యాధిపతియగు మాలిగాఫరుతో గలిసి, రెండవ దక్కను దండయాత్రలో గుజరాతు గవర్నరగు అల్ఫఖాను యుద్ధంబు చేసినపుడు, కిల్లైను అను రాజుచే నెదిరింపఁబడినట్లు ఫెరిష్టా అను మహమ్మదీయ చరిత్రకారుడు వ్రాయుచున్నాడు. బొంబాయి దగ్గర ఠాణా యందు దొరకిన యొక తామ్రశాసనమందు క్రీ. శ. 1018 సం॥ములో శాగర వంశజుఁడనని చెప్పుకొను నొక రాజు సాలసెట్టి ద్వీపము నేలుచున్నట్లు చెప్పఁబడి యున్నది. అట్టి తామ్రశాసనమునందే, సతారా వద్ద దొరకిన మఱియొక దానియందు 1192 సం॥న పన్హాలా రాజు విస్తార రాజ్యమును పాలించి యున్నట్లు తెలియపఱుపఁబడి యున్నది. ఈ రాజును శాగర వంశజుఁడ నని చెప్పుకొను

చుండెను. సింగన యను నింకొక రాజపుత్రవంశజుఁడీ యన నోడించినట్లును యనుశ్రుతముగ నొక కథ చెప్పబడుచున్నది. ఈ పన్హాల రాజు నోడించు నపుడు, సింగన దండు విడిసిన స్థల మిప్పటికిని సతారాకు దక్షిణమున పూనసోలీ దగ్గర మహాసూర్ణ ప్రక్కను చూపింపఁబడుచున్నది. సింగనరాజు స్థిరముగ తన రాజ్యమును స్థాపించక పూర్వమే మృతుఁడయ్యెను. అటు తరువాత పన్హాల రాజగు భోజుని రాజ్యము మహారాష్ట్ర పోలిగార్ల వశ మాయెను. కొంకను ఘాట్మాతా, పూనాదగ్గరనుండి వరుణావరకును సిర్కే వంశమువారికి చెంది యుండెను. ఈ వంశమువారు రాజా బిరుదును వహించి యిప్పటికిని మహారాష్ట్రరాజ వంశములలో నుత్తములుగ పరిగణింపఁబడుచున్నారు.

ఇట్లు మనకు తామ్రశాసనములను బట్టియు, శిలాశాసనములను బట్టియు, నాణెములను బట్టియు తెలిసినంత వఱకు, దేశము చిన్న చిన్న సంస్థానములుగ చీలిపోయి యుండి, యొక్కొకప్పు డొక్కొక్క సంస్థానము రాజస్థానముగ నేర్పడుచున్నట్లుగ నుండుచు వచ్చెను. చాళుక్యుల క్రిందను, రాష్ట్రకూటుల క్రిందను, యాదవ రాజుల క్రిందను, తాగరా, పైఠాను, బాదామి, మళఖేడు, గోవా, కొల్లాపురము, కల్యాణి, దేవగిరి మొదలైన రాజధానుల కొక చోట నుండి యింకొకచోటకు అధికారము మాఱుచు వచ్చుచుండెను. వీరందఱు నొకరితో నొకరు ఆధిక్యతకు పోరాడుచు వచ్చిరి. మహమ్మదీయులు రెండువందల సంవత్సరములు ఉత్తర హిందుస్థానమునుండి, దక్కనుకు 14 వ శతాబ్దారంభమున వచ్చు వరకు వీరిట్లు పోరాడుచునే యుండిరి. బహిరంగమైన దేశము నంతను మహమ్మదీయులు జయించు నప్పటికి, వారికి 30 సం॥ములు పట్టెను. పశ్చిమ మహారాష్ట్రమును కొంకణమును పూర్తిగ నెప్పుడును వశము చేసుకొనఁ బడలేదు. 15 వ శతాబ్ద మధ్యమునఁ గాని కొంకను జయింపఁ బడలేదు. ఇక ఘాట్మాతయు, మావలులును, మహమ్మదీయుల చేత, నమదేశము జయింపఁబడిన యర్థములో నెన్నడును జయింపఁబడలేదు. ఇట్లు వీరిలో వీరు చిన్న చిన్న దేశభాగములవారు స్వతంత్రముగ నుండవలెనని యాసక్తిగలిగి యుంటవలనను, జనులయొక్క యిదివరకు చెప్పఁబడిన గుణలక్షణములవలనను

వారియొక్క ప్రత్యేక పరిపాలన పద్ధతులును ప్రతిష్ఠాపనలును ఏర్పడెను. వీనినిగూర్చి యిఁక విచారింతము.

హిందువుల దేశమందంతటివలెనే, మహారాష్ట్రదేశమునను గ్రామపరిపాలనపద్ధతి యేర్పడి యుండెను. ప్రతిగ్రామమును ఒక చిన్నరాష్ట్రముగ నేర్పడి, దానిలోపలనే పరిపాలన వ్యవహారమును స్వతంత్రముగ చక్కబెట్టుకొనుటకు తగిన రాజ్యాంగములను గలిగియుండును. అంగడిగలిగినగ్రామమునకు కస్బా యనియు, అంగడిలేని యూరునకు మౌజాయనియును పేరు. దేశములోని భూమియంతయు, అగమ్యమైన అరణ్యపర్వతప్రాంతములుతప్ప, యేదేనొక గ్రామమునకు చెందియుండును. భూమి సరిహద్దులును, ఆక్రమణలును, సాగులును గ్రామలెక్కలలో నమోదుచేయఁబడియుండును. ఈలెక్కలన్నియు తయారుచేయు నతఁడు గ్రామలేఖకుఁడని పిలువఁబడును. ఇతనినే కులకర్ణి యనిగూడ నందురు. మనవైపున కరణ మనుపద మిందుకొఱకు ఉపయోగింపఁబడును. గ్రామమున కధికారి పటేలనియును గ్రామాధికారి యనియు నందురు. వీరిద్దఱిచేతను గ్రామమునందలి వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కావలివారు మొదలైన యవసరమైన వృత్తులవారందఱితో గ్రామవ్యవహారము లన్నియును నెఱవేర్పఁబడుచుండును. వీరందఱకును తగిన యినాముభూములుండును. పటేలు సామాన్యముగ శూద్రుఁడుగాని క్షత్రియుఁడుగాని యై యుండును. ఈ పటేలులమాన్యములు హిందూధర్మశాస్త్రప్రకారము అన్నదమ్ములు పంచుకొనఁదగినవి కావున సామాన్యముగ చిన్నచిన్నభాగములుగ విడిపోయి పలుకుటుంబములకుఁ జేరుచుండును. ఇట్లు భాగముల ననుభవించువా రందఱును పటేలులమని పిలుచుకొందురు. ఇందు ముఖ్యముగా గ్రామాధికారము చేయు నతఁడు మొఖద్దము అని పిలువఁబడును. గ్రామలేఖకుఁడు లేక కులకర్ణి సామాన్యముగ బ్రాహ్మణుఁడును, కొన్నియెడల పరభూగాని లేక విశ్వబ్రాహ్మణుఁడుగాని యై యుండును.

పటేలు వ్యవసాయమును కనుఁగొనుచు, గ్రామరక్షణకును, అప్పుడప్పుడు వారిసంతోషమునకును గావలసినపనులను జేయుచుండును. గ్రామములో నేవైన

తగాయిదాలు వచ్చినపుడు సామాన్యముగ నుభయపక్షముల వారిని మందలించి, బుద్ధిగఱపి సమాధానము చేయుచుండును. అట్లు తీరనియెడల పంచాయితీని బిలచి యా తగాయిదాలు వారి ముందుంచి పరిష్కారము చేయించుచుండును. క్రిమినల్ విషయములలో పటేలు కొన్నికొన్ని వేళలయందు మహారాష్ట్ర రాజ్యములో స్వతంత్రముగ విచారించినట్లు గనుపడి నప్పటికిని, తనపై యధికారికి తెలియచేయవలసిన వాడయియుండెను.

కరణముయొక్క యుద్యోగము, శిస్తు వసూలు చేయుటయు లెక్కలు వ్రాయుటయునై యున్నది. మహారాష్ట్ర దేశములో శిస్తులో యెక్కువభాగము భూమిమీదనే యై యున్నది. ఇదిగాక ఇంక రెండుయుపాధులుగలవు. ఎగుమతి దిగుమతుల మీదను అనేక చిల్లరహాంశములలో వేయఁబడిన పన్నులన్నియు స్వల్పముగ నుండును. పైఁజెప్పబడిన భూమిశిస్తును నిచియుగఁపఁబడిన యెడల జమాబంది యనఁబడును.

ఈ పటేలు కులకర్ణములకును, రాజునకును మధ్య నింకొక యధికారు లుండెడివారని కొంత యూహింపఁదగియున్నది. గ్రామమునందు పటేలు ఎటులనో, దేశమునందు దేశముఖు డావిధముగ నుండును. గ్రామమునకు కులకర్ణ మెటులనో దేశమునకు దేశపాండ్య లేక దేశలేఖకుఁ డటుల నుండును. దేశముఖుఁడును పటేలును సామాన్యముగ మహారాష్ట్రులై యుందురు. దేశపాండ్యయును కులకర్ణమును సామాన్యముగ బ్రాహ్మణులై యుందురు.

ఈ దేశాధికారికిని దేశపాండ్యకును జిల్లాలో కొంతకొంతభాగములు స్వంతమున కియ్యఁబడియుండెడివి. అది సుమారుగ దేశముయొక్క శిస్తులో 20వ వంతువచ్చు సాగుబడిభూమియై యుండును. దేశపాండ్యకు, దేశముఖురాబడిలో సగముమాత్రమే యుండును. ఈ దేశాధికారియు దేశపాండ్యయు హిందువుల రాజ్యాంగములలో నున్నట్లు, విజ్ఞానేశ్వరములో, పంచాయితీనుండి అప్పీలు గ్రామాధికారి యాజ్ఞప్రకారము దేశాధికారి కని చెప్పఁబడి యుండుటవల్ల మనకు తెలియవచ్చుచున్నది. కాని వారికి వారసత్వముతోఁగూడిన యినాము

భూము లున్నట్లు తెలియరాదు. ఆంగ్లేయ మహారాష్ట్రచరిత్రకారుడు, ఈ స్థితిలో నున్న దేశాధికారులు మహమ్మదీయరాజ్యము వచ్చినమీదటనే గలిగియుండ వచ్చుననియు, మహమ్మదీయ రాజ్యమును త్రోసివేసి మరల హిందూరాజ్యము మహారాష్ట్రమున యేర్పడుటవలన, నచ్చటి, దేశముఖ దేశలేఖకులు, బెంగాలు నందు జమీందారులు, మహమ్మదీయరాజ్యము పిమ్మట యేర్పడిన బ్రిటిషురాజ్యము మాయచేసి జమీందారిపద్ధతిని గ్రహించినటుల తమ దేశీయులగు వారిని తాము మాయచేయు వీలు కలుగలేదనియు, చెప్పుచున్నాడు. నిజమే యై యుండవచ్చును. కాని హిందూరాజ్యమును మొట్టమొదట త్రోసివేసినపుడు మహమ్మదీయులకు పరిపాలన సులభముగ జరుగుటకు అట్టి యధికారు లవసరమై యుండవచ్చును. వారు లేనిదే స్వల్పసంఖ్యాకులును, అల్పపరిచయులు నగు మహమ్మదీయులు శాంతముగ పరిపాలనఁ జేసికొనలేరు గావున వారి నేర్పఱిచి యుండవచ్చును. అటుతరువాత మహమ్మదీయులనుండి బెంగాలులో బ్రిటిషు వారు రాజ్య మేర్పఱచుకొనినపుడు, తత్పూర్వమున్న పద్ధతులను మార్పుఁ జేసిన యెడల దేశము శాంతముగ వశము గానేరదు కావుననే యాకాలమున బెంగాలునందు జమీందారీపద్ధతిని వారేర్పరచిరిగాని, ఆంగ్లేయచరిత్రకారుడు తలంచినటుల తొందరపడి వారొసంగియుండలేదు.

వీరి యధికారముయొక్క యుత్పత్తి యెట్టులైనను వీరు మహమ్మదీయ రాజ్యమునకు పూర్వముననే క్రమక్రమముగ కొంతకొంత స్వతంత్రాధికార మును సంపాదించి, నాయకుడు, పోలిగరు, రాజా యను బిరుదులను ధరించి యున్నతికి వచ్చియుండిరి.

గ్రామమునందును దేశమునందును వారసత్వముగవచ్చు స్థిరాస్తి, హిందూ రాజ్యములో వృత్తియనియు మహారాష్ట్రమున వత నవియు పిలువఁబడును. అట్టిగౌరవనీయమైన వతనులు గలవానిని వతన్ దా రను పేరునఁ బిలుతురు. ఈ వతనములయెడల మహారాష్ట్రుల యభిమానము విపరీతము. వతనును పోగొట్టు కొనుట మానమును పోగొట్టుకొనుటగా వారు జూచుచుందురు.

ఈ గ్రామపంచాయితీలు, గ్రామపరిపాలన పద్ధతులు మొదలైన రాజకీయ ప్రతిష్ఠాపనలతోపాటు, దేశమునందు సామాన్యజనమతము, ఉత్తరహిందూస్థానముయొక్క వివిధవర్ణభేదమునుగాని, దక్షిణదేశముయొక్క పలుశాఖాభేదమునుగాని పరిత్యజించి, మధ్యస్థముగనుండెను. సంఘము దారుఢ్యమై యుండుటకు, రాజకీయ సామాజిక జీవనములలో నెన్నియవసరమైన వర్ణములు కావలసియుండునో యన్నియే వర్ణములు కల్పింపఁబడియుండెను కాని, అనవసరభేదము లెక్కువగలేవు. స్మార్తులు, వైష్ణవులు, శిష్టాచారులు, భ్రష్టాచారులు, అని తుంగభద్రానది దాటినతోడనే కనుపడు ద్వేషభావములు, మహారాష్ట్రమున అంతగా కనుపడవు. వారొకవేళ పూర్తిగ కలిసి యుండకపోయినను ఒండొరులయెడల సహనము మెండుగాఁ గలిగి యుండిరి. బ్రాహ్మణులును, బ్రాహ్మణేతరులును వ్యవహారములలో సరిసమానస్థితియందు తఱచుగ గలసికొందురు. దక్షిణదేశమునందువలె మతాధిపతులును గురువులును బయలుదేరి వారివారి వర్ణశాఖాభేదంబులను ప్రోత్సాహము చేయుట కచ్చట నట్టివారు లేరు. ఇంతేఁగాక, అచ్చట వైష్ణవభక్తులబోధచే శూద్రాదు లనేకులు తమకియ్యఁబడిన నీచస్థితినుండి తప్పించుకొని క్షత్రియులుగ గాని, వైశ్యులుగ గాని మారి యుండిరి. మరియు నాలలయందును, బ్రాహ్మణులచే సహితము సత్కరింపఁబడు మహాత్ములుదయించిరి. ఇట్టి ప్రశాంతకరం బగు కారణములవలన మహమ్మదీయులు సహితము తమ మూర్ఖస్వభావమును విడిచియుండిరి. హిందువులు, మహమ్మదీయుల పండుగలందు సంతోషముల నడుపుదురు. మహమ్మదీయులును, ఉత్తరహిందూస్థాన సంబంధములేనిచో, హిందువులయెడల నట్టి యన్యోన్యమే కలిగియుందురు. కొందఱు మహమ్మదీయ ఫకీరులును హిందూమహాత్ములతో సమానముగా గౌరవింపఁబడుచుండిరి. రెండు జాతులవారిచేతను సమానముగ గౌరవింపఁబడు కొందఱు మహాత్ములుకలరు. ఈ పరస్పర సహనభావమును, ప్రశాంతలక్షణమును అనేక శతాబ్దములకాలము దృఢమై, దేశజనులయొక్క ప్రవర్తనమందు స్థిరమైన గుణములై నిలచెను.

ఈ యుపోద్ఘాతవర్ణన యైన తరువాత, దక్కనునకు మొట్టమొదట మహమ్మదీయులు దండెత్తివచ్చిన కాలంబును విచారింతము. అప్పటినుండియు మహారాష్ట్రులు మహమ్మదీయుల సేవచేయుచు, వారి జయమే తమ జయమును కొని, వారి యారోగ్యమే తమ యారోగ్యమనుకొని, స్వతంత్రంబు మాట దలఁపక స్వపరజ్ఞానంబులేక వర్తించుచుండిరి. కాని మహమ్మదీయులకాలమందు, వారు తరువాత జూపిన యుద్ధపరిపాలనశిక్షానైపుణ్యంబులందు తయారగుచుండిరి. మహమ్మదీయులయొక్క పీడన కోర్వఁజాలక 17 వ శతాబ్దమున వారెదురు తిరుగునప్పటికి, వారు నేర్చుకొనిన రణవిద్యాకౌశల మెల్లఁ బనికివచ్చెను. వారంతవఱకును స్వతంత్రచరిత్రలేనివారు గావున నప్పుడు క్రొత్తవారుగ దూరదేశీయుల కెల్లరకు గానిపించిరి. బీజపూరు అహమ్మదు నగరము రాజ్యముల క్రింద సైన్యాధిపతులుగనుండి హిందూరాజ్యమగు విజయనగరముతో వీరు బోరాడి నాశనము చేసియేయుండిరి. కాని వారు మహమ్మదీయులక్రింద నుండుట వలన నందఱును మహమ్మదీయులుగనే మనము దలంచుచుంటిమి. హిందూరాజ్యమగు విజయనగరమును రక్షింపవలయునను మతాభిమానమేమియు వారికప్పుడులేదు. ఈ చరిత్రయొక్క యుద్దేశము, మహమ్మదీయులక్రింద మహారాష్ట్రులెట్టులుండిరో, ప్రస్తుతపరిపాలకులకు వెనుకటివారియొక్క విజృంభణవినాశము లెట్లు సంభవించెనో, విరళముగఁ దెలియపఱచుటయే యై యున్నది. వీరియొక్క నాయకుఁడగు శివాజీ మహారాజు ఉదయించునప్పటికి క్రమక్రమముగ మహారాష్ట్రులు బలవంతు లగుచుండినటుల చరిత్రవలనఁ దేటఁబడును.

ప్రకరణము. 8.

దక్కనుకు మహమ్మదీయుల దండయాత్రలు.

దక్కనునందు స్వతంత్రరాజులలో దేవగిరి రాజ్యాధిపతియైన యాదవ రామదేవుడు కడపటివాఁడు. ఈతఁడు రాజ్యముచేయుచుండ క్రీ. శ. 1294 సం॥నందు జలాలుద్దీను తమ్ముని కుమారుఁడగు నల్లాయుద్దీను కర్రాకు గవర్నరుగా నియమింపఁబడియుండి యొకసారి 8000 గుఱ్ఱపుదళమును పోగుచేసికొని దక్షిణ ముఖముగ ఎల్లిచుపూరువఱకు వచ్చి, అతాత్తుగ పశ్చిమమునకుఁ దిరిగి, స్వల్పకాలములో దేవగిరిముందు దండు విడిసెను. రామదేవు డింత శీఘ్రముగ తనపట్టణము ముట్టడింపఁ బడనున్నదని యెఱుఁగని వాడయ్యెను. కావున తగినటుల యుద్ధ సన్నద్ధుండు కాఁజాలకపోయెను. అయినను 4000 సైన్యమును పోగుచేసికొని పట్టణమునకును శత్రువునకును మధ్యఁ బోరాడ నిలచెను. కాని చాలకాలము సాధింపఁజాలనని తెలిసికొని కోటయందు కావలసినంత భోజన సామగ్రులాయత్తపఱచుకొని కొంతవడికి కోటయందు ప్రవేశించి ముట్టడికి సంసిద్ధుడయ్యెను. అల్లాయుద్దీను కోటను తీవ్రముగ ముట్టడించెను. అంతేఁగాక అల్లాయుద్దీను తనసైన్యము, వెనుక రాఁబోవుచున్న గొప్పసైన్యమునకు, పురోగామి యని వదంతివేసెను. ఇందువలన రామదేవుం డధైర్యపడి విశేషధనమిచ్చి సంధిచేసికొన నిచ్చగించెను. అల్లాయుద్దీనును సంతోషాంతరంగుండై యందుల కంగీకరించెను. ఇంతలో రామదేవుని కుమారుఁడగు శంకరుండను నతఁడు విస్తారసైన్యమునుఁ గూర్చుకొని ముట్టడిని విడిపించుటకు బయలుదేరి వచ్చుచుండెను. అల్లాయుద్దీ నా సంగతిని విని, యొక 1000 సైన్యమును ముట్టడిని జరుప నిలువయుంచి తక్కిన సైన్యముతో శంకరు నెదుర్కొనఁ జనెను. హిందువుల సంఖ్య యధిక

ముగుటచే మహమ్మదీయుల సైన్యము నలుప్రక్కలను వెనుకఁబడసాగెను. ఇదిగని కోటముట్టడియందు నిలువయున్న 1000 సైన్యమునువచ్చి అల్లాయుద్దీను సైన్యములోఁ గలిసికొనెను. ఆసైన్యమునుఁజూచి శంకరుని సైనికులు, ఢిల్లీనుండి యరుదెంచిన ప్రధానసైన్య మదియే యనుకొని యధైర్యపడి పలాయితులు గాఁజొచ్చిరి. అట్లు చెదిరిపోయిన సైన్యమును సంహరించుటకు మహమ్మదీయుల కనుకూలమయ్యెను. హిందువుల కీరీతిని సంపూర్ణ యపజయము సంభవించెను.

అంత రామదేవుడు సంధికి మరల రాయభారము లంపెను. అల్లాయుద్దీను యొక్క కోరిక లెక్కువాయెను. హిందూరాజుయొక్క మిత్రులు తమతమ సైన్యములతో సాహాయ్యమునకు రా సంసిద్ధులగుచుండిరి. ఇంతలో రామదేవుని కోటయందు తొందఱతొందఱగ వేసిన బస్తాలు, బియ్యమునకు బదులు ఉప్పును గలిగి యుండెనని తెలియవచ్చెను. లోపలనున్న భోజన సామగ్రి యంత్యమయ్యెను. అందుమీద నల్లాయుద్దీనుకు '600 మణుగుల ముత్యములును, రెండు మణుగుల బంగారుహారములును, 1000 మణుగుల వెండియు, 4000 పట్టుతానులును, ఇంక ననేకవిలువగల సామానులును' ఇచ్చి రామదేవుడు చిట్టచివరకు సంధి చేసికొనెను.

ఈ చండయాత్రవలన సంపాదించిన కీర్తిభాగ్యములచే నల్లాయుద్దీను తనపినతండ్రినిఁజంపి ఢిల్లీ సింహాసనము నాక్రమించుకొనుటకు మార్గమేర్పడెను. ఇతని రాజ్యకాలములో నితనిచే గుజరాతునందు బానిసగాఁ గొనఁబడి మహమ్మదీయుడుగాఁ జేయఁబడి యితనికి ప్రియుండగు మాలిగాఫర్ అనునతని యాధిపత్యముక్రింద దక్కనులోనికి మూడుదండయాత్రలు పంపఁబడెను. అందు మొదటిది మార్చి 1307 వ సం॥లో రామదేవుడు కప్పము కట్టకపోయినందున, 30,000 గుఱ్ఱపుదళముతో నతని శిక్షింపఁబంపఁబడెను. ఆ యుద్ధములో రామదేవు డోడింపఁబడి ఖైదీగా ఢిల్లీకి తీసికొనిపోఁబడి యచట ఆఱునెలలుంచబడి విడిచి పెట్టఁబడెను. తరువాత రెండవసారి దండయాత్ర 1309 వ సం॥ మున త్రిలింగదేశమును జయింప మాలిగాఫరు మరలఁ బంపఁబడినపుడు దేవగిరి యందు రామదేవుఁ డాతని కాతిథ్యమిచ్చెను. ఆ సంవత్సరమే రామదేవుడు

స్వర్గస్థుఁడయ్యెను. అతని కుమారుఁడు శంకరుఁడు మరల కప్పముఁ గట్ట మాని వేసెను. అందువలన 1312 వ సం॥ న మరల మాలికాఫరువచ్చి శంకరు నోడించి మరణదండనవిధించి దేశమునంతను పాడుచేసి తన నివాసమును దేవగిరియం దేర్పఱచుకొనెను. అల్లాయుద్దీను యవసానకాలమందు చక్రవర్తి రాజ్యమునం దల్లరు లెక్కువగుటవలనను, మాలికాఫరుయొక్క గర్వబోతు తనమున కనేక మహమ్మదీయ ముఖ్యు లసహ్యించుకొని యుండుటవలనను, వారిలో వారికి కుట్ర లెక్కువగుటచే, దక్కనునందు హిందూరాజు లొక్క దేవగిరికోట తప్ప తక్కిన దేశమునంతను అల్లాయుద్దీను మరణకాలము నాఁటికి మరల సంపాదించుకొనిరి. అల్లాయుద్దీను మూడవకుమారుఁడు ముబారక్ అనునతఁడు సింహాసనమునకు వచ్చి హిందూరాజులచే ముట్టడింపఁబడియున్న దేవగిరిని రక్షించుటకు 1318 సం॥ లో దక్కనునకు వచ్చెను. ఈ యుద్ధమునం దతఁడు శంకరుని బావమఱదియగు హరపాలదేవుని ఖైదీగఁగొని యతనిచర్మమును ప్రాణముతో నుండగ క్రూరముగ నొలిపించెను. ఇట్లు మహారాష్ట్రముయొక్క హిందూరాజ్యము పొంతమై మహమ్మదీయుల యాధీనమయ్యెను.

టోగ్లాకు చక్రవర్తికాలములో మరల నింకొక తిరుగబాటు దక్కనునందు సంభవించెను. 1323 వ సం॥ములో చక్రవర్తికుమారుఁడగు యూనాస్ (మహమ్మదు బీన్ టోగ్లాకు) త్రిలింగదేశములోనికి దండెత్తివచ్చి ఓరుగల్లుపట్టణమును పట్టుకొనెను. ఈ కారణముననే యచ్చటి ముఖ్యవాస్తవ్యు లనేకు లా పట్టణమును విడిచిపోయిరి. అందు ముఖ్యులగు నిద్దరు రాజపుత్రులు బుక్కరాయలు హరిహరరాయ లనువారు తుంగభద్రానదియొడ్డున విజయనగర సంస్థానమును స్థాపించిరి. ఈ సంస్థానము చాలకాలమువఱకు మహమ్మదీయ భామినీ రాజ్యమునకు శత్రువై యెదిరించుచు వచ్చెను.

మహమ్మదుబీనుటోగ్లాకు 1325 వ సం॥రమున రాజ్యమునకు వచ్చెను. ఈతనికాలమున మొగలులు డిల్లీపట్టణ ద్వారములవఱకును తమ దండయాత్రలను సలిపిరి. వారి దండయాత్రలకు భయపడియు, దక్షిణముననున్న హిందూరాజ్యములను సరియైన యదపునం దుంచుకొనఁజాలకయు, మహమ్మదు టోగ్లాకు

తన రాజధానిని దౌలతాబాదునకు మార్చుకొనఁ బ్రయత్నించెను. కాని యది కొనసాగలేదు. టోగ్లాకు, ఆ కాలమువారిలో గొప్ప విద్యావంతుఁడైనను, మిక్కిలి క్రూరుఁడును మూర్ఖుఁడునై యుండుటచేత నతని సరదారు లతనియెడ నయిష్టులైయుండిరి. టోగ్లాకు మొగలులతో పెనగులాడుచుండుటవలనను, ఉత్తరమున తిరుగఁబాటుచేసిన కొన్ని జాతులవారితోఁ బోరుచుండుటవలనను, దక్షిణమున ఓరుగల్లురాజు తనరాజ్యమును మరల సంపాదించుకొని మహమ్మదీయులను పారఁదోలెను. అందువలన టోగ్లాకు దక్షిణమును పూర్ణముగఁ జయించుటకు గొప్ప సైన్యమును పోగుచేసి సిద్ధపడుచుండగా, నతని సరదారులలోనే తిరుగఁబాటు బుట్టి దక్షిణమున స్వతంత్ర మహమ్మదీయ రాజ్యములకు కారణమయ్యెను.

భామినీరాజ్య మేర్పడుట.

గుజరాతునందు అప్పుడే అణగ గొట్టఁబడిన యొక తిరుగఁబాటునందు జోక్యముఁ గలుగఁ జేసికొనిన కొందరు పట్టువలగల సరదారులు, టోగ్లాకు యొక్క యాగ్రహమునకు వెఱచి, దౌలతాబాదు గవర్నరగు కుటుల్లుగుఖాను యొక్క శరణుఁజొచ్చిరి. అతఁడు టోగ్లాకుయొక్క యాగ్రహము క్రమక్రమముగ శాంతపడవచ్చునని తలఁచి వారిని రక్షింపఁబూనుకొనెను. అందువలన నా గవర్నరాతని కోపమునకు పాత్రుఁడై యుద్యోగమునుండి తొలగింపఁబడె. అందఱును వచ్చి చక్రవర్తిగారి దర్శనముఁ జేసికొన ననుజ్ఞాతులైరి. వారును క్షమాపణ కనేక బాసలనుఁ బొందినవారై చక్రవర్తిగారు విడిసియున్న దేశంబగు గుజరాతునకు పయనమైపోయిరి. గుజరాతు సమీపమునకుఁ జేరఁగనే, కొన్ని లక్షణములవలన మోసము తలంపఁబడినటుల వారికి పొడగట్టెను. అందుపై వారు, తమ్ముఁ దోడఁ గొనివచ్చిన యుద్యోగస్థునిఁ జంపి తిరుగబాటు ప్రచురపఱచి వెనుకకు దౌలతాబాదునకు ప్రయాణోన్ముఖులైరి.

1344 వ సం॥మున, తిరుగబాటు చేసిన యా మహమ్మదీయ సరదారులు హిందూరాజులచే గలిసికొనఁబడి దౌలతాబాదును జేరునప్పటికి వారి సైన్యము బహుళంబగుటవలన, కోటలోని సైన్యమును వారి పక్షమే చేరెను. వీరందఱును

1000 సైన్యమున కధిపతియై, మాల్వాలో చక్రవర్తి సైన్యమున కధిపతియైన యిస్మాల్ అనువాని తమ్ముడైన మల్లిక్ మూగు అనువానిని నాజరుద్దీను బిరుదుతో రాజుగానుండుట కెన్నుకొనిరి. ఈ గొప్ప తిరుగఁబాటును మహమ్మదు విని, గుజరాతునుండి పెద్దసైన్యముతోవచ్చి దౌలతాబాదు దగ్గర శత్రుసైన్యముతో చాలవరకు పోరాడి, స్పష్టమైన జయము పొందకపోయినను యెట్టకేలకు రణస్థలి నాక్రమించుకొనెను. తిరుగఁబాటు చేసినవారు తమలో నాలోచించుకొని, నాజరుద్దీను కోటను రక్షించుటకును, తాము వివిధ దేశభాగములకుఁ బోయి వానరయుద్ధంబు సలుపుటకును, నిశ్చయించుకొనిరి.

చక్రవర్తి యీ యేర్పాటును తెలిసికొనినవాడై, దౌలతాబాదు కోటను తత్క్షణము ముట్టడించి, కొంత సైన్యమును ఉమ్మదుల్ ముల్కు తెబ్రీజీ క్రింద విద్రోహసైన్యమును తఱుమఁబంపెను. కోటలోని సైన్యము లోఁబడ సిద్ధమగుచుండిరి. ఇంతలో డిల్లీలో మఱియొక తిరుగఁబాటు సంభవించినట్లు తెలియవచ్చెను. టోగ్లాకు ముట్టడివదలి పోవలసినవాఁడాయెను. అతఁడు లేని కారణమున, దక్కనేయు లందఱును ధైర్యమవలంబించి నలుదిక్కులనుండి కూడుకొని ముట్టడి సైన్యమును బాధింపఁజొచ్చిరి. ఇందుకు భయపడి వారు ముట్టడి నెత్తివేసిరి.

విద్రోహసరదాయల యందు సాహస సత్ప్రవర్తనంబులందు పేరుగొనిన జఫర్ ఖాను అనునతఁ డొకఁడుండెను. ఇతఁడు కడు సామాన్యస్థితినుండి ప్రసిద్ధికి వచ్చెను. డిల్లీపట్టణమందు కాంగో* యను నొక బ్రాహ్మణుని కితఁడు బానిసవాఁడు. ఈతని యజమానుఁడు వీని తెలివితేటలఁజూచి, స్వాతంత్ర్యమిచ్చి యాతఁడు పైకివచ్చుటకు తగిన సాహాయ్యముచేసి, యాతని భవిష్యద్రాజ్యలాభమునుఁ గూడ ముందుగఁ జెప్పెనని చెప్పుదురు. ఈతఁడు త్రిలింగ దేశాధీశునివలన సహాయమునుబడసి, తఱుముకొనివచ్చిన తెబ్రాజీని బీడరువద్ద నోడిం

---

* కానుంగో యనుపదమే కాంగోయని మహారాష్ట్రమున వాడఁబడుచున్నది. ఇది దేశపాండ్యావంటి బిరుదు.

చేను. మొదట రాజుగా నెన్నుకొనఁబడిన నాజరుద్దీనుకూడ రాజ్యభారము నతనికే సమర్పించెను. ఈతఁడు తనరాజ్యమును గుల్బర్గాయందు స్థాపించి,సుల్తాన్ అల్లాయుద్దీనుహాస్సేను కాంగో బహామనీ యను బిరుదునామములో, 1347 వ సం॥న సింహాసన మెక్కెను. ఇతని యైశ్వర్యమునకు మొదట కారణభూతుఁడైన బ్రాహ్మణునియొక్క యుపకారమును గుర్తెరిఁగినవాఁడై యాయనను తన ధనాగారమున కధ్యక్షునిగఁ జేసెను. ఆ విశ్వాసమువలననే తన పరానురాజ్యమునకు బహామనీ యను బిరుదునుఁ గూడఁ బెట్టెను. ఈ విద్రోహులు చేసినటు వంటి వానరయుద్ధమునకు దేశీయులయొక్క సహాయము విస్తారము కావలసియుండును; గనుక చాలవరకు ఈతని జయమునకు హిందువులే కారకులైయుండురని, మనము గ్రహింపవచ్చును. కావుననే యీతఁడును మెలకువగ దేశమంతయు తన స్వాధీనమగుటకు దేశీయులగు హిందూప్రజలతోడను, ఓరుగల్లురాజుతోడను సమాధానంబుగ ననేకవిషయంబులయందు ప్రవర్తించెనని తెలియవచ్చుచున్నది. ఇంతలో డిల్లీయందు మహమ్మదు టోగ్లాకు మృతుండగుట విని యా దిక్కునుండి భయము తగ్గినవాఁడై యతఁడు తన పరాక్రమవంతులగు యోధులను సోమరులుగనుండి గృహచ్ఛిద్రములఁ గలిగింపకుండ కర్ణాటరాజ్యంబగు విజయనగరంబును సాధించుటయందు వినియోగించెను.

ఈ మొదటి సుల్తాను 1357 వ సం॥మువఱకు రాజ్యముచేసెను. ఈయన అనేకమంది హిందువులకు జాగీరు లిచ్చుటవలనను, ఇంతకు పూర్వము దేశముఖులుగను దేశపాండ్యలుగ నున్నవారికి వారివారి స్థానములు స్థిరపర్చుటవలనను, కొందఱిని సైన్యములో యుద్యోగము లిచ్చుటవలనను, తనయెడల భక్తిగలవా రగునటుల చేసికొనెను.

ఈయనయొక్క వంశమువారు 1526 సం॥ము వఱకును రాజ్యము ననుభవించిరి. కాని యాలోపుగనే ఈ రాజులచే నియమింపఁబడిన గవర్నరులు ప్రధానస్థానమును లక్ష్యపెట్టక స్వతంత్రులై వెలసిరి.

ఈ మహమ్మదీయ ప్రభువుల కాలములో దేశీయులయొక్క తిరుగఁబాటులు విస్తారముగలేవు. అందు మొదటిది 1366 సం॥మున సంభవించెను

ఈ తిరుగుబాటు సుల్తానుయొక్క యుద్యోగస్థుఁడగు బహ్రింఖాన్ మజుందరాని యను వానివలన బయలుదేరఁ దీయబడినది. గోవిందదేవు జాధవుఁ డను నొక మహారాష్ట్రనాయకుని ప్రోత్సాహమువలన నది జరుపఁబడినది. సుల్తానుయొక్క సైన్యము కర్ణాటక దండయాత్రయం దుండుటవలనను, సుల్తాను చచ్చిపోయె ననువదంతి వ్యాపించుటవలన నిది కలిగెను. సుల్తానుయొక్క రాక తెలియగనే విద్రోహులు చెదిరిపోయిరి.

1396 వ సం॥ములో 'దుర్గదేవి' యను మహాక్షామము 12 సం॥ములు మహారాష్ట్రమునందు తాండవమాడెను. జిల్లా లన్నియు నిర్జనంబు లయ్యెను. దుర్గములన్నియు పోలిగారులకును బందిపోటు దొంగలకును వశములయ్యెను. 30 సం॥లవఱకు శిస్తేమియు వసూలుకాలేదు. 1429 వ సం॥ములో మల్లికుల్ తుజ్జారు, కొందఱు కొందఱు దేశముఖుల సహాయముతోడను, దాదూనర్సె కలే యను యనుభవశాలియగు బ్రాహ్మణునితోడను, దేశమునుజయించి, బందిపోటు దొంగల నణచివేసి, బాగుచేయుటకుగాను పంపఁబడెను. కాని యిందువలన శాశ్వతమైన లాభమేమియు కనుపడలేదు.

మరల 1436 వ సం॥న మాలీకుల్ తుజ్జారు క్రిందనే మఱియొక దండయాత్ర కొంకణ దుర్గములలోనికి పంపఁబడెను. ఈతఁడు, తన ప్రధానస్థానమును చాకన్ కోట దగ్గర నేర్పఱచుకొని, కొంకణరాజుల నందఱి నోడించుటకు సైన్యంబులనంపెను. ఒకరాజు వెంట నొకరాజుగ నెల్లరు వశులైరి. కృష్ణానది యుత్పత్తిస్థానమునకు దగ్గర, పూర్వము పన్హాలరాజును సింగన్న యోడించి కొన్న దేశభాగము నాక్రమించుకొనిన మహారాష్ట్ర పోలిగారగు సిర్కె వంశజుని నోడించి లోబఱచుకొనెను. అంతట తృప్తిఁజెందక మాలీకుల్ తుజ్జారా మహారాష్ట్రముఖ్యుని మహమ్మదీయు డగుమని బలవంతపెట్టసాగెను. కుటుంబసహితంబుగఁ జేతఁ జిక్కిన యా మహారాష్ట్రుఁడేమియు చేయఁజాలక, యట్టి బలాత్కారమునకు మనంబున కినుక గలుగ, మాయచే పగతీర్చుకొనఁదలంచి, యపూర్వవినయంబు నవలంబించి, తన శత్రుండగు నింకొక రాజు సింహగడ యుందున్నాడనియు, తానొక్కఁడు మహమ్మదీయుండైన నతడు తన ప్రజల

నెల్ల తనయెడల ద్వేషు లగునట్లు చేయఁగలఁడనియు, అతనినిఁగూడ జయించి మహమ్మదీయునిఁ జేసినయెడల తానుకూడ నందుల కియ్యకొందుననియు, నమ్మకము పుట్టునట్లు మనవి చేసికొనెను. మహమ్మదీయు లందులకు సమ్మతింప, యతని సైన్యము లన్నిటిని యా కొంకణ దుర్గమ కాంతారంబు మధ్యకుఁ దీసికొనిపోయి, నిద్రించుచుండ నా 'మహారాష్ట్రు'ండు సుమారు 7000 మందిని నిర్దయుండై నఱికివేసెను. సిర్కేవంశము మరల దేశము నాక్రమించుకొనెను. అటుతరువాత మరల నే దండయాత్రయును ఆ కొంకణప్రాంతములలోనికిఁ దలంపఁబడలేదు. 1469 సం॥లో ఖాజాజహాన్ గవాను గోవా దగ్గరనున్న భాగమును మాత్రము కొంతవఱకు జయించెను.

భామినీరాజ్యము చీలిపోవుట.

భామినీవంశము 1526 సం॥ ముతో నంత్యమయ్యెను. అంతకు పూర్వమే, కొంచె మెచ్చుతక్కువగ స్వతంత్రముగ నైదు రాష్ట్రము లేర్పడియుండి, నామమునకు మాత్రము ప్రధానస్థానమునకు సామంతములుగా నుండెను. (1) బీజపూరునందు యేదుల్‌శాహి, (2) గోలకొండయందు కుతుబుశాహి, (3) అహమ్మదునగరమందు నీజాముశాహి, (4) బేరారునందు ఉమ్మదుశాహి, (5) బీడరునందు బురీదుశాహి, గవర్నలుగ నుండిరి. వీరందఱును తమయొక్క స్వంత బలముల చేత చుట్టునున్న హిందూరాజ్యములనుండి కొంచెము కొంచెముగా సంగ్రహించుచుండిరి. ఇట్లగుటవలన మొట్టమొదట నేర్పడిన భామినీ రాజ్యమునకు సహజముగ తల భారమై, క్రొత్త యేర్పాటునకో లేక విప్లవమునకో దారి నియ్యవలసివచ్చెను.

1478 సం॥ న ఖాజాజహాన్ భామినీ రాజ్యమునంతను నాలుగుభాగములుగ భాగించి, వాని కధికారుల నేర్పఱిచి, ప్రతిభాగముయొక్క వ్యవహారములను గమనించుటకు కొన్ని యేర్పాటులు చేసెను గాని, యతని శత్రువులగు కొందఱు సర్దారులవలన నవి యమలులోనికి రాకుండ నాపి వేయఁబడినవి. ఇతని మీఁద లేని యపరాధమును మోపి, సుల్తానగు మహమ్మదు శాహివలన నస్యా

యముగ మరణ దండన విధించునట్లు, శత్రు సరదారులు చేసిరి. ఈ ఖాజా జహాఁ యొక్క వినాశమునకు ముఖ్యకారకుఁడు నిజాముల్ ముల్కు బైహిరి యని చెప్పుదురు. ఈ నిజాముల్ ముల్కుయొక్క చరిత్రకథ చిత్రముగ నుండును. ఇతఁడు పత్రి యనుపట్టణము నందుండిన బ్రాహ్మణ కులకరణముయొక్క పుత్రుఁడు. ఇతఁడు తన దేశమునందు క్షామ ముద్భవించినపుడు, తనతండ్రితోఁ గూడ కర్ణాటకమునకుఁ బోయెను. అచ్చట పిల్లవాఁడై యుండగ మహమ్మదీయ సైన్యములచేఁ జిక్కి, సుల్తానునకు బానిసఁగాఁ గొనిరాఁబడెను. సుల్తానువలన మల్లిక్ హుస్సేను అను నామముతో మహమ్మదీయుడుగ చేయఁబడెను. మహమ్మదుశాహి సుల్తా నితనియందు ప్రేమఁగలవాఁడై 'హజారీ' అనగా 1000 గుఱ్ఱపు దళమున కధిపతిగాఁ జేసెను. తరువాత క్రమక్రమంబుగ నున్నతోద్యోగంబుల నాక్రమించి, ఖాజాజహాఁయొక్క సిఫారసుమీఁద తెలింగనా దేశమున కధికారిగా నియమింపఁబడెను. తనకు బదులుగ తన కుమారుఁడగు మల్లిక్ అహమ్మదును త్రిలింగ రాజ్యమునందుంచి, తాను సుల్తాను శిబిరమున కుట్రలు బన్నుటకుగాను, రాజధాని యందుండెను. అట్లు తన పోషకుఁడగు ఖాజాజహానును జంపించి, తన దురాశా పిపాసను కొంతవఱకుఁ దీర్చుకొనినను, ఆ యైశ్వర్యము నతఁడు చిరకాల మనుభవింపకుండ శీఘ్రకాలములోనే, తాను రక్షించి యున్నతికిఁ దీసికొని వచ్చిన మఱియొక దుర్మార్గుని వలన, ఘోరముగఁ గడతేర్పఁబడెను.

ఖాజాజహాఁ చనిపోయినపిమ్మట, యా మంత్రి స్థానమునందు నిజాముల్ ముల్కు నియమింపఁబడెను. అతని కుమారుఁడగు మల్లిక్ అహమ్మదు తెలింగనానుండి అహమ్మదునగర ప్రాంతమునకుఁ బంపఁబడెను. ఇతని తండ్రి, పై చెప్పఁబడినటుల, చంపఁబడినపుడు తిరుగఁబాటుచేసి మొర్తిజా నిజాముశాహి యను బిరుదుతో స్వతంత్రము నవలంబించెను.

మల్లిక్ అహమ్మదు అహమ్మదునగరమునకుఁ బంపబడినపుడు, కుట్బుల్ ముల్కు అనునతఁడు తెలింగనాకు తురుపుదారుగ నియమింపబడెను. ఇతఁడు 1495 సం॥ న సుల్తాను నామముతో గోలకొండ సింహాసనమునెక్కెను. ఇతఁడు,

ఘనరామదాసు చరిత్రలో చెప్పఁబడు తానీషా వంశమునకు మూలపురుషుఁడు. ఖాజాజహాన్ చనిపోవునప్పటికి యూసఫ్ యేదుల్ ఖాను అను నతఁడు అహమ్మదునగర దేశభాగమునకు తురుపుదారుగనుండెను. ఆ మంత్రి చనిపోయిన తరువాత చేయఁబడిన యేర్పాటులలో, నితఁడు, ఖాజాజహాన్ క్రింద నిదివఱకు ఏలుబడిలో నున్న బీజపూరు భాగమునకు వచ్చి స్వతంత్రుఁడయ్యెను. 1489 సం॥ లో నితఁడు సుల్తాను చిహ్నములను ధరించెను.

బేరారు రాష్ట్రమునకు మొదటి సుల్తాను ఫత్తేయుల్లా ఉమ్మదులుముల్కు. ఈ యుమ్మదు వంశము 1574 సం॥ము వఱకునుండెను. తరువాత మొర్తిజా నిజాముల్ముల్కు వలన అహమ్మదునగర రాజ్యమునఁ గలుపుకొనఁ బడెను.

బీడరునందలి బరీదువంశము పైదానికంటెను స్వల్పకాల ముండి బీజపూరు వలనఁ గలుపుకొనఁబడెను.

ఇట్లు డిల్లీ చక్రవర్తియగు పిచ్చితోగ్లాకుయొక్క రాజనీతిచే నుదయంబైన భామినీరాజ్యము క్రమక్రమముగ నెడిగి, యైదుగా భిన్నమై, మూఁడుగాఁ గూడుకొని, ఒకవైపు కొంకణమును, ఒకవైపు విజయనగరరాజ్యమును, ఒకవైపు తెలింగనా రాజ్యమును లోఁబఱచుకొని, మొగలులతో ననేక దినములు బెనగి, చిట్టచివఱకు ఔరంగజేబుచే 1686 వ సం॥ న నిర్మూలము చేయఁబడెను. ఈ హిందూస్థాన దక్కను మహమ్మదీయ రాజ్యములు బెనఁగుచుండు కాలములో, మహారాష్ట్రసంఘంబునం దంతర్గర్భితంబైన తేజంబు ప్రకాశంబై, సహ్యాద్రి పర్వతంబులమీఁది దవానలంబుపోలె, దూరమునుండి చూచుచున్న వారినెల్ల విభ్రాంతచేతస్కులం జేసెను.

ప్రకరణము. 4.

మహారాష్ట్ర విజృంభణమునకు సాహాయ్యకారణములు.

క్రిందట ప్రకరణమందు దక్షిణమున మహమ్మదీయరాజ్యము లెట్లేర్పడినవో చూచితిమి. ఈ రాజ్యములందు మహారాష్ట్రులయొక్క ప్రాముఖ్యత యెట్లు క్రమక్రమముగ హెచ్చెనో చూడవలసియున్నది.

అహమ్మదు నగరముయొక్క మొదటిరాజు బీరారులోని ప్రతి గ్రామ కరణ మయినట్టియు, మహమ్మదీయులలోఁ గలిసినట్టియు నైన నిజాముల్ ముల్కుపుత్రుఁడని యీ వఱకే చెప్పియుంటిమి. ఈతని బ్రాహ్మణయింటిపేరు భైరవ యనునదియే వీరి బైహిరీ వంశమయ్యెను. వీరు తమయొక్క పూర్వచరిత్రను విశ్వాసముతో జ్ఞాపక ముంచుకొనినవారై బేరారు పరిపాలకులనుండి ప్రతి గ్రామమును జఝుంచి తమ పూర్వచుట్టముల కినాముగ నిచ్చిరి. బేరారులోని ఉమ్మదుశాహియొక్క మూలపురుషుఁడును, విజయనగర రాజ్యమునం దుద్యోగమునందున్న యొక బ్రాహ్మణుని కుమారుఁడే. ఇదే విధముగ బీదరు రాజైన బరీదు వంశముయొక్క మూలపురుషుని యెడల యతిశయభక్తి విశ్వాసము వలన 400 మంది మహారాష్ట్రభటు లొక్కమారుగ మహమ్మదీయులైరి. ఇట్లు మహమ్మదీయులైన వారందఱును, మహారాష్ట్రులయెడల నొకవిధమైన పక్షపాతముగలవారై, వారిని వృద్ధిచేయఁ దలంచుచుండెడివారు.

1529 సం॥ము నందు బూరహాను నిజాముశాహి, తనప్రధాన మంత్రి పదవిని కమలసేనుఁడను నొక బ్రాహ్మణున కిచ్చెను. ఇబ్రహాము ఏదులశాహి 1555 సం॥న తాను సింహాసన మెక్కినపుడు, రాజ వ్యవహారములందును, యుద్ధకార్యములందును, మహారాష్ట్రులకే యెక్కువ యాధిక్యత నిచ్చుచు

వచ్చెను. పదునాఱవ శతాబ్ద మధ్యమున బీజపూరునందు మురారిపంతు అను బ్రాహ్మణుఁడు మంత్రిగానుండెను. యశుపండితుఁడను నతఁ డచ్చట ముస్తాఫా గానుండెను. గోలకొండయందు అక్కన మాదన్నలను వారు మంత్రిపదవుల నాక్రమించిరి. ఈ మాదన్న యను నతఁడే శివాజీకిని అబుల్ హుస్సేను లేక తానీషా యను గోలకొండ నవాబునకును స్నేహముఁ గొలిపెను.

దక్కను మహమ్మదీయులు, హిందూదేశమునకు వెలుపలనున్న మహమ్మదీయ రాజ్యములకు బహుదూరమున నున్న కారణమున, క్రొత్త దండయాత్రికులవలన మరలమరలఁ గలిసికొన నేరరైరి. ఢిల్లీయందు అఫ్గనులు, గాల్జీలు, తురుష్కులు, మొగలులు మొదలైనవారు మరలమరల వచ్చుచు మహమ్మదీయ సాంప్రదాయములను మార్పుఁజెందకుండ నిలుపుచు వచ్చిరి. దక్కనునం దట్లు వీలులేకపోయెను. ఇక్కడనున్న జీతబత్తెములకేర్పడిన విదేశీయయుద్ధభటులు విశ్వాసముతో నాధారపడియుండ యోగ్యతలేనివారుగను, రాజ్యపాలనకాటంకములునుగనుండిరిగాని, యంతయుపయోగముగనుండకపోయిరి. కావునక్రమక్రమముగ మహారాష్ట్రి సిలేదారులను, బార్గిరులను యుద్ధభటులుగఁ గైకొన వలసివచ్చెను. రెండవభామినీరాజు 200మంది సిలేదారుల నంగరక్షక సైన్యముగ నుంచుకొనెను. నాలుగవభామినీరాజగు ఇబ్రహీము ఏదులశాహి 30,000 మంది మహారాష్ట్రి బార్గిరుల నుంచెను.

రివిన్యూవ్యవహారము మొదటి కాంగో కాలమునుండియు దేశీయులచేతుల లోనే యుండెను. భామినీరాజ్యము అయిదుభాగముల క్రింద చీలునప్పటికిని, తరువాత సహితము రివిన్యూలెక్కలన్నియు మహారాష్ట్రిభాషలోనే జరుపఁబడుచుండెను. అందువలన మహారాష్ట్రిల నేకులు దేశపాండ్యాలుగను, దేశముఖులుగను నియమింపఁబడవలసిన యవసరము గలిగెను.

ఇంకొక కారణముకూడ, మహారాష్ట్రిల యధికారమునకు సహాయము నే చేసెను. దక్కనులోని మహమ్మదీయప్రభువులు తమశుద్ధాంతంబులకు హిందూస్త్రీలను దీసికొనుచు వచ్చిరి. ఏడవభామినీసుల్తాను విజయనగర వంశముతో సంబంధమునొందెను. తొమ్మిదవ భామినీసుల్తాను సోనఖేదు రాజు కుమార్తెను

వివాహమాడెను. మొదటి బీజపూరురాజు ముకుందరావు అనునొకబ్రాహ్మణుని సోదరిని వివాహమాడెను. ఈమెయే బాబూజీఖానూన్ అను నామమున రాణియయ్యెను. ఈమె పుత్రులే తండ్రితరువాత సింహాసనమునకు వచ్చిరి. బీదరు యొక్క మొదటిసుల్తానగు బరీదువంశజుఁడు తనకుమార్తెను, భామినీరాజ్యమున గొప్పయుద్యోగముచేసిన సాబాజీయను మహారాష్ట్రునకిచ్చి వివాహము చేసెను.

ఇంకొక కారణముగూడ, ముఖ్యముగ నాంధ్రదేశీయులు గమనించవలసి యుండును. దక్షిణమున తుంగభద్రానది యొడ్డుననున్న మన యాంధ్రరాజ్యము కూడ మహమ్మదీయులును హిందువులును నొండొరులయెడల గౌరవనిధానులుగ నుండఁ గొంత పనిచేసెను. ధనమునందును, ధైర్యమునందును, విస్తీర్ణమందును, వైభోగమందును మహమ్మదీయ రాజ్యములతోఁ దులఁదూగుచు, కొన్ని కొన్ని సారు లోడిపోయినను, కొన్నికొన్నిసారులు గెలుపొంది బహుకాలము ప్రతిఘటించి నిలచియున్న విజయనగరరాజ్యలక్ష్మి, మహమ్మదీయులను కొంత భయంబున నిలిపి, తమహిందూస్థానుసోదరులఁ బోలె విశేష దౌర్జన్యములకుఁ జొరఁబడకుండ నాపియుంచెను.

సైనికోద్యోగములందును,హిందువుల యాధిక్యతక్రమక్రమంబుగ ప్రబలమగుచునేయుండెను. కామరాజు, ఘాడ్గీ, హరినాయకుఁడు మొదలైనవారి నామములు, మొట్టమొదట భామినీసుల్తానులచే నియమింపఁబడిన మన్సబుదారులుగ ఫెరిస్టా చెప్పుచున్నాఁడు. రెండవభామినీసుల్తాను 200 సిలేదారుల నుంచెనని యీావలనే చెప్పియున్నాము. ప్రసిద్ధివహించిన వంగోజీ జగపాలరావు నాయకుఁడు పదునాలవశతాబ్దారంభమున గోలకొండబీదారు విజయనగర సంస్థానములలో రాచకార్యనిర్వహణదక్షుండై వెలసెను. ఇతఁడు కర్ణాటకంబున హిందూనాయకవాడీ సైన్యంబులను వశమునం దుంచుకొని రాజులను, నిష్టము వచ్చినట్లెల్ల, సింహాసనాసీనవిహీనులఁ జేయుచు నామమాత్రావశిష్టంబుగ రాజ్యవర్తించెను. పదునేడవ శతాబ్దారంభమున బీజపూరుసుల్తానులను మురారి జగదేవుడు ప్రసిద్ధంబుగ సేవఁజేసెను. ఇతఁడు బీజపూరునకును, షాజీ అహమ్మదునగ

రమునకును ప్రాప్తులైయుండిరి. మురారిరావుయొక్క వినాశమునకుఁ జేసినకుట్ర యిలో ముగ్గురు మహారాష్ట్రులు, రఘునాధపంతు లను నొకబ్రాహ్మణుడును, ఒక భాంస్లేసరదారును, ఒకఘార్పడేయు ప్రముఖులైయుండిరి. మురారిరావుక్రింద చందరరావుమోరే, రాజారావు, కొంకణయుద్ధములలో యున్నతికివచ్చిరి. మహాస్వాద్ నందలి మనేలు, వాడీయందలి శావంతులు, డఫ్లేలు, ఘోరేపురేలు మొదలైనవంశములవారీ కాలమందు అధికారప్రాభవంబు నొందియుండిరి.

పైనిచెప్పఁబడిన మహారాష్ట్రప్రముఖుల కొందఱియొక్క చరిత్రల వర్ణనిచ్చుట యనుచితముగాదు.

బీజపూరురాజ్యములోని మహారాష్ట్రముఖ్యు లెవ్వరనిన:—(1) చంద్రరావుమోరే; (2) రావునాయకనింబాల్కారు లేక ఫల్టణ్ రావు (3) జూజార్ రావు ఘాట్గే (4) రావుమనే, (5) ఘోరేపురే, (6) డఫ్లే, (7) శావంతు బహద్దర్ (వాడీదేశముఖు) మొదలైనవారు.

అహమ్మదునగర రాజ్యమందు....(1) లుకజీజాధవరావు, (2) షాజీ భాంస్లే మొదలైనవారు.

చంద్రరావు మోరే.—ఈవంశమునకు మూలపురుషుఁడైన మోరే యను నతఁడు మొట్టమొదట కర్ణాటకమున నొక నాయకుడు. యూసుఫ్ ఏదుల్ శాహి కాలములో 12000 హిందూకాల్బలమున కధికారిగ నియమింపఁబడి నీరా వరుణానదుల మధ్యనున్నభూమిని జయింపఁ బంపఁబడెను. ఇతఁడు విజయము నొంది, సిర్కెరాజుయొక్కవంశము నధికారమునుండి తొలగించి, వారి మద్దతుదారుల నందఱియొక్క బందిపోటుల నణచివేసెను. ఈకార్యనిర్వాహణమున కితనికి వంశపారంపర్యవచ్చు చంద్రరావు అను బిరుదియ్యఁబడెను. ఇతని కుమారుఁడగు జస్వంతరావను నతఁడు బూరహాను నిజాము శాహి కాలములో పురిందా వద్ద నొకయుద్ధమునందు బాహుపరాక్రమంబున శత్రువీరులనుండి, పచ్చజెండానొకటి పట్టుకొనెను. అందులకు వీరివంశమువారు జౌలీ సంస్థానమునకు రాజులుగా స్థిరముగ నుండుటకును, ఆ పచ్చజెండాను వారు శౌర్యచిహ్నముగ నుంచుకొనుటకును సుల్తా ననుగ్రహించెను.

రావునాయకనింబాల్కరు.—ఈయన ఫల్టనుయొక్క నాయకుఁడు. పల్టనురావనికూడ యీయనకు బిరుదుగలదు. వీరివంశముయొక్క మొదటిపేరు పవరు. నింబాలకు అను గ్రామమున వీరి పూర్వు లుండుటచేత నింబాల్కరని వీరికి పేరువచ్చెను. ఈవంశమువాడే వంగోజీనాయకుడు లేక జగపాల్ నాయక నింబాల్కరను నతఁడు. ఈతఁడు పదునేడవశతాబ్దములో మొదటిభాగమునందు నిరంతరమును ద్రోపిడి పనులయందు పేరుఁజెందినవాఁడు. ఈయన సోదరియగు దీపాబాయియే శివాజీయొక్క తండ్రి తల్లి. నింబాల్కరు, తన పూర్వీకుల బిరుదును రాజాయను బిరుదునకు మార్చుకొనుట కిష్టపడలేదు.

జూజర్ రావు.—ఈతఁడు ఘాట్గేవంశములో ముఖ్యుడు. ఈయన స్వదేశము కుత్తావుదేశము. ఇది నింబాల్కరుయొక్క జాగీరునుండి, మహాదేవ నగములవలన వేఱుచేయఁబడినది. ఈ ఘాట్గేలు మాను పర్గణాకు దేశముఖులై యున్నారు. వీరిలో ముఖ్యునొకనికి భామినీవంశము క్రింద మనసబుదారీ యుండెను. వీరిలో పూర్వకాలమునుండి నేటివఱకు, కుటుంబ కలహములు సుప్రసిద్ధము.

మనేరావు.—వీరి కుటుంబములో పెద్దవాడు, ఘాట్గేలయొక్క జిల్లా ప్రక్కనున్న మస్వారునకు దేశముఖుడు. బీజవూరురాజ్యమునందు వీరు పేరుఁజెందిన సిలేదారులుగ నుండెడివారు. సిర్కేలతో సమానముగ వీరును పగసాధించుటయందు పట్టుదలగలవారు.

ఘోరేపురే.—వీరు మొదట భాంస్లేవంశమువారే. వీరియొక్క పూర్వీకుఁడొకఁడు ఘోరేపురేయనగా యుడుముయొక్క నడుమునకు త్రాడుకట్టి కొంకణమునందొక కోటను సాధించినందున వీరి కా పౌరుషనామమువచ్చెను. వీరు రెండు కుటుంబములుగా చీలిపోయిరి. ఒక కుటుంబము వరుణానది యొద్దనున్న కాంప్సీలోను, రెండవది గుట్పర్భావద్ద మధోలులోనున్నవి. వీరు చాలకాలమునకు పూర్వమే ప్రసిద్ధిలోనికివచ్చిరి. కాంప్సీవంశములో నొకరికి అమీరుల్ ఉమ్రావు అను బిరుదియ్యఁబడెను.

సావంతులు.—గోవావద్ద వాడీయొక్క దేశముఖులు. పోర్చుగీసువారి మీద కొన్ని యుద్ధములలో వీరికి, బహాద్దర్ అను బిరుదును, బీజపూరు సుల్తా నిచ్చెను. వీరియొక్క పూర్వనామము భాంస్లేయైయుండెను. ఇప్పటికిని వీరిలో ప్రముఖుడు భాంస్లేయని పిలువఁబడును. వీరు కాల్బలమునకు నాయకులుగ పేరు పొందిరి. వీరి నివాసభూమికూడ నట్టి యుద్యోగమున కనుకూలమైనది.

లుకజీజాధవరావు.—ఈయన బేరారులో సింధేఖేదునకు దేశముఖుఁడు. దేవగిరి జాధవునియొక్క వంశస్థుఁడని చెప్పుదురు. ఈయనకాలములో, జాధవులవంశమంత గొప్ప తనమునన్నది మఱియొక వంశములేదు. ఈయన నిజాముశాహిరాజ్యములో 10,000 అశ్వసైన్యమున కధిపతిగానుండెను. ఈయన యే శివాజియొక్క తల్లి తండ్రి.

షహాజీభాంస్లే.—ఈయన బీజపూరు సంస్థానమునకు రాక పూర్వము అహమ్మదునగరములో చాలకాలము ప్రముఖుఁడుగ పనిచేసెను. ఈయన శివాజీ మహారాజునకు తండ్రి. ఈయన చరిత్రనుఁగూర్చి మఱియొక ప్రకరణములో విరళముగ విచారింతము.

పైచెప్పినకారణములవల్లను, 17 వ శతాబ్దమునఁ గలిగిన మార్పులవల్లను, నామ మాత్రంబునకు రాజులైన గోలకొండ బీజపూరు అహమ్మదు నగరముల ప్రభువులు, మహారాష్ట్రయోధులచేతను, రాజతంత్రజ్ఞులచేతను రాజకార్యంబులందు నడుపఁబడుచుండిరి. ఘాటీలదగ్గర పర్వతదుర్గములును తత్ప్రాంత దేశములును మహారాష్ట్రజాగీరుదారుల యధీనమందుండెను. ఈ మహమ్మదీయ ప్రభులమీద, వారు పేరునకు మాత్ర మాధారపడియుండిరి. ఇట్లు జాతీయవిమోచన క్రమక్రమముగ నిరుపద్రవముగ సిద్ధించుచుండ, ఢిల్లీ మహమ్మదీయరాజ్యమును తపతీనర్మదానదులకు దక్షిణమునకు విస్తరింపఁజేయ, అక్బరుమొదలు ఔరంగజేబువఱకును మొగలాయి చక్రవర్తులచేఁ జేయఁబడిన ప్రయత్నములవలన మఱియొక క్రొత్త యాపద దేశమునకు వాటిల్లెను. ఆ ప్రయత్నములు సఫలమయ్యెనేని, హిందువుల మొదటి యోటమియైన తరువాత మరల స్వతంత్రమును ప్రతిపాదించుటకుఁ బట్టి నన్ని సంవత్సరములు, అనఁగా మూఁడు

వేందల సం॥ లు దేశము మరల వెనుకఁ బడుట తటస్థించెడిదే. ఈ క్రొత్త యాపద, ఢిల్లీ సామ్రాజ్యముయొక్క యుపాధి సంపత్తు లన్నిటిచేతను వెనుకఁ ద్రోది యొసంగఁబడుటచేత బలవత్తర మైనది. అట్లు బలవత్తరమని దక్షిణమున హిందూ మహమ్మదీయ ప్రభువు లిద్దరును సమానముగ గ్రహించిరి. మహారాష్ట్రుల లోని యైకమత్యాభావము, మొగలులయొక్క సైన్యమును బహిరంగ రణరంగం బున ధర్మయుద్ధంబున నెదుర్కొన సామర్థ్య మొసంగఁ జాలకుండెను. కావున మహారాష్ట్రులచే నవలంబింపఁబడిన వానరయుద్ధము తత్సందర్భముల నపరిత్యజ్యనీయ మయ్యెను. మహమ్మదీయ దండయాత్రయొక్క ప్రథమాఘా తమును సహించి, దేశము కొంత తెప్పిరిల్లు శక్తిని చూపించెను. మహమ్మదీయ ప్రభువులు వైభోగంబునఁ గూలి, సోమరితనంబున జీర్ణంబు నొందువఱకు, మరల వేచియుండుట అంత ప్రయోజనంబు గాదయ్యె. ఈ క్రొత్త యాపదకు క్రొత్త తంత్రాంగ మవసరమయ్యెను. ఈ తంత్రాంగముకం టెను, ఒక్క నవీనశక్తి, ఒక్క సామాన్యప్రయోజన విచారణాసక్తి, విశాల మతధర్మ యుత్సాహ జనితంబైన యొక్క సామాన్యయభిమాన మెక్కువ యవసరమయ్యెను. మహారాష్ట్ర నాయ కులయొక్క చెదరిపోయినశక్తి నెల్ల నొక్క కూటంబుగ బంధింపవలసివచ్చెను. ఈ కూటము ఒక్కసామాన్యయుద్దేశంబుచే ప్రేరేపింపఁబడి, యొక్కసా మాన్య దేశభక్తిచే పరిపూతంబుఁ గావలసివచ్చెను. ఈ యాపదను లెస్సగ గ్రహించి యైకమత్యాభావమును వశమునందుంచుకొని, సామాన్య మతధర్మం బను నామంబున నాశక్తుల నెల్ల నొక్కమ్మడిగఁ గట్టుటయే, శివాజీయొక్క గొప్ప సుగుణము. అట్లతఁడు కేవల మాకాలమునందలి బలస్వరూపుండే గాక, సామాన్యకార్య నిర్వాహణమందు, మహారాష్ట్రమనంబుల కావేశ కారణభూతుం డగుట కా కాలంబునకు సంభవింపవలసిన యాధర్మంబున కవతారంబుగ ప్రకాశించెను. అతఁడు మహారాష్ట్రశక్తిని సృష్టింపలేదు. ఆశక్తి యంతకు పూర్వమే భూమియందుఁ బుట్టి భిన్నభిన్నముగా చెదరిపడి యుండెను. అట్టిదాని నొక్కచోఁ గుమిఁగూర్చి, సామాన్యవిపత్తిపై, ధర్మసంస్థాపనార్థం బతఁడు ప్రయోగించెను. అతనియొక్క ప్రభావమిద్ది; అతఁడు దేశమునకు చేసిన సేవ

యియ్యది; ఇందులకే యాతఁడు దేశజనుల కృతజ్ఞతాసూచక స్మరణకర్హుండు. అతనియనుచరు లతని దేవతావేశయుతుండగు నాయకునిగా నూరకఁ జూచి యుండలేదు. అతఁడుముందుగ తా నావేశమునుఁబొంది తనదగ్గరనున్న వారికెల్లనా యావేశమునొసంగెడువాడు.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

యనుభగవద్గీతావాక్య మిందువలన నేయతనియెడల సార్థకమైనది.

ఒక్కతన తరమువారికేఁగాక, తరతరములవఱకు, భరతవర్షమునం దన్ని భాగములందును, మహారాష్ట్రు లేర్పఱిచిన శిబిరములందెల్ల నా యాదర్శము భౌతికస్వరూపంబున దృగ్గోచరంబగువఱకు నా యావేశంబునొసంగియుండెను. కొంతవఱకు ప్రకృతిసిద్ధమైన కారణంబులవలనను, కొంతవఱకు పూర్వచరిత్రవలనను, కొంతవఱకు మతోద్ధారణవలనను, ముఖ్యముగా మహమ్మదీయుల ప్రభుత్వముక్రింద మూడువందలసంవత్సరములు యుద్ధశిక్షాపరిశ్రమంబువలనను, ఈవిధముగ మహారాష్ట్రజాతీయ ఫలపరిపాకమునకు మునుముందు క్షేత్రంబు పదను చేయఁబడెను.



ఛత్రపతి శివాజీమహారాజు.

ప్రకరణము ౮.

శివాజీయొక్క వంశావతారము.

ఉదయపూరు రాణాయగు శిశోదయ వంశశేఖరుండు రాజా భీమసింగు, తన యుగంబునఁ నద్వితీయ పరాక్రమవంతుఁడై, రాజ్యంబును సుఖప్రదంబుగ నేలుచు, ననుపమానకీర్తివంతుఁడై యుండెను. హిందూరాజులెల్ల నాయనకు మ్రొక్కుచు, సామంతులై యుండిరి. ఆయన కనేక భార్యలు గలరు. అందు పద్మిని యనునామె రూపలావణ్యంబులందును, వినయ విధేయతలందును, బుద్ధివిశేషంబులందును, సద్గుణ గణంబులందును, శౌర్య సాహసములందును మేటియై, రాజుయొక్క గారాబుసతియై, చరిత్రయందు విఖ్యాతిఁగాంచి యుండెను. ఆమె రామసింగు, బాగుసింగు అను నిద్దఱుసుతులను బడసెను. వారు పెద్దవారలైనపుడు భీమసింగు పరలోకగతుఁడయ్యెను. తండ్రి సింహాసనమును పెద్దవాఁడగు రామసింగధిష్ఠించెను. బాగుసింగు అన్నగారి క్రింద సేవఁ జేయుట కిష్టుండుగాక, మృగయావిహారమిషంబున నొక్కదినంబున తన స్వదేశమును విడచినవాఁడై, నర్మదానదీతీరంబున రాజా ఆలీమోహానుని రాజ్యంబున నివాసంబుఁ గైకొనెను. రాజా ఆలీమోహానుని మరణానంతర మతని కుమారుఁడు పిన్నవయస్కుఁడైనందున, రాజ్యభారము బాగుసింగున కొప్పగింత పెట్టఁబడెను. రాజకుమారుఁడు యౌవనారూఢుండైనంతన, నతనిరాజ్యమతని కప్పగించి బాగుసింగు దక్కనుదిక్కున కరిగెను. అతఁడు రాజ్యభారంబునకును, ఐహిక సౌఖ్యములకును ముఖము మొత్తినవాఁడై, సంతృప్తిని కాలంబు గడుప నిచ్చగించి, కుటుంబపోషణార్థం బవసరమైనమట్టుకు నార్జింప వ్యవసాయంబునకు ప్రారంభించెను. అతని బాగుసింగను నామ మీక్రింద కారణముచే బాగుభోంస్లా యని మార్చఁబడెను. ఆలీ మోహాను రాజ్యము వాఁడు

పాలింపుచుండ దుర్మార్గులను శాసనధిక్కారకుల ననేకుల శిక్షించి దేశము నందలి యల్లరులనెల్ల నణచి పుడమి నిష్కంటకంబుఁ గావించెను. హిందీ భాషలో భో యనగా శత్రువు, సాలా యనగా శరము. అతఁడు శత్రు హృదయాంతరాళంబున శరంబుబోలె నుండెనుగాన భోంస్లాయను పౌరుషనామంబు ధరించెను. అతఁడు పూనాదగ్గర దేవళగ్గాం అను గ్రామములో తన జాగీరులో నివాసంబుగ నుండెను.

బాగు భోంస్లాకు బాబాజీభోంస్లా యని కూడ పేరు వాడఁబడుచున్నది. ఈ బాగుభోంస్లాకు నలుగురుపుత్రులు గలరు. అందు పెద్దవాఁడు మాలోజీ, రెండవవాఁడు విఠోజీ. ఈ మాలోజీయు విఠోజీయు కొన్ని కుటుంబకలహములచేత, దేవళగామును విడిచి దౌలతాబాదులో వేరూలు అను గ్రామమునకు వ్యవసాయము చేసికొనఁగ కుటుంబములతో కాపురముండఁ జనిరి. వారు దౌలతాబాదులో సింధేఖేడు గ్రామమునకు దేశముఖు లేక చౌధురీ యైన లుకజీ జాధవు నుద్యోగము కొఱ కాశ్రయించిరి. జాధవరావు నిజాముశాహిలో 12,000 గుఱ్ఱపుదళమునకు మన్సబుదారుగా నుండెను. అతఁడు మాలోజీ విఠోజీలను తనవద్ద బార్గీరు * లుగా నుంచుకొనెను. అతండు స్థూలకాయుఁడగుటవలన గుఱ్ఱపుసవారి చేయఁజాలక, తఱుచుగ నింటివద్దనే యుండుటవలన, నీ యిద్దఱన్నదమ్ములను తనతో భోజనముచేయ రమ్మని పిలుచుచుండెడివాఁడు. వీరిద్దఱకును చెరి యొక యిరువదిరూపాయల జీతమిచ్చు చుండెడివాఁడు. అటుతరువాత వారు తమ కుటుంబములను అహమ్మదు నగరమునకు తెచ్చుకొని స్థిరముగ కాపురముండిరి.

మాలోజీభార్య కంతవఱకు సంతానములేదు. అహమ్మదునగరమునం దొక మహాత్ముఁడుండ నతని కామె మ్రొక్కుకొని తనకు కొడుకు పుట్టినయెడల

---

* బార్గీరనగా సర్కారుచే గుఱ్ఱము ఆయుధములు మొదలైన వాని నియ్యఁబడు పేదభటుఁడు. సిలేదారుఁ డనగా తాను స్వయముగ నన్నియును తెచ్చుకొని యెక్కువజీతమును బడసి స్థితిపరుఁడుగా నున్న భటుడు.

నతని పేరు పెట్టెద ననెను. ఆమహాత్ముని యాశీర్వచనమున నామెకు ఇద్దఱుపుత్రు లుదయించిరి. ఆ ఫకీరుయొక్క పేరు షా షరీఫ్. ఆమెకుఁ బుట్టిన ఇద్దఱు కుమారులలో నొకరికి షాజీయనియు నొకరికి షరాఫ్జీయనియు నామకరణములు చేసిరి. షాజీ చాల యందమైనవాఁడు. జాధవరావు పిల్లవానిఁజూడ నానందపడువాఁడై తఱచుగ వానిని తన సముఖమునకు దెప్పించుకొని ముద్దుదీర్చుకొనుచుండెడివాఁడు. ఆయనయును బిడ్డలులేక కొంతకాలముపిమ్మట జిజాబాయి యను ముద్దుకుమార్తెఁ గనెను. ఆమెయును మిక్కిలి యందకత్తెయై యుండెను.

షాజీ యైదుసంవత్సరముల ప్రాయమునను, జిజాబాయి మూఁడు సంవత్సరముల ప్రాయమునను, నున్నపుడు జాధవరావు తనయింట హోలీపండుగఁ జేసి యుద్యోగస్థులను స్నేహితుల నందఱను బిలిచి నృత్యగానంబుల వేడుక సలుపుచుండెను. అతఁ డొకతొడమీద తన కుమార్తెను, రెండవ తొడమీద షాజీనిఁ గూర్చుండఁ బెట్టుకొని వారిచేతికి గులాములిచ్చి యాడుకొమ్మని చెప్పెను. ఆసుందర బాలదంపతులనుఁజూచి యానందంబుఁ బట్టఁజాలక, అతఁడు "బాలిక సుందరవతి. దైవము తన స్వకీయ హస్తంబుచే నామె నలంకరించెను. షాజీయు సౌందర్యవిలాసంబుల నామె కుద్దియై యుండెను. దైవము శుభం బొడఁగూర్చుఁగాక!" యని ప్రకాశముగఁ జెప్పెను. అతఁ డట్లు వేగిరపాటున నానతిచ్చెను. సభలోని వారందఱును సెబా సనిరి. మాలోజీ విఠోజీ లప్పుడే సభకేతెంచినవారలై యిట్లు పల్కిరి. "నేటినుండి జాధవరావు వివాహంబువలన మాకు బంధువయ్యెను. అతఁ డాడినమాట తప్పఁడు. ఈ పిల్ల మా షాజీకి ప్రధానము సేయఁబడెను. ఇచ్చట నున్నవారందఱిందుకు సాక్షులు". అట్లు చెప్పి వారును గూర్చుండిరి. జాధవుఁ డేమియుఁ జెప్పక అనుమాన విస్మయారూఢ చిత్తుండై సభవిడిచి లోనికరిగెను. అతఁడు ప్రతిదినమును షాజీనికూడ తనతోఁ దీసికొని పోవుచుండెడివాఁడు. నాఁడు వాని నచ్చటనే డించి తన కుమార్తెనుమాత్రము లోనికిఁ దీసుకొని చనియెను. సభవారందఱును సంతోషములుమాని యిండ్లకుఁ బోయిరి.

అతనిభార్య యీ వృత్తాంతము నెల్ల నెఱింగి, జాధవునితో నిట్లనియె "పొట్టకూటికై స్వదేశంబును వీడి ద్రిమ్మరియై మనవద్ద సామాన్య భటుండగు నితనికిని మనకు నేటిసంబంధము? వియ్యంబు సరిసమానులకేఁ గాని యితరులకు చెల్లునా? ఇదంతయు విచారింపకుండ మీరు వచించుటేమి? వాడు దాని నాధారము చేసికొని సభవారి నందఱి నెదుట సాక్షులుగాఁ బల్కుటేమి? మీరైన ప్రత్యుత్తరమియ్యలేదుగా! మీరైన యీ సాహసంబును మందలింపకుపేక్షించితిరిగా!". జాధవుడు "నేను పరిహాసమునకంటిని. మన కులాచారప్రకారము నేనేమియు మాగును నిచ్చి ప్రధానము చేయలేదు. అట్టి యనుచిత సాహస వాక్యంబులఁ బల్కినవారిని, నేను ఉద్యోగమునుండి తొలఁగించి వేసెదను." అని తనభార్య మొదలైన యింటిలోని యాడువారినందరి నోదార్చెను. మఱునాఁడు మాలోజీ విఠోజీలను తనయింటికి భోజనంబునకుఁ బిలుపక పళ్లెరంబులయందు భోజనపదార్థంబులనుంచి వారికిఁ బంపించెను. వారును 'మేమీ భోజనంబును వివాహసమయంబున బుచ్చుకొందు' మని చెప్పిరి. అందు మీఁద జాధవరావునకు మఱింత యాగ్రహంబు హెచ్చి, వారి నిలువజీతములను వారికిప్పించి, యుద్యోగమునుండి తొలఁగించెను. వారు వెంటనే తమకుటుంబములతో స్వగ్రామంబుఁ జేరి యీ వివాహంబు నెటులైన చేసికొనవలెనని తత్ప్రయత్నంబుల నుండిరి.

మాలోజీయొక్క భార్య దీపాబాయి జగపాల్‌రావు నింబాల్కారు యొక్క సోదరి. ఈ జగపాలనింబాల్కారు కర్ణాటకంబునందును బీజపూరు నందును కొంతసైన్యమును సంపాదించి, తన సాహస శౌర్యంబులచేత ద్రోపిడి వ్యవహారమున ప్రసిద్ధిఁ గాంచియుండెను. అతని సహాయముచేతను, తనకు దేవి యనుగ్రహమువలననో లేక మఱి యాగంద్రగోళకాలములో బావ మఱది యొక్క వృత్తి నవలంబించుటవలననో దొరకిన ధనముచేతను, మాలోజీ గొప్ప సైన్యమునుఁ గూర్చికొని అహమ్మదునగరసంస్థానమునందలి దౌలతాబాదులోని మసీదునందు పందులను చంపి వాని మెడల క్రిందివిధముగ నిజాముశాహికి యుత్తరములఁగట్టి పారవేసెను. 'లుకజీజాధవుడు, నా కుమారునికి తన కుమా

ర్తైను హోలీపండుగలో నిండుసభలో ప్రధానముచేసెను. ఇప్పుడు అవివేకులగు స్త్రీజనంబులమాటలు విని వాగ్దానమును భగ్నముచేయ నుద్యుక్తుఁడగు చున్నాఁడు. అతఁడు నన్నుద్యోగమునుండి తొలగించి రాజ్యమునుండి తరిమి వేసెను. కావున నేనిప్పుడు నింబాల్కారు సహాయమునవచ్చి, ఈ సాహసకృత్యము చేసితిని. ఈ విజ్ఞాపకునకు న్యాయము చేయుదురని నమ్ముచున్నాను. లేనియెడల దక్కను రాజ్యముయొక్క ప్రతి మసీదునందును పందులను చంపి పారవేసెదను." ఇట్లుచేసి అతఁడు నింబాల్కారు గ్రామమగు ఫల్టానుకు పోయెను.

నిజాము యుత్తరములను, దారుణకృత్యమును, సేవకులచే చూపింపఁబడినవాఁడై, ఖిన్నుఁడై జాధవురావును బిలిపించి, యతని నయమునను భయమునను సమ్మతిపరచి, యతనికూతును షాజీ కిచ్చునట్లు చేసెను. వివాహము కడు సంభ్రమముగ రాజ సముఖమున దౌలతాబాదులో జరుపఁబడెను. షాజీయొక్క రూపురేఖావిలాసంబులకు మెచ్చి సుల్తాను మేలుదుస్తులను, ఖడ్గమును, ఏనుగను బహుమతిగ నిచ్చెను. మాలోజీనికూడ, జాధవురావుతో వియ్యమునకు సరిగానుండుటకు, 12000 అశ్వసైన్యమున కధిపతిగఁ జేసెను. మాలోజీయు తాను సంపాదించిన ధనముతో జనోపయోగార్థము చెఱువులను త్రవ్వించి, సత్రములను గట్టించి, దేవాలయములను నిర్మించి, ప్రజారంజకుఁ డయ్యెను.

షాజీకి సుమా రిరువదిసంవత్సరములు వయస్సు యుండఁగ మాలోజీ విఠోజీలు కీర్తిశేషులైరి. వారిస్థానంబున షాజీయధిష్ఠితుఁ డయ్యెను. అప్పటికి నిజాముశాహి పరలోకగతుం డగుటవలన మాలికాంబ రనునతఁడు కుమార నిజాముశాహికి రక్షణకర్తగనుండి రాజకార్యములనెల్ల నిర్వహించుచుండెను. మాలికాంబరు మొగలులతో జేసిన యుద్ధములలో షాజీ తనపరాక్రమము నెల్లఁ జూపుచు యతనిచే గారవింపఁబడుచుండెను. జాధవరావు, తనయొక్క యాధిక్యత నంతగా మాలికాంబరు పాటింపక పోవుట వలనను, తనకంటె చాల చిన్నవాడగు తనయల్లుఁ డెక్కువ గారవింపఁబడుట వలనను, 1621 సం॥ మున అహమ్మదు నగర రాజ్యమును విడిచినవాఁడై, మొగలుపక్షమునకుఁ బోయి

24,000 గుఱ్ఱపుదళంబున కధిపతిగఁజేయఁబడెను. తరువాత షాజీకి జీజాబాయి యందు శంభాజీ యనునొక పుత్రుడు కలిగెను.

1626 సం॥ మున మాలికాంబరు మృతుఁడయ్యెను. మాలికాంబరు లేని కారణమున మొగలులు అహమ్మదు నగరరాజ్యమును రూపుమాపవలె నను నుద్దేశముతో దండెత్తివచ్చిరి. అప్పుడు నిజాము రాజ్యమునకు షాజీయే ముఖ్యమైన ప్రాపుగ నుండెను. జాధవరావు మహారాష్ట్రప్రముఖుల ననేకులను మొగలుపక్షమునకు త్రిప్పివేసెను. షాజీమాత్రము నిజాముశాహియం దభిమానము గలవాఁడై దౌలతాబాదు కోటను ఆరునెలలవరకు రక్షించెను. చిట్టచివర కిఁక రక్షించు టసాధ్యమని తలఁచి తన సైన్యముతో బీజపూరు రాజ్యమునకు వచ్చి కొలిచెద నని సుల్తానునకు మురారి జగదేవమంత్రిద్వారా రాయభారమంపి యట్లు సమ్మతిఁ గొనెను. ఒకనాఁ డర్ధరాత్రంబున తన కుటుంబముతోడను 5000 సైన్యముతోడను కోటనుండి బయలుదేరి బీజపూరునకు ప్రయాణమయ్యెను. జీజాబాయి యప్పుడు ఏడుమాసముల శివాజీని గర్భవతియైయుండి, గుఱ్ఱముమీద ఏడెనిమిది మైళ్లు పోయినతరువాత సొమ్మసిలి మూర్ఛపోయెను. మూర్ఛ కొంచెము తెలిసిన తరువాత షాజీ యామెకు 'మీ తండ్రి వెనుకతఱుముకొని వచ్చుచుండును. నేనిచ్చట నిలువఁ గూడదు. ఆయన మాననీయుండైన నీకేమియు హానిచేయఁడు. కావున నిచ్చట నేయుండి పొమ్ము' అని యోదార్చి కొంతసిబ్బందినిచ్చి తాను బీజపూరునకు సాగిపోయెను. తరువాత జాధవుఁడు వచ్చి తనకుమార్తె యున్న దురవస్థఁజూచి పరరాజుల సేవఁజేయుచు, పడుచున్న పాట్లనుఁ దలంచుకొని కొంత చింతించి, యేమియు చేయంజాలక నామెను సురక్షితముగ శివనేరు దుర్గమునకుఁ బంపెను. అచ్చట యామెకు శివాజీ ప్రసవ దినంబులందు గలిగిన యాలోచనలు చదువరు లూహించుకొనవచ్చును. 'స్వరాజ్య ప్రతిష్ఠాపనాశాలి యగు కూరుండు నీయంశంబున నాకు బుట్టెనేని, నీపేరు పెట్టెద' ననియచ్చట శివ యను నామంబున బరగియున్న భవానీదేవి కామె మ్రొక్కుకొనెను. శివాజీ శాలివాహన శకము 1549 క్షయ సంవత్సరము వైశాఖ శుద్ధపంచమి (క్రీ. శ. 1627 మేనెల) నాడు జన్మించెను.

ఈ విధముగ అహమ్మదునగరము జయింపఁబడునంతలో, 1627 సం॥ మున జహాంగీరు చక్రవర్తి పరలోకగతుండయ్యెను. షాజహాను రాజ్యమునకు వచ్చెను. దక్షిణమున యుద్ధములు నడుపుచున్న ఖాన్‌జహానులోడీకిని క్రొత్త చక్రవర్తికిని వైరము గలదు. షాజహాను అతనిని, మాళ్వాకు సైన్యాధిపతిగమార్చి యొకసారి ఢిల్లీకి వచ్చి పోవలసినదని యుత్తరు విచ్చెను. ఖాన్‌జహానులోడీ భయపడి, అహమ్మదునగరమునకు పాఱి వచ్చి, యచ్చటనుండి షాజహాను సైన్యములవలన తఱుమఁబడ దేశదేశములందును ద్రిమ్మరి చిట్టచివరకు ఆఫ్గనిస్థానము పోవ నుద్యుక్తుఁడై యుండగ చక్రవర్తి సైన్యములచే చంపఁబడెను.

లుకజీజాధవుఁడును తన జాగీరగు సిందేఖేడు నందు పోయి నివసించి యుండెను. నిజాముశాహియొక్క కుమారసుల్తాను కొంచెము పెద్దవాడైనందున రాజ్యభారమును వహించి, మాలికాంబరు కుమారుఁడైన ఫత్తేఖానుడు తనపై చేయుసాగించిన నిరంకుశాధికారమును సహింపఁ జాలనివాడై, వానిని 1630 సం॥ న ఖైదునందు త్రోయించి లుకజీజాధవుని మంత్రిగా నుండుమని కోరెను. లుకజీజాధవుడును తనపూర్వవైరు లెవ్వరును లేకుండుటం జేసి యందులకు సమ్మతించెను, కాని సుల్తాను, వెనుక లుకజీజాధవుడు తన రాజ్యము నందనేక యుపకారములనుఁ బొంది మొగలులతోఁ గలసి తనరాజ్యమును నాశనముచేసి నందుకు, లోపల క్రౌర్యమును బూని, యతని నొకనాఁడు కోటలోనికి రహస్యస్థలమునకు రప్పించి యక్రమముగఁ జంపించెను. లుకజీజాధవు భార్య స్వంత సైన్యముతో సిందేఖేదునకుఁ బోయి యచ్చటినుండి మఱఁదియగు జగదేవరావుతోఁ గూడఁగలసి, చక్రవర్తి యొద్ద కరిగి మఱఁదికి 5000 గుఱ్ఱపు సైన్యమున కాధిపత్యము వచ్చునట్లు చేసెను.

ఆ సంవత్సరముననే షాజీ బీజపూరునందున్న మహారాష్ట్ర ప్రముఖుఁడగు మోహితీవంశజు నొకని కుమార్తెను రెండవ వివాహముఁ జేసికొనెను. ఆమె పేరు తుకాబాయి. జిజాబాయి యొక్క పెద్ద కుమారుఁడగు శంభాజీ తండ్రి యొద్దనే యుండెడివాఁడు. వీరితో నీయన బీజపూరునందు కాపుర ముం

డెను. జిజాబాయికి, తండ్రి యక్రమముగఁ జంపఁబడెనను దుఃఖముచేతను, భర్త మరల వివాహము చేసికొనెనను కోపముచేతను, తాను చిన్ని కుమారునితో రాజకీయకలహములయందు చేరనొల్లక నొక్కతెయు నిజామశాహీలో బైజాపూరను గ్రామమున నుండెను.

షాజహాను మరల అహమ్మదు నగరమును జయింప 1631 సం॥ లో సైన్యము నంపెను. నిజామశాహీసుల్తాను, తగినమంత్రు లెవ్వరును లేక ఖైదులో నున్న ఫత్తేఖానును విడుదల చేసెను. ఆఫత్తేఖానుఁడును మనంబున క్రోధము వహించియుండి, సమయము వేచియుండి, సుల్తానును ఖైదునందుఁ ద్రోసి షాజహానునకు కోటను సమర్పించెదనని రాయభార మంపెను. షాజహానును, ఫత్తేఖానున కనేక బిరుదులనిచ్చి, నిజామశాహిరాజ్యములోని మంచి యేనుగులను విలువగల నగలను పంపించినయెడల, నిదివఱకు పట్టుకొనఁబడని దుర్గముల నతని కిచ్చెదమని వర్తమానమంపెను. ఇట్టి దురవస్థఁ జూడఁజాలక, యారాజ్యమును సులభముగ బీజపూరు సుల్తాను సంపాదించుకొన వచ్చునని, బీజపూరుసుల్తాను నచ్చటికి దండెత్తమని షాజీ బోధించెను. ఫత్తేఖాను, ఏనుగులను, విలువగల నగలను విడనాడ ననుమానించుచున్నను, బీజపూరు సైన్యము వచ్చుచున్నదని తెలియఁగనే కోట మొగలులయధీనము చేసెదనని మొగలుసైన్యాధిపతికి కబురు పంపెను. బీజపూరు సైన్యము ముందుగ కోటఁజేరి, మొగలు సైన్యముతో ఘోరయుద్ధము చేసినను, చివరకు మొగలులచే తరిమి వేయఁబడెను. బీజపూరు సైన్యాధిపతి యప్పుడు ఫత్తేఖానునకు, కోటను, మొగలుల స్వాధీనము చేయుటవలన గొప్పనష్ట మతనికి గలుగఁ బోవుననియు, షాజీకి మాత్రము తగిన ప్రతిఫల మిచ్చినయెడల నతని పక్షమునే తా మవలంబించి, మొగలులఁ దోలివేయుదు మనియు, రాయభార మంపెను. ఫత్తేఖా నందుల కియ్యకొని మొగలులకు కోట స్వాధీనము చేయకపోయెను. మొగలుసేనాని యందులకై యలిగి, 58 దినములు ముట్టడించి కోట స్వాధీనము చేసికొని, ఫత్తేఖాను నుద్యోగమునుండి తొలగించి పించనిచ్చి డిల్లీకి పంపివేసెను.

షాజీ బీజపూరు సైన్యమునందు ముఖ్యుఁడుగనుండెను. కావున నతని గర్వమును కొంత యణచుట మొగలుల కవసరమాయెను. దౌలతాబాదుముట్టడి జరుగుచుండగ, త్రింబకు కోటకు, నిజాముశాహి క్రింద, గవర్నరుగానున్న మాల్దారుఖాను అనునతడు చక్రవర్తి పక్షమునఁ జేరెదనని మహబత్ ఖానుద్వారా రాయభారము చేయఁదలంచెను. దౌలతాబాదు ముట్టడి జరుపుచున్న మహబత్ ఖాను, షాజీయొక్క కుటుంబమును పట్టి యిచ్చినయెడల, చక్రవర్తి కతని యెడల దయగలుగు నని చెప్పెను. అంతట మాల్దారుఖానుడు బైజాపూరునందున్న శివాజీ జిజాబాయిలను పట్టుకొని మహబత్ ఖానున కప్పగించెను. కాని మొగలు సైన్యములోనున్న జిజాబాయి బంధువు, లామెను షాజీ విడిచిపెట్టి మరియొక భార్యను వివాహమాడెననియు నతని రక్షణలో నామె లేదనియు, చెప్పి యామెను విడిచిపెట్టించి కొండనే *దుర్గమునకుఁ బంపివేసిరి. ఇది 1633 వ సం॥ములో జరిగెను. శివాజీ కప్పు డారుసంవత్సరములు.

దౌలతాబాదు లోఁబడిన పిమ్మటను, ఫత్తేఖాను పట్టుకొనఁబడిన తరువాత, 1634వ సం॥ లో షాజీ నిజాముశాహికి మఱియొక చిన్నపిల్లవాని సుల్తానుగాఁ బ్రకటించి తాను సంరక్షకుఁడుగా రాజ్యముచేయ యత్నించెను. ఇందు ఏదులశాహియు మురారిజగదేవుఁడు నీతనికి సహాయ మొసఁగిరి. షాజహాను, తాను గెలిచితి ననుకొన్న రాజ్యమంతయు, మరల షాజీచేతను క్రమక్రమంబుగఁ జారుచుండుట కెంతయు క్రోధంబు నొంది, గొప్పసైన్యమును బీజపూరు మీఁదకును షాజీ మీఁదకును బంపెను. బీజపూరు సుల్తాను, చాలవఱకు యుద్ధముచేసి, చిట్టచివరకు మొగలు సైన్యములు దేశమునంతను పాడుచేయుట చూచి యోర్వఁజాలక, సంధిచేసికొన సంసిద్ధుఁడయ్యెను. షాజీయు నేమియు చేయఁజాలక చక్రవర్తికి సేవకుఁడ నయ్యెదనని తెలియపఱచుకొనెను. చక్రవర్తియు నతనిని బీజపూరు రాజ్యమునందుఁ జేరుట కనుజ్ఞ

---

* ఈ కొండనే దుర్గమునకే తరువాత సింహగడ అనునామము శివాజీచే పెట్టఁబడెను.